
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 12, డిసెంబరు 2024



కొండంత అక్రమానికి గోరంత కేసుతో సరి

భలే ఏమార్చారు!

- రైతులపైకి నెట్టి సూత్రధారులను వదిలేశారు
- నకిలీ ధ్రువపత్రాల కేసును నీరుగార్చిన యంత్రాంగం
- తహసీల్దార్ ఫిర్యాదు చేసిన రెండు నెలలకు అరెస్ట్
- నాలుగేళ్ల అక్రమాల్లో వెలికితీసింది రెండు నెలలవే
- భారీగా ముడుపులు ముట్టడమే కారణమన్న ఆరోపణలు



వైసీపీ పాలనలో కొనకనమిట్ల మండలంలోని కొందరు ఆపార్టీ సానుభూతిపరులు రెచ్చిపోయారు. ఇష్టారీతిన నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి బ్యాంకులకు టోకరా వేశారు. పింఛన్ల విషయంలోనూ ప్రభుత్వాన్ని మోసం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమాలు బయటకు రాగా విచారణను అధికారులు నీరుగార్చారు. చివరికి ముగ్గురు రైతులు, ఒక మీసేవ, ఒక జెరాక్స్ సెంటర్ నిర్వాహకులను అరెస్ట్ చేసి మమ అనిపించారు. మండల పరిధిలో ఉన్న అన్ని బ్యాంకుల్లో విచారణ చేస్తే భారీ మొత్తంలో అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. నకిలీపత్రాలతో పింఛన్లు పొందిన వారిని కూడా విచారించాల్సి ఉంది. కానీ పెద్దమొత్తంలో ముడుపులు అందుకున్న స్థానిక అధికారులు అక్రమాలపై దృష్టిసారించేటట్లు కనిపించడం లేదు. ఈ వ్యవహారంపై జిల్లా స్థాయి అధికారులు కన్నేస్తేనే మొత్తం బాగోతం బయటపడుతుంది.

మార్కాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి బ్యాంకుల్లో రుణాలు, సామాజిక భద్రత పింఛన్లు వందలాదిగా వైసీపీ వర్గీయులు కొట్టేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్‌గా పనిచేసిన ఓ జెరాక్స్ కేంద్రం నిర్వాహకుడు ఈ అక్రమ వ్యవహారాలకు సూత్రధారిగా ఉన్నాడు. సుమారు ఐదేళ్లపాటు అధికారం అండతో యథేచ్ఛగా ఈ అక్రమ తంతు కొనసాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇది వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ అధికారులు మండలం మొత్తం విచారించకుండా కొన్ని ఆధారాలను మాత్రమే సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక మండల స్థాయి అధికారి చేసిన ఫిర్యాదుపై పోలీసులు రెండు నెలలపాటు శోధించారు. చివరికి తూతూమంత్రంగా కేసు నమోదు చేసి ముగ్గురు రైతులను, ఓ మీసేవ, జెరాక్స్ సెంటర్ నిర్వాహకులను అరెస్టు చూపారు.

భారీస్థాయిలో అక్రమాలు

కొనకనమిట్ల మండలం గొట్లగట్టు కేంద్రంగా జెరాక్స్ సెంటర్‌ను నడుపుతున్న మంత్రి శ్రీను అనే వ్యక్తి వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్‌గా పనిచేశాడు. అధికారపార్టీ నాయకుల అండ ఉండటం, పొదిలికి చెందిన మీసేవ కేంద్రం నిర్వాహకుడు డి.సుబ్బారావు సహకరించడంతో ఐదేళ్లపాటు నకిలీ ధ్రువపత్రాలను తయారు చేసి అవసరార్థులకు అమ్ముకున్నాడు. ప్రధానంగా అతను తయారుచేసిన 1బీ, అడంగళ్లను బ్యాంకుల్లో పెట్టి వందలాది మంది వైసీపీ వర్గీయులు రుణాలు పొందారు. అక్రమ తంతు ద్వారా అప్పటి వలంటీర్ శ్రీను బాగా సంపాదించాడు. ఇవేకాక సామాజిక భద్రత పింఛన్లు పొందేందుకు అవసరమైన ఆధార్ కార్డుల్లో వయసును పెంచడం, సదరమ్ సర్టిఫికెట్లు దొంగవి సృష్టించడం చేశాడు. అతనికి సాంకేతిక అంశాలు, శాఖపరమైన విషయాల్లో ఇద్దరు వీఆర్వోలు, పలువురు పంచాయతీ కార్యదర్శులు సహకారం అందించారు. సచివాలయాల్లో పనిచేసే చాలామంది వెల్ఫేర్ సెక్రటరీలను కూడా

మిగతా 6వ పేజీలో



కొండపిలో నోటిఫికేషన్‌ను అంటిస్తున్న ఈవో రామారావు

నీటిసంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

- 342 డబ్ల్యూయూఏలకు ఇచ్చిన అధికారులు
- 14న ఎన్నికలు
- పలుచోట్ల సిబ్బందికి శిక్షణ

ఒంగోలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు సార్లు వాయిదా పడిన ఆ ఎన్నికల షెడ్యూల్ నాల్గోసారి ముడిపడింది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. ఆయా నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమితులైన ఎన్నికల అధికారులు వాటిని సంబంధిత ప్రాంతాల్లో ప్రకటించారు. జిల్లాలో మొత్తం 342 డబ్ల్యూయూఏలు, వాటి పరిధిలో సుమారు 2.10 లక్షల మంది ఆయకట్టుదారులు సభ్యులు ఉన్నారు. ఒక్కో డబ్ల్యూయూఏకు ఒక ఎన్నికల అధికారి, మరొక అసిస్టెంట్ ఎన్నికల అధికారిని నియమించి ఎన్నిక నిర్వహించే ప్రాంగణాలను గతంలోనే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎంపిక చేశారు. ఎన్నికల అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. గెజిటెడ్ హోదా కలిగిన మండల స్థాయి అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించగా వారంతా తమ పరిధిలోని నీటిసంఘాల ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చారు. డబ్ల్యూయూఏల ఎన్నికలు 14వతేదీన జరగనున్నాయి. మైనర్ ఇరిగేషన్‌లో ఆరు, మీడియం, మేజర్ విభాగంలో 12 ప్రాదేశికా(టీసీ)లు ఉండగా రైతుల నుంచి టీసీ సభ్యులను తొలుత ఎన్నుకుంటారు. వారు ఎన్నికల అధికారి సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. నామినేషన్ల స్వీకరణ, టీసీ సభ్యుల ఎన్నిక తద్వారా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అంతా 14వతేదీన జరగనుంది. నిర్వహణలో ఎన్నికల అధికారులతోపాటు మూడు టీసీలకు ఒక పోలింగ్ సిబ్బందిని కూడా నియమించారు. వారికి రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది తోడుగా ఉండనున్నారు. ఈ నేపథ్యంలో డబ్ల్యూయూఏల ఎన్నికలకు బుధవారం ఉదయం నోటిఫికేషన్ ఇచ్చిన అనంతరం పలు మండలాల్లో తహసీల్దార్ల ఆధ్వర్యంలో మొత్తం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అలాగే ఎన్నికల నిర్వహణ సామగ్రిని ఆయా ప్రాంత ఇరిగేషన్ డీఈలు తమ పరిధిలోని జేఈలు ఇతర సిబ్బందికి బుధవారం ఇచ్చారు. వారు గురు, శుక్రవారాల్లో ఆ మెటీరియల్‌ను సంబంధిత ఎన్నికల అధికారులకు అందజేయనున్నారు.

వీరుడా.. వందనం

- పది మందిని కాపాడి.. ప్రాణాలొదిలిన జిల్లాకు చెందిన హవల్దార్ వెంకటసుబ్బయ్య
- మృతదేహం అనంతపురం జిల్లా నార్పల గ్రామానికి చేరిక
- అధికార లాంఛనాలతో నేడు అక్కడ అంత్యక్రియలు
- స్వగ్రామమైన కంభం మండలం రావిపాడులో విషాదం
- కన్నీరుమున్నీరవుతున్న తల్లి
- మంత్రి స్వామి, ఎమ్మెల్యేల దిగ్భ్రాంతి



జవాన్ వెంకటసుబ్బయ్య ఫొటోను పట్టుకొని విలపిస్తున్న తల్లి గాలెమ్మ

కంభం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన హవల్దార్ వెంకటసుబ్బయ్య వీరమరణం పొందారు. సరిహద్దుల్లో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో సోమవారం ఆయన జవాన్‌లతో కలిసి జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో గాలింపు చేపట్టారు. ఆ సమయంలో భూమిలో అమర్చిన మందుపాతరపై ఆయన కాలు పెట్టారు. వెంటనే పక్కన ఉన్న సిబ్బందిని దూరంగా వెళ్లమని సూచించారు. కొద్దిసేపటి తర్వాత మందుపాతర పేలి మృతి చెందారు. తమను కాపాడిన వెంకటసుబ్బయ్య పార్థివదేహం వద్ద జవాన్లు నివాళులర్పించినట్లు తెలిసింది. రక్తం గడ్డ కట్టే చలిలో మంచు కురుస్తున్న సమయాన జమ్మూకాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో వీరమరణం పొందిన హవల్దార్ వరికుంట్ల వెంకటసుబ్బయ్య (40)కు వీరుడా.. వందనం అంటూ జిల్లావాసులు అశ్రునివాళి ప్రకటించారు. మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు తీవ్ర దిగ్భ్రాంతి



వెంకటసుబ్బయ్య (ఫైల్)

మిగతా 6వ పేజీలో

బోగస్ పత్రాలతో భూంఫట్

- మానేపల్లిలో 89.59 ఎకరాల విక్రయం
- అక్రమార్కులతో రాజానగరం, వైపాలెం సబ్‌రిజిస్ట్రార్ కుమ్మక్కు
- ఎనిమిది మందిపై కేసు నమోదు
- నలుగురి అరెస్టు.. 14 రోజులు రిమాండ్
- నిందితుల్లో బాధితుడి కుమార్తె, అల్లుడు
- భూమి కొనుగోలు చేసిన వారిపైనా కేసు

పుల్లలచెరువు,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బోగస్ పత్రాలు సృష్టించి 89.59 ఎకరాల భూమిని కాజేశారు. సంస్థ పేరుతో నకిలీ స్టాంపు తయారు చేయించి ఆ భూమిని కోట్ల రూపాయలకు అమ్ముకొని సొంత అకౌంట్లకు జమచేసుకున్నారు. ఇందులో బాధితుడి సొంత కూతురు, అల్లుడు, కాపలాదారుడి పాత్ర ఉండటం గమనార్హం. పుల్లలచెరువు మండలం మానేపల్లిలో భూములు కాజేసిన వ్యవహారంపై పోలీసుల విచారణలో విస్తుగొలిపే అంశాలు వెల్లడయ్యాయి. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను సేకరించిన పోలీసులు బుధవారం నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరో నలుగురిని అరెస్టు చేయాల్సి ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దారవీడు మండలం సానికవరంనకు చెందిన సత్తి శ్రీనాగవెంకట సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తి ప్రస్తుతం అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో నివాసం ఉంటున్నారు. నాగమోహన్ ఆగ్రో ఫాం పేరుతో సంస్థను ప్రారంభించి తన కుమార్తె, అల్లుడుతో కలిసి పుల్లలచెరువు మండలం మానేపల్లి రెవెన్యూలోని సర్వే నెం.24లో 89.59 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ తరువాత కుమార్తె, అల్లుడు తమ వాటాలను సంస్థకు అమ్మేసుకున్నారు. కొద్దికాలం అనంతరం కుమార్తె చంద్రలేఖ, అల్లుడు వంశీ మోహన కృష్ణారెడ్డి, కాపలాదారు ఘంటా శ్రీను ఆ భూమిని కాజేయాలని కుట్రపన్నారు. అనుకున్నదే తడవుగా ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ద్వారా తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఆ భూమిని బోగస్ పత్రాలతో అమ్మకానికి పెట్టారు. అక్కడి సబ్‌రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై ఈ ఏడాది ఫిబ్రవరి 28న మల్లాడి సోమిరెడ్డికి దస్తావేజు నెం.7881/2024 ద్వారా 37.00 ఎకరాలు, 29న కె.శ్రీదేవికి ద.నెం.8006/2024 ద్వారా 37.50 ఎకరాలు, మార్చి 28న పులగం రామకృష్ణారెడ్డికి ద.నెం.9058/2024 ద్వారా 15.09ఎకరాలు మొత్తం 89.59ఎకరాల భూమిని సంస్థ పేరుతో నకిలీ స్టాంప్ తయారు చేసి అమ్మివేశారు. ఇందుకు భూమి ఉన్న ప్రాంతమైన వైపాలెం సబ్‌రిజిస్ట్రార్ కూడా అంగీకారం తెలపడంతో అందుకుగాను భారీగా ముట్టజెప్పారు. భూమిని అమ్మగా వచ్చిన నగదును సంస్థ బ్యాంకు అకౌంటులో జమ చేయాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా నిందితులు సొంత అకౌంట్లలో జమ చేయించుకున్నారు. తన భూమిని పరిశీలించుకునేందుకు

మిగతా 6వ పేజీలో



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా

విజన్-2029 జిల్లా ప్లాన్‌పై ప్రశంస


- నేడు ప్రజెంటేషన్ ఇవ్వనున్న కలెక్టర్ అన్సారియా
- రెండు రోజుల సదస్సులో కీలక అంశాలపై నివేదిక

ఒంగోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి యంత్రాంగం రూపొందించిన విజన్-2029 ప్రణాళికకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక గుర్తింపు లభించింది. దానిని రూపొందించిన తీరు, గుర్తించిన అంశాలు, వాటి ఆధారంగా సూచించిన భవిష్యత్ కార్యాచరణ బాగున్నాయన్న ప్రశంసలు కలెక్టర్‌కు అందాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అందిన ప్రణాళికలను బుధవారం నుంచి ప్రారంభమైన కలెక్టర్ల సదస్సు సందర్భంగా ప్రభుత్వం ఉన్నత స్థాయిలో నియమించిన త్రిసభ్య కమిటీ పరిశీలించింది. రాష్ట్రస్థాయి విజన్ ప్లాన్‌ను ఈనెల 13న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేయనున్నారు. అందులోభాగంగా జిల్లా, మండల స్థాయి ప్రణాళికలను తయారు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అన్ని జిల్లాలు, మండలాల్లో వాటిని రూపొందించారు.

మూడింటిలో జిల్లాకు స్థానం

ప్లాన్ బాగా రూపొందించిన మూడు జిల్లాల కలెక్టర్లు సదస్సులో రెండో రోజైన గురువారం సాయంత్రం తమ ప్రణాళికలపై ప్రజెంటేషన్ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ముఖ్యకార్యదర్శుల స్థాయిల్లోని ముగ్గురు అధికారులతో ఉన్న కమిటీ అన్ని జిల్లాల ప్రణాళికలు పరిశీలించి ప్రకాశం, గుంటూరు, కాకినాడ జిల్లాలను ఎంపిక చేసింది. ఆ విషయాన్ని మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఆ కమిటీ ఆయా కలెక్టర్లకు సమాచారం ఇచ్చింది. గురువారం సాయంత్రం సదస్సులో ప్రజెంటేషన్ ఇవ్వాలని తెలియజేసింది. తదనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం సాయంత్రం జిల్లా ప్రణాళికపై సదస్సులో మాట్లాడనున్నారు. జిల్లాలో 2022-23 అంచనాల ప్రకారం మొత్తం స్థూల ఉత్పత్తి విలువ రూ.50,350 కోట్లుగా, తలసరి ఆదాయం రూ.1,97,354గా అంచనా. ప్రభుత్వ ఆదేశాలతో

మిగతా 6వ పేజీలో



సమావేశానికి హాజరైన వైసీపీ ముఖ్య నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

వెళ్లామా.. విన్నామా..

- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్ సమావేశం తీరు ఇది
- వైసీపీ జడ్పీటీసీ సభ్యులపై ఒత్తిడి చేసి మరీ తీసుకెళ్లిన వైనం
- ఎమ్మెల్సీ తూమాటితోపాటు పలువురు నాయకులకు అందని ఆహ్వానం
- ఒక్కరికి కూడా మాట్లాడే అవకాశం ఇవ్వని అధినేత
- ఈయన మారడు.. నిజాలు తెలుసుకోడంటూ వ్యాఖ్యలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వైసీపీ అధినేత జగన్ వద్ద సమావేశానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కన్నా ఇతరత్రా నాయకులే అధికంగా వెళ్లారు. ఎక్కువ మంది జడ్పీటీసీ సభ్యులను తీసుకెళ్లేందుకు నాయకులు ముఖ్యంగా ఎమ్మెల్యే బూచేపల్లి చేసిన ప్రయత్నం కొంత ఫలించినప్పటికీ మారని జగన్ వ్యవహార శైలితో సమావేశానికి వెళ్లిన వారంతా నీరసపడ్డారు. ముఖ్య నాయకులతో సహా ఏ ఒక్కరికీ అక్కడ మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఎప్పటిలాగే జగన్ వేదిక మీదకు వచ్చి పేపరు చూసి ప్రసంగాన్ని వినిపించి వెళ్లిపోయారు. స్థానిక సంస్థల్లో ప్రధానంగా జిల్లా పరిషత్‌పై పెత్తనాన్ని కాపాడుకునేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్లతో జగన్ బుధవారం సమావేశమయ్యారు. వారితోపాటు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఇతర ముఖ్య నాయకులనూ ఆహ్వానించారు. అయితే ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న

మిగతా 6వ పేజీలో

మన ఊరి వికాసం @ కట్టావారిపాలెం

స్వచ్ఛంద సంస్థతో ఎన్‌ఆర్‌ఐల సేవా కార్యక్రమాలు

- గ్రామంలో 20 ఏళ్ల క్రితం ఏర్పాటు
- ఊరి జనం భాగస్వామ్యంతో అభివృద్ధి
- వృద్ధులకు ఉచితంగా వైద్యం, మందులు
- రూ.కోటితో రామాలయ నిర్మాణం
- విద్యార్థులకు ఏడేళ్లుగా తైక్వాండో శిక్షణ

వివరాలు 7వ పేజీలో

సామాజిక స్ఫూర్తితో సేవలు 'నా గ్రామమే నా తీర్థక్షేత్రం' శంకుస్థాపనలో మంత్రి సత్యకుమార్ 6లో

వీరుడా... వందనం

(5వ పేజీ తరువాయి)


మృతదేహాన్ని ర్యాలీగా స్వగృహానికి తరలిస్తున్న అశేషజనం

వ్యక్తం చేశారు. ఆయన మృతదేహం అత్తగారి ఊరైన అనంతపురం జిల్లా నార్పలకు చేరింది. అధికార లాంఛనాలతో గురువారం అంత్యక్రియలు జరుగనున్నాయి. మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య 15ఏళ్ల క్రితం ఆర్మీలో చేరారు. నార్పలకు చెందిన లీలావతిని పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు సంతానం. అత్తగారి గ్రామంలోనే నివాసముంటున్న వెంకటసుబ్బయ్య సెలవులప్పుడు రావిపాడులోని తల్లి గాలెమ్మ దగ్గరి వచ్చి వెళ్లేవారు. అన్న బాలవెంకటేశ్వర్లు కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం చిలంకూరులో నివాసం ఉండగా అక్కకు పెళ్లి అయి వారి అత్తగారింటి వద్ద ఉంటోంది. కాగా విషయం తెలిసినప్పటి నుంచి అతని తల్లి గాలెమ్మ కన్నీరుమున్నీరవుతున్నారు.

నేడు అంత్యక్రియలు

వెంకటసుబ్బయ్య మృతదేహాన్ని జమ్మూకశ్మీర్ నుంచి మిలటరీ విమానంలో అనంతపురం జిల్లాకు తీసుకు వచ్చారు. బుధవారం రాత్రి 10 గంటలకు వెంకటసుబ్బయ్య మృతదేహం అనంతపురం జిల్లా నార్పలకు చేరినట్లు మృతుని అన్న వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నివాళి అర్పించిన మంత్రి డోలా

వెంకటసుబ్బయ్య మృతిపట్ల మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి బుధవారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 30 మంది తోటి జవాన్ల ప్రాణాలు కాపాడి ఆయన వీరమరణం పొందారని తెలిపారు. ఆయన త్యాగం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వెంకటసుబ్బయ్య మృతికి ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్ నివాళులర్పించారు.

వెళ్లామా.. విన్నామా..

(5వ పేజీ తరువాయి)

తూమాటి మాధవరావుకు ఆహ్వానం లేకపోవడం చర్చనీయాంశమైంది. మాజీ మంత్రి మహీధర్‌రెడ్డికి కూడా ఆహ్వానం లేదని తెలుస్తోంది. అక్కడ గత ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీచేసి ఓడిపోయిన మధుసూదనయాదవ్ హాజరయ్యారు. పర్చూరు ఇన్‌చార్జి కూడా గైర్హాజరయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మతోపాటు ఎమ్మెల్యేలు శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, మిగిలిన ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జులు హాజరయ్యారు. జడ్పీటీసీలంతా హాజరయ్యేందుకు ప్రత్యేకమైన ప్రయత్నం చేశారు. అయినప్పటికీ 15మందికిపైగా హాజరుకాలేదు. ఎంపీపీలు అయితే అంతకన్నా ఎక్కువగానే గైర్హాజరయ్యారు.

ఒత్తిడి చేసి మరీ..

వైసీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ సమావేశానికి ఇద్దరు జడ్పీటీసీ సభ్యులు డుమ్మాకొట్టగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ వారిపై ప్రత్యేకమైన ఒత్తిడి చేసి జగన్ వద్ద సమావేశానికి తీసుకెళ్లగలిగారు. చీరాల నియోజకవర్గంలోని ఇద్దరు జడ్పీటీసీ సభ్యులు రాలేదు. దర్శి నియోజకవర్గంలో తాళ్లూరు జడ్పీటీసీ సభ్యుడు హాజరుకాకపోవడ విశేషం. అద్దంకి నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది జడ్పీటీసీ సభ్యులు హాజరుకాలేదు. గిద్దలూరు నియోజకవర్గం నుంచి ఆ నియోజకవర్గ సమావేశానికి రాని జడ్పీటీసీలు, ఎంపీపీలు అధినేత సమావేశానికి డుమ్మా కొట్టారు. మార్కాపురం నియోజకవర్గంలో అసంతృప్తితో ఉన్న ఒక జడ్పీటీసీ సభ్యురాలి భర్తను మాత్రం ప్రత్యేకంగా చర్చించి సమావేశానికి తీసుకెళ్లారు. పర్చూరు, ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, కందుకూరు నియోజకవర్గాల్లో కూడా ఒకొక్క జడ్పీటీసీ సభ్యులు రాలేదని తెలిసింది.

పదవులు లేని వారే ఎక్కువగా హాజరు

మొత్తంగా సమావేశానికి 250 మందిలోపు హాజరుకాగా స్థానిక సంస్థల్లో పదవులు లేనివారే ఎక్కువగా ఉన్నారు. కాగా జగన్ సమావేశానికి వచ్చిన వెంటనే ప్రసంగాన్ని ప్రారంభించి పూర్తికాగానే వెళ్లిపోయారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ పరిస్థితి గురించి మాట్లాడే అవకాశం నేతలకు ఇవ్వలేదు. వైవీ సుబ్బారెడ్డిని గాని మాజీ మంత్రులు సురేష్, నాగార్జునలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. కిందిస్థాయిలో నాయకుల అభిప్రాయాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో మన నాయకుడు మారడు అంటూ జిల్లాకు చెందిన నాయకులు నిష్ఠూరంగా గుసగుసలాడుకున్నారు. ఆ సమయంలో జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడైన ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి జగన్ గదిలోకి వెళ్లి ఆయనతో కొద్దిసేపు మాట్లాడారు. వచ్చిన వారిని కలిసేందుకు అవకాశం ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది. ఆ తర్వాత కొందరు ఇన్‌చార్జులు జగన్ వద్దకు వెళ్లి రెండు నిమిషాలు మాట్లాడారు. వారితో వచ్చిన నియోజకవర్గాల ముఖ్య నాయకులను పరిచయం చేయడానికే పరిమితమయ్యారు.

సామాజిక స్ఫూర్తితో సేవలు

'నా గ్రామమే నా తీర్థక్షేత్రం' శంకుస్థాపనలో మంత్రి సత్యకుమార్


శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి, నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సామాజిక స్ఫూర్తితో సేవ చేయడమే మానవధర్మం అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కొలుకుల గ్రామంలో శ్రీ హరిహర సేవా సమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నా గ్రామమే నా తీర్థక్షేత్రం' శంకుస్థాపన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవుల ఆశయాలు ఎంతోగొప్పగా ఉంటాయని, ఆయన అడుగుజాడల్లో నేను నడిచి ఇంత ఎత్తుకు ఎదిగానని అన్నారు. నేటి రోజుల్లో గ్రామాన్ని, బంధువులను, కుటుంబ సభ్యులను మరిచిపోతున్న తరుణంలో తన గ్రామానికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న గురువులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి యక్కలి రాఘవులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువ మందికి శిక్షణ ఇవ్వాలన్న కోరికతో ఆధ్యాత్మిక క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజలంతా ఆధ్యాత్మికం, దైవభక్తి, ప్రజాసేవకు అంకితమవుతారని అన్నారు. ముందుగా మంత్రి సత్యకుమార్ నాయకులు, స్థానికులతో కలిసి స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శంకుస్థాపన ప్రాంగణం వద్ద పూజలు చేసి హారతి ఇచ్చారు. శ్రీ అచలానంద ఆశ్రమానికి చెందిన విరజానంద స్వామి 'నా గ్రామమే నా తీర్థక్షేత్రం' శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, విశ్రాంత డిప్యూటీ లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సిరసగండ్ల శ్రీనివాసులు, కూటమి నాయకులు, అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కుంభాభిషేక విశిష్టతను తెలుసుకోవాలి

సనాతన ధర్మోపన్యాసకులు చాగంటి


ప్రవచనం చేస్తున్న చాగంటి

వేటపాలెం/చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కుంభాభిషేక విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనే పరమార్థాన్ని తెలుసుకోవాలి.. అప్పుడే మానసిక వికాసంతో ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందని సనాతన ధర్మోపన్యాసకులు, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఉద్ఘాటించారు. మండల పరిధిలోని దేశాయిపేట నీలకంఠపురంలోని శ్రీ గంగా పీయూషాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి క్షేత్రంలో మహాకుంభాభిషేక మహోత్సవంలో భాగంగా బ్రహ్మశ్రీ చాగంటి హాజరై భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలను వినిపించారు. మృధు, శాంత, గంభీర స్వరంతో ఆయన గొంతుక నుంచి జాలువారిన ప్రవచనాలు ఆధ్యాత్మిక గుభాళింపులు పరిసర ప్రాంతాలను కమ్మేశాయి. ప్రతి ఒక్కరూ శివ నామస్మరణలో ఓలలాడారు. కుంభాభిషేకం విశిష్టతను వివరిస్తూ, శివతత్వాన్ని ఆయన బోధించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

శ్రీ హనుమత్ వైభవం

చీరాల ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో శ్రీ హనుమత్ వైభవం పేరుతో చేపట్టిన కార్యక్రమానికి సనాతన ధర్మోపన్యాసకులు చాగంటి కోటేశ్వరరా ప్రవచనాల కార్యక్రమం రెండో రోజు బుధవారం కొనసాగింది. హనుమంతుని ఉపాసనతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. రామాయణంలో హనుమంతుని పాత్రను సవివరంగా చెప్పారు. అప్పటి దృశ్యాలు కళ్ల ముందు మెదులుతున్నాయా అన్న రీతిలో చాగంటి ప్రవచనాలు సాగాయి.

రహదారులకు మరమ్మతులు

ప్రయాణికులకు తీరనున్న ఇక్కట్లు

పర్చూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోక ధ్వంసమైన రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పర్చూరు - యద్దనపూడి రహదారి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


గుంతలను పూడ్చుతున్న కార్మికులు

మిర్చికి నల్లి తెగులు దెబ్బ

- పలు గ్రామాలలో ఎదుగుదల లేకుండానే ఎర్రగా వస్తున్న మొక్క
- ఎన్ని రకాల మందులు వాడినా అదుపులోకి రాని వైనం
- ఆందోళనలో రైతులు

బల్లికురవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో రైతులు సాగు చేసిన మిర్చి పైరుకు నల్లి తెగులు వ్యాప్తి చెందడంతో పంట కోతకు రాకుండానే ఎండి పోతోంది. నాలుగేళ్ల నుంచి వరుసగా ఏదో ఒక గ్రామంలో పెద్దఎత్తున వ్యాప్తి చెంది రైతును నష్ట పరుస్తున్న నల్లి తెగులు ఈ ఏడాది కూడా అలానే రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. లక్షలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసిన దిగుబడులు వచ్చే సమాయానికి తెగులు వచ్చిందని కాయలు పడకుండానే ఎర్రగా మిర్చి మొక్కలు వచ్చి ఎండుముఖం పట్టాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని రకాల పురుగు మందులు వాడినా ఫలితం లేకుండా పోతుందని రైతులు అంటున్నారు.

బల్లికురవ మండలంలోని, చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు, కొణిదెన, కొప్పెరపాలెం, గంగపాలెం, వేమవరం, ఉప్పుమాఉలూరు, సోమవరప్పాడు, రామాంజనేయపురం, ఎస్ ఎల్ గుడిపాడు, వెలమవారిపాలెం, కొత్తూరు, వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, బల్లికురవ, కె.రాజుపాలెం తదితర గ్రామాలలో రైతులు ఈ ఏడాది పెద్ద ఎత్తున మిర్చి పంటను సాగు చేశారు. కొన్ని గ్రామాలలో మిర్చి కోతలు కూడా ప్రారంభం అ య్యాయి. మిర్చికి ఎర్రనల్లి తెగులు రోజురోజుకు వ్యాప్తి చెందుతుంది. మిర్చి మొక్క అడుగుభాగం నుంచి ఎర్రగా వచ్చి ఎదుగుదల లేకుండా నిట్ట నిలువునా ఎండుతున్నాయి. వీటిని చూసిన రైతులు కొందరు పంట బెట్టకు వచ్చింది అని నీటిని పెడుతున్నారు. మిర్చి మాత్రం ఎర్రగా వస్తుంది. రైతులు తెగులు ఉందని తెలిసి లక్షలు వెచ్చించి పలు రకాల పరుగు మందులను వాడుతున్నారు. ముందుగా తెగులు విషయం తెలుసుకొని మందులు వాడినా పంటలు కొంత వరకు తెగులు బారి నుంచి తప్పించుకుంటున్నాయి. మందులు వాడకం ఆలస్యం చేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. కొందరు రైతులు తెగులు వచ్చిన పంటలను కోయకుండా వదిలేస్తున్నారు. వచ్చిన కాడికి దిగుబడులు వస్తే పండు కాయలు కోసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఏటా ఎర్ర నల్లి తెగులు కొంప ముంచుందని రైతులు లబోదిబో మంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.60వేల వరకు పెట్టుబడులు పెట్టామని తెగుల వలన తీవ్ర నష్టం తప్పదని వారు అంటున్నారు. తెగుళ్లతో పైరును తీసి వేసేందుకు కొందరు సిద్ధపడుతున్నారు. కొందరు రైతులు మాత్రం పురుగు మందులు వాడి కాపాడుకోవాలనే పట్టుదలతో ముందుకు వెళుతున్నారు. అధికారులు గ్రామాలలో సాగులో ఉన్న మిర్చిని పరిశీలించి నల్లి తెగులును అదుపులోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

భలే ఏమార్చారు!

(5వ పేజీ తరువాయి)

లోబరుచుకుని ఎలాంటి అథారిటీ లేకపోయినా పలు ధ్రువపత్రాలను కూడా అతనే అందించేవాడు. ఈ విషయంలో అప్పటి ముఖ్య ప్రజాప్రతినిధి, పలువురు మండల స్థాయి వైసీపీ నాయకుల అండదండలు పూర్తిగా ఉండటంతో గత ఐదేళ్ల ఏ అధికారి పట్టించుకోలేదు. దీంతో అతని అక్రమాలు ఐదేళ్లపాటు అప్రతిహతంగా సాగిపోయాయి.

రెండు నెలలపాటు నాన్చి రైతులపై కేసుతో తేల్చేశారు

వలంటీర్ శ్రీను అక్రమాలపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా నకిలీ పత్రాలతో గొట్లగట్టు కెనరా బ్యాంకులో ఎక్కువ మొత్తంలో రుణాలు పొందినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కొనకనమిట్ల తహసీల్దార్ సురేష్ ఆగస్టు 1 నుంచి అక్టోబర్ 1 వరకు రుణాలు పొందిన రైతుల వివరాలను ఇవ్వమని బ్యాంకు అధికారులను కోరారు. ఆ రెండు నెలల సమయంలో రుణాలు తీసుకున్న వారి పత్రాలను పరిశీలిస్తే ముగ్గురు రైతులు మాత్రమే నకిలీవి ఇచ్చినట్లు తేలింది. దీంతో తహసీల్దార్ సురేష్ అక్టోబర్ 6వ తేదీన కొనకనమిట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక మండలస్థాయి రెవెన్యూ అధికారి ఫిర్యాదు చేసినా పోలీసులు మాత్రం వారి శైలినే అనుసరించారు. రైతులకు ఎక్కడి నుంచి నకిలీ ధ్రువపత్రాలు వచ్చాయో స్పష్టంగా తెలియడంతో శ్రీనును పిలిచి విచారించారు. అక్కడి నుంచి ఏమైందో తెలియదు ఈ కేసులో అరెస్టులు చూపేందుకు కొనకనమిట్ల పోలీసులు రెండు మాసాల సమయం తీసుకున్నారు. చివరికి కేవలం ముగ్గురు రైతులు, ఇద్దరు నిర్వాహకులను అరెస్ట్ చేసి చేతులు దులుపుకొన్నారు.

అన్నిస్థాయిల్లోనూ నిర్లక్ష్యం

నకిలీ ధ్రువపత్రాల ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందిన తర్వాత రెవెన్యూ అధికారులు వ్యవహరించిన తీరు అనుమానాలకు తావిస్తోంది. కేవలం రెండు నెలల సమాచారం బ్యాంకు నుంచి సేకరించినప్పుడే కేసు నీరుగారిపోయింది. అది కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగస్టు నుంచి అక్టోబరు వరకు రుణాలు పొందిన వారి వివరాలు తీసుకున్నారు. అసలు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటే అక్రమాలు భారీఎత్తున జరిగాయని ఫిర్యాదులు అందాయి. కీలకమైన విషయాన్నే రెవెన్యూ అధికారులు విస్మరించారు. ఫిర్యాదులు అందిన తర్వాత ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన జెరాక్స్ సెంటర్ నిర్వాహకుడు రెవెన్యూ అధికారులకు భారీస్థాయిలో ముడుపులు ముట్టజెప్పినట్లు తెలిసింది. పర్యవసానంగానే ప్రాథమిక దశలోనే ఈ వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక అన్ని ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదుచేసినా అరెస్ట్ చేసేందుకు రెండు నెలల సమయం తీసుకున్నారు. సరే ఇంత సమయం తీసుకున్నా ఏమైనా ఇతర అక్రమాలు గుర్తించారా? అంటే అదీ లేదు. కేవలం తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపైనే ఈనెల 10న ఐదుగురిని అరెస్ట్ చేశారు. వాస్తవానికి బ్యాంకుల్లో తీసుకున్న రుణాల విషయంపై నిజాలు నిగ్గుతేలాలంటే మండల పరిధిలోని నాలుగు బ్యాంకుల్లో .విచారించాల్సి ఉంది. కానీ పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. అక్రమాలకు పాల్పడిన కీలక వ్యక్తులు పెద్దమొత్తంలో ముడుపులివ్వడంతోనే అంతా సర్దుబాటు జరిగిందనే విమర్శలు ఉన్నాయి.

వత్తాసు పలికిన అధికారపార్టీ నాయకులు

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారీతిన అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని ఈ కేసులో నుంచి తప్పించేందుకు టీడీపీ నాయకులు కూడా ప్రయత్నించినట్లు తెలుస్తోంది. భారీమొత్తంలో వెనకేసుకున్న జెరాక్స్ కేంద్రం నిర్వాహకుడు శ్రీను అధికారపార్టీకి చెందిన ఓ మండల, గ్రామస్థాయి నాయకులిద్దరిని అండగా ఉండాలని బేరమాడుకున్నట్లు సమాచారం. ఆ నాయకులు అధికారులపై కొంతమేర ఒత్తిడి తేవడంతోనే కేసును పూర్తిస్థాయిలో నీరుగార్చినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారికి కూటమి నాయకులు వత్తాసు పలకడాన్ని మండలంలోని ఇతర టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

● జిల్లా ప్రధాన న్యాయాధికారి తీర్పు

ఒంగోలు(క్రైం), డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): మహిళను హత్య చేసిన కేసులో నిందితుడు నాగులూరి యాకోబుకు జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. చీమకుర్తి మండలం గాడిపర్తివారిపాలెంనకు చెందిన నాగులూరి యాకోబు, చీమకుర్తికి చెందిన మద్యానపు లక్ష్మితో ఏడాదిగా సన్నిహితంగా ఉంటున్నాడు. మద్యం సేవించినపుడు అనుమానంతో తరచూ గొడవ పడుతు ఉండేవాడు. ఈక్రమంలో 2020 ఫిబ్రవరి 22న లక్ష్మితో యాకోబు గొడవకు దిగి కర్రతో కొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందింది. ఈమేరకు చీమకుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.వసుంధర తమ వాదనలు వినిపించారు. సాక్షులను విచారించిన తరువాత నిందుతుడిపై నేరం రుజువు కావడం యాకోబుకు న్యాయాధికారి జీవిత ఖైదు విధించారు.

రేపు సీనియర్ బాక్సింగ్ జట్ల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ జిల్లా జట్లు ఎంపిక పోటీలు ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో జరుగుతాయని పి.ఉదయ్‌రాజ్ బుధవారం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, వయస్సు ధృవీకరణ పత్రం, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు (మూడు సెట్‌లతో) హాజరుకావాలన్నారు. వివరాలకు కోచ్ పాండ్యం వేణు, సెల్ : 9052866392 ద్వారా సంప్రదించాలని కోరారు.

ఒకేరోజు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీ


దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ

మర్రిపూడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు పెరిగిపోయాయి. వ్యవసాయ భూముల్లో ఉన్న వాటిని లక్ష్యంగా చేసుకొని దొంగలు చెలరేగిపోతున్నారు. మంగళవారం రాత్రి మర్రిపూడిలో రెండు, గుండ్ల సముద్రంలో ఒకటి, రాజుపాలెంలో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. వాటిలో ఉన్న రాగి తీగలను అపహరించుకెళ్లారు. అక్టోబరులో కూచిపూడి, జువ్విగుంట, శివరాయునిపేట గ్రామాల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సుమారు రూ.1.75లక్షలు ఖర్చవుతోంది. తాజాగా జరిగిన రెండు ఘటనల్లో రూ.12లక్షలకుపైగా విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఏఈ సుబ్బారెడ్డి ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. మర్రిపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నీటి సంఘ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

పంగులూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలు ఈనెల 14 జరగనున్నాయి. బుధవారం సంబంధిత ఎన్నికల అధికారులు ఆయా కేంద్రాల పరిధిలో నోటిఫికేషన్ విడుదల చేశారు. అద్దంకి సబ్ డివిజన్‌లోని జె.పంగులూరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో ఉన్న పంగులూరు - 1, జె.పంగులూరు - 2, కొండమంజులూరు - 1, చందలూరు - 1, కోణంకి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలోని కొండమంజులూరు - 2 నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి బుధవారం మండలంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీన ఉదయం 8 గంటలకు ఆయా నీటి వినియోగదారుల సంఘ పరిధిలోని వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం వార్డు సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారు. ఇది పూర్తయిన అనంతరం అదే రోజు ఎన్నికైన సభ్యులను సమావేశ పరచి సంబంధిత నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని అధికారులు తెలిపారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నిక జరిగే కేంద్రాలతోపాటు, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నోటిఫికేషన్ వివరాలను వెల్లడించారు. ఈనెల 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక జరుగుతుందని అద్దంకి సబ్‌డివిజన్ డీఈ రామకృష్ణ తెలిపారు.


తేనీటి విందులో సీఎంతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

విజన్-2029 జిల్లా ప్లాన్‌పై ప్రశంస

(5వ పేజీ తరువాయి)

ఏడాదికి 15 శాతం వృద్ధి లక్ష్యంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో జిల్లాలో ఉన్న వనరుల వినియోగం, ప్రభుత్వ పథకాల అనుసంధానంతో 2029 నాటికి ఐదేళ్లలో మొత్తం స్థూల ఉత్పత్తి విలువ రూ.1,14,712 కోట్లు, అలాగే తలసరి ఆదాయం రూ. 4.27 లక్షలు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం ఆయా రంగాల వారీ తీసుకోవాల్సిన చర్యలు, అందుకు ఉన్న మార్గాలను ఆ ప్రణాళికలో వివరించారు. ఈ అంశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల కమిటీ ప్రణాళిక రూపకల్పన బాగున్న మూడు జిల్లాల్లో ప్రకాశంను చేర్చింది.

సమగ్ర నివేదిక అందజేత

కలెక్టర్ల సదస్సులో జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై సంబంధిత శాఖల వారీగా సమగ్ర నివేదిక రూపంలో కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి అందజేశారు. తొలిరోజైన బుధవారం పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌తోపాటు ఇతర ఆయాశాఖల ముఖ్య కార్యదర్శులు సమీక్ష చేసి దిశానిర్దేశం చేశారు. గురువారం మరికొన్ని అంశాలపై సమీక్ష చేయనున్నారు. కాగా కలెక్టర్ల సదస్సులో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ప్రభుత్వం తరపున పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం శాంతిభద్రతలపై సమీక్షకు ఎస్పీ దామోదర్ కూడా హాజరయ్యారు. కలెక్టర్ల సదస్సుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇక్కడి ప్రకాశం భవన్ నుంచి జిల్లా అధికారులంతా హాజరయ్యారు.

బోగస్ పత్రాలతో భూంఫట్

(5వ పేజీ తరువాయి)

వచ్చిన సంస్థ యాజమాని నాగవెంకట సత్యనారాయణ రెడ్డి హద్దు రాళ్లు ఎందుకు తొలగిపోయాయని అక్కడున్న వారిని ప్రశ్నించారు. 'ఈ భూమి మాది. మేము కొనుగోలు చేశాం' అని వారు చెప్పడంతో వెంటనే పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో ఎస్ఐ సంపత్‌కుమార్ భూమిని అక్రమంగా అమ్మినట్లు గుర్తించి అందుకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. దీంతో నిందితులు అయిన కె.వంశీమోహన్‌రెడ్డి, కె.చంద్రలేఖ, కె.శ్రీదేవిని కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో, కాపలాదారు ఘంటా శ్రీనును మానేపల్లిలో అరెస్టు చేశారు. వారిని బుధవారం మార్కాపురం కోర్టులో హాజరుపరచగా వారికి 14 రోజులు రిమాండ్ విధించిందని పుల్లలచెరువు ఎస్ఐ తెలిపారు. మరో నలుగురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.


గ్రామస్థులకు ఉచితంగా వైద్యం చేస్తున్న డాక్టర్ కృష్ణమోహన్ (ఫైల్)

గ్రామాభివృద్ధి కోసం ఆ ఊరి యువకులు నడుం కట్టారు. గ్రామంలోని పెద్దలు రాజకీయాల పేరుతో ఎడముఖం, పెడముఖంగా ఉంటున్న రోజుల్లో ఇది గ్రామానికి తగదని, రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా పనిచేయాలనే ఆలోచన యువకులకు వచ్చింది. ప్రధానంగా గ్రామం నుంచి అమెరికాకు, ఇతర దేశాలకు వెళ్లి సాఫ్ట్‌వేర్ తదితర ఉద్యోగాలు చేసుకుంటున్న యువకులు మంచి ఆలోచన చేశారు. 'మన ఊరి వికాసం' పేరుతో స్వచ్ఛంద సంస్థను గ్రామాభివృద్ధి కోసం ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలోని అందరినీ భాగస్వాములుగా చేసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కోసం అనేక గ్రామ ఉపయోగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 20 ఏళ్ల కిందట 'మన ఊరి వికాసం' ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. గ్రామస్థులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. – కొండపి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి)

మన ఊరి వికాసం @ కట్టావారిపాలెం

స్వచ్ఛంద సంస్థతో ఎన్ఆర్ఐల సేవా కార్యక్రమాలు

- గ్రామంలో 20 ఏళ్ల క్రితం సంస్థ ఏర్పాటు
- ఊరి జనం భాగస్వామ్యంతో అభివృద్ధి, సంక్షేమం
- వృద్ధులకు ఉచితంగా వైద్యం, మందులు
- కోటి రూపాయలతో రామాలయం నిర్మాణం
- విద్యార్థులకు ఏడేళ్లుగా తైక్వాండో శిక్షణ


'మన ఊరి వికాసం' 20వ వార్షికోత్సవం సందర్భంగా గర్భవతులకు చీరలు పంపిణీ చేస్తున్న సభ్యులు (ఫైల్)

గ్రామాభివృద్ధి కోసం ఏమేం చేశారంటే..

- ఒంగోలుకు చెందిన డాక్టర్ కె.కృష్ణమోహన్ సహకారంతో ప్రతి మొదటి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు.
- గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గ్రామంలోని గర్భిణులకు చీరెలు, సారెలు పెట్టి పలు సందర్భాల్లో వైద్య సలహాలు అందిస్తున్నారు.
- దివంగతులైన వారి పేరిట జ్ఞాపకార్థంగా గ్రామానికి రెండు వైపులా మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. అవి ఇప్పుడు చెట్లుగా ఎదిగాయి.
- కోటి రూపాయలకుపైగా నిధులు సమకూర్చుకుని ఐదేళ్ల క్రితం రామాలయం నిర్మించారు.
- మన ఊరి వికాసం వ్యవస్థాపకుడైన ధర్మవరపు వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఏడేళ్లుగా వేసవిలో కట్టావారిపాలెం, కొండపి గ్రామాలకు చెందిన ఆసక్తిగల 100 మంది విద్యార్థులకు తైక్వాండో శిక్షణ ఇప్పిస్తున్నారు. విద్యార్థులకు శిక్షణా కాలం 45 రోజుల పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు.


తైక్వాండో శిక్షణ నిస్తున్న ఎన్నారై వెంకట ప్రసాద్ (అమెరికా)

మన ఊరి వికాసంతో ఎంతో మేలు



మా అమ్మాయి తైక్వాండోలో శిక్షణ పొందుతోంది. నేషనల్ పోటీలకు ఢిల్లీకి వెళ్తోంది. నేనుకూడా వెళుతున్నాను. గ్రామీణ ప్రాంతంలో కేవలం చదువు మాత్రమే విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది. స్కూళ్లలో విద్యార్థుల అదనపు ఆసక్తి కార్యక్రమాలు అందుబాటులో లేవు. ఇటువంటి స్థితిలో 'మన ఊరి వికాసం' ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తూ తైక్వాండోలో ఉచిత శిక్షణ ఇవ్వడం చాలా సంతోషకరంగా ఉంది.

– అద్దేపల్లి సత్యన్నారాయణ, కొండపి

రీజనల్ పోటీలు నిర్వహించాలని సంకల్పం



గ్రామస్థులు, ఎన్నారైల సహకారంతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రత్యేకంగా 7 నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు తైక్వాండో శిక్షణ ఇచ్చి ఇంటర్నేషనల్ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనేది నా ఆలోచన. ఇప్పుడు కూడా ఇంటర్నేషనల్ తైక్వాండో పోటీలు ఈనెల 14, 15 తేదీల్లో ఢిల్లీలో జరుగుతున్నాయి. గ్రామం నుంచి 12 మంది విద్యార్థులను, వారి సహాయకులను పోటీలకు గురువారం సాయంత్రం మన ఊరి వికాసం తరుపున ఢిల్లీకి పోటీలకు తీసుకెళ్తున్నాం. స్వతహాగా ఇంటర్నేషనల్ తైక్వాండో బ్లాక్ బెల్ట్ (ఐటీఎఫ్) ఫోర్త్ డాన్‌గా ఉన్న నాకు తైక్వాండోపై ప్రత్యేక ఆసక్తి ఉంది. కేవలం వారికి శిక్షణ, మెలకువలు నేర్పేందుకు నేను అమెరికా నుంచి వచ్చాను. ఇతర గ్రామాల్లో కూడా తైక్వాండో పట్ల ఆసక్తి కలిగించి శిక్షణ నిచ్చి ఒంగోలులో రీజనల్ పోటీలు నిర్వహించాలనేది సంకల్పం.

– ధర్మవరపు వెంకట ప్రసాద్, తైక్వాండో కోచ్, ఎన్నారై

పొదుపు పేరిట టోకరా

- గిరిజనుల నుంచి రూ.18 లక్షలకుపైగా వసూలు చేసి చేతులెత్తేసిన మహిళ
- లబోదిబోమంటున్న గిరిజనులు


పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన బాధితులు

సింగరాయకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొదుపు పేరిట అమాయకులైన గిరిజనులు నుంచి నగదు వసూలుచేసి ఓ మహిళ చేతులెత్తేసింది. దీంతో కూలీనాలీ చేసి నగదు చెల్లించిన గిరిజనులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు జిల్లా ఉలవపాడు పంచాయతీ పరిధిలోని హైస్కూల్ సంఘానికి చెందిన కామంచి నందిని అనే మహిళ నందిని పొదుపు సంస్థ పేరుతో సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండలోని బాలిరెడ్డినగర్, మల్లికార్జున్‌నగర్, తాతయ్యకాలనీలకు చెందిన గిరిజనుల నుంచి వారాల పొదుపు ద్వారా రూ.18 లక్షలకుపైగా నగదు వసూలు చేసింది. వారానికి 100 చొప్పున దాదాపు 6 ఏళ్ల నుంచి నగదు వసూలు చేస్తోంది. 340 గడవుల్లో గడువుకి రూ.100 చొప్పున రూ.34 వేలు చెల్లిస్తే రూ.1000 కలిపి రూ.35 వేలు చెల్లిస్తానని గిరిజనులను నమ్మించింది. తీరా పొదుపు గడవు ముగిసాక తమకు చెల్లించాల్సిన నగదు అడగ్గా తన దగ్గర నగదు లేదని చేతులెత్తేసింది. దీంతో బుధవారం భారీగా పొదుపు పేరిట మోసపోయిన గిరిజనులు పోలీస్‌స్టేషన్‌కి వచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి. మహేంద్ర తెలిపారు.

అరుణాచలం వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహా దీప దర్శనం కోసం అరుణాచలం వెళ్లే జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ దామోదర్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. తిరువణ్ణామలై శ్రీఅరుణాచలేశ్వర దేవాలయంలో శుక్రవారం జరిగే మహా దీప దర్శనం కోసం పెద్దసంఖ్యలో ప్రజలు తరలి వెళుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తిరువణ్ణామలై వెళుతున్న భక్తుల తరలింపు క్రమబద్ధీకరణకు తమిళనాడు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కేటాయించిన ప్రాంతాలలో తాత్కాలికంగా బస్టాండ్‌లు ఏర్పాటు చేశారని వివరించారు. తిరుపతి, చిత్తూరు రూట్ల నుంచి వెల్లూరు రోడ్డు మీదుగా తిరువణ్ణామలై వెళ్లే బస్సుల కోసం తిరువణ్ణామలై బైపాస్ రోడ్డు వద్ద దీపం నగర్ జంక్షన్ సమీపంలో తాయ్ ముగాంబికనగర్, ఏకేఎస్.నగర్ వద్ద రెండు ప్రత్యేక బస్టాండ్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇక కారులో వెళ్లేవారు వేలూరురోడ్డులో 13 కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేశారన్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి వెంగిక్కల్‌థెండ్రాల్‌నగర్ దాటి తిరువణ్ణామలైలోకి కారులకు అనుమతి లేదన్నారు. పార్కింగ్ కోసం 9363622330 నంబరుకు హాలో అని వాట్సాప్ సందేశాన్ని పంపిస్తే గూగుల్ మ్యాప్ లింక్ ద్వారా మార్గం నిర్దేశికం అందుతుందని పేర్కొన్నారు. భక్తులకు పార్కింగ్ ప్రాంతాల నుంచి తిరువణ్ణామలై నగరంలోకి వెళ్ళేందుకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారని, భక్తులు సహాయం కోసం సమీపంలోని పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు. తిరువణ్ణామలై టౌన్ క్రైమ్ పోలీసు నంబరు 04175-222303, ఏసీపీ 9498100431, పోలీసు కంట్రోల్ రూం నంబరు 9159616263 లేదా 100కు కాల్ చేయాలని ఎస్పీ కోరారు.

'ఉపాధి' లక్ష్యాలను చేరాలి

డ్వామా పీడీ జోసఫ్ కుమార్


ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోషప్ కుమార్

మార్కాపురం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి). జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను కాలయాలన చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ ఆదేశించారు. మండలంలోని రాయవరం గ్రామ పరిధిలోగల సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని పీడీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కిలోమీటర్ నుంచి 5 కిలోమీటరు విస్తీర్ణం లోపు గల చెరువులను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. చెరువులలో నడక మార్గాలను ఏర్పాటు చేసి కట్టలను పటిష్టం చేయాలని తెలిపారు. జనవరి 14వ తేదీ నాటికి ప్రతిఫీల్డ్ అసిస్టెంట్ పరిధిలో ఒక నీటి కుంటను ఏర్పాటుచేయాలని తెలిపారు. పశువుల పాకల నిర్మాణాలు ఈ నెల 30వ తేదీ లోగా పూర్తి చేయాలని తెలిపారు. నూతనంగా వచ్చిన ఆదేశాల ప్రకారం లక్ష రూపాయలు ఆడిట్‌లో రికవరీ వచ్చిన వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. మస్టర్ రోల్ హాజరులో అవకతవకలకు పాల్పడి పనులు చేసిన కొలతల ప్రకారం వేతనాల చెల్లింపులు జరిపినట్లయితే వారిని విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నిర్మలాదేవి, డీవీటీ నాగేశ్వరరావు, మార్కాపురం, దోర్నాల, దొనకొండ, పెద్దారవీడు, త్రిపురాంతకం, పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల ఏపీవోలు, టీఏలు, ఈసీలు, సీవోలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

శిథిల వారధులతో చింత

- ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం
- వాహనదారుల ఆందోళన


కర్నూల్‌రోడ్డు ఎండ్లూరు డొంక వద్ద దెబ్బతిన్న కల్వర్టుపై వెళుతున్న కారు

సంతనూతలపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలంలో కల్వర్టుర్లు శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయాలు మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ముప్పుగా మారి ప్రాణనష్టం జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వారధులపై ప్రయాణించాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్ల నుంచి దెబ్బతిన్న కల్వర్టర్లను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిపెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా సమస్య పరిష్కరించడం లేదని, దీంతో రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు

ప్రమాదఘంటికలు ఎక్కడంటే..


ప్రమాదకరంగా చలప్పాలెం కల్వర్టు

- కర్నూల్‌రోడ్డుపై ఎండ్లూరు డొంకవద్ద కల్వర్టు చాలా ప్రమాదకరంగా మారింది. దీనిపై గతంలో గుంతలు పడి ప్రమాదాలకు కారణమవుతుంటే అధికారులు తూతూమంత్రంగా మరమ్మతులు చేపట్టారు. ఇదే కల్వర్టు మీదగా రోజు వందలాది భారీ గ్రానైట్ రాళ్ల లోడుతో వెళ్లే లారీలు, ప్రభుత్వ ప్రైవేట్ వాహనాలు వెళ్తుంటాయి. దీనిమీదుగానే కర్నూల్, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, నంద్యాల తదితర ముఖ్యపట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఈ కల్వర్టు కిందికి కుంగి అత్యంత ప్రమాదకరంగా మారింది.
- ఇదే కర్నూల్ రోడ్డులో సంతనూతలపాడుకు ఊరిచివర ఉన్న కల్వర్టు దెబ్బతిని ఉంది. ఏడెనిమిదేళ్ల క్రితం అధికారులు తాత్కాలికంగా ఇనుపకమ్మీలు ఏర్పాటుచేసి మమ అనిపించారు. ఈ కల్వర్టుపై తారురోడ్డుతో బాగున్న కింది భాగాన పరిస్థితి దారుణంగా ఉంది.
- చలప్పాలెం వద్ద ఉన్న కల్వర్టు రెండువైపులా సైడ్‌వాల్స్ దెబ్బతిని ఉన్నాయి. దాని కింది భాగాన ఇనుపచువ్వలు బయటపడి ప్రమాదకరంగా మారింది. ఇలా మండలంలో కొన్నిచోట్ల కల్వర్టుల పరిస్థితి అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఒంగోలులో ఇలా

ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం : డీటీసీ

విద్యార్థులను రవాణా చేసే ఆటోలపై ప్రత్యేక తనిఖీలు చేస్తామని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల మంగళవారం తెలిపారు. ముగ్గురు ప్రయాణం చేసే ఆటోలో ఆరుగురు పిల్లలు మాత్రమే ప్రయాణించాలి. అదే విధంగా పెద్ద ఆటోలలో సీటుకు నలుగురిని ఎక్కించాలని తెలిపారు. పరిమితికి మించి రవాణా చేసే ఆటోలపై కేసులు నమోదు చేస్తామన్నారు. పిల్లల ప్రయాణంపై తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ప్రమాదంలో బంగారు బాల్యం

- పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థుల ప్రయాణం
- నిబంధనలు పట్టించుకోని వాహనదారులు

ఒంగోలు(క్రైం), డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): స్కూళ్లకు వెళ్లే చిన్నపిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, ఆటో డ్రైవర్లు నిబంధనలు తుంగలో తొక్కి పరిమితికి మించి పిల్లలను రవాణా చేస్తున్నారు. ఆటోల్లో ఇష్టానుసారంగా విద్యార్థులను ఎక్కించి పాఠశాలలకు తరలిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నాయి. ఒక్కో ఆటోలో పదిమందికి పైగా ఎక్కించి రవాణా చేస్తున్నారు. పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని చెబుతున్న రవాణాశాఖ ఆటోలలో విద్యార్థుల ప్రయాణం గురించి పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తున్నది. కొన్ని స్కూళ్లకు బస్సులే లేవు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇలాంటి ప్రయాణం ప్రమాదభరితంగా మారుతుంది.

పట్టించుకోని స్కూళ్ల యాజమాన్యం

విద్యార్థుల ప్రయాణం గురించి కొన్ని పాఠశాలలు గాలికి వదిలేశాయి. అసలు బస్సు సౌకర్యం లేకుండా స్కూళ్లను నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి. దీంతో ఆటోలలో పిల్లలను పంపిచడం తప్పనిసరి అయింది. అదే విధంగా ఒంగోలు నగరంలో కొన్ని ప్రాంతాలకు బస్సులు వెళ్లే అవకాశం లేక పోవడంతో ఆటోలు అనివార్యం అయ్యాయి. ఈనేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల చదువుల కోసం ఆటోల్లో నెలవారీ బాడుగకు మాట్లాడుకోని ఎక్కిస్తున్నారు. అయితే ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించడం లేదు. పెద్దలు ముగ్గురు ప్రయాణం చేసే ఆటోలో ఆరుగురు పిల్లలను, అదేవిధంగా మ్యాజిక్ ఆటో అయితే 12 మంది పిల్లలను ఎక్కించవచ్చు. ఇలా కాకుండా ముగ్గురు ఎక్కే ఆటోలో పది మంది పిల్లలను ఎక్కించి, వారి బ్యాగ్‌లు కూడా పెట్టుకునే అవకాశ లేకుండా తరలిస్తున్నారు. మ్యాజిక్ ఆటో అయితే 20 మంది పిల్లలకు పైబడి ఎక్కించుకు వెళుతున్నారు.

ఆటోలపై నియత్రణ ఏదీ..

పాఠశాల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతుంటే చర్యలు తీసుకుంటున్న రవాణాశాఖ, నిబంధనలకు విరుద్ధంగా పిల్లలను రవాణా చేస్తున్న ఆటోలపై ఉదాసీనతగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఆటోలలో పరిమితికి లోబడి పిల్లలను ప్రయాణం చేయడంతో పాటుగా ఫిట్‌నెస్ కూడా తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగ పిల్లలను రవాణా చేసే ఆటోలలో ప్రత్యేక సౌకర్యాలు ఉండేలా చూడాలి, వారి బ్యాగ్‌లు, క్యారేజీలు పెట్టుకునేందుకు అనువుగా ఏర్పాట్లు చేయాలి. డ్రైవర్‌కు ఇరువక్కలా పిల్లలను ఎక్కించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పల్లామల్లిలో జ్వరపీడితులకు వైద్యసేవలు

● యుద్ధప్రాతిపదికపై పారిశుధ్య పనులు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

లార్వాను గుర్తిస్తున్న యంత్రాంగం

చీమకుర్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పల్లామల్లిలోని బీసీకాలనీలో జ్వరపీడితులకు వైద్యశాఖ అధికారులు వైద్యసేవలు అందించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'మంచం పట్టిన పల్లామల్లి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికార యంత్రాంగం స్పందించింది. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని గ్రామంలోని బీసీకాలనీలో ఏర్పాటు చేశారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రావణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ సందీ ప్‌రెడ్డి, హెచ్‌వో చంద్రశేఖర్, సీహెచ్‌వో మాధవరావు, కమలాకర్‌లు కాలనీలో అన్ని వీధులు పర్యవేక్షించారు. నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేశారు. జ్వర పీడితులకు వైద్య సేవలు అందించారు. ఏఎన్‌ఎంలు రోజ్‌మేరి, రమణమ్మ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్

సంతనూతలపాడు/మద్దిపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు మండలాల్లో 4 అంగనవాడీ వర్కర్, 12 హెల్పర్ ఉద్యోగాలకు సంబంధించి ఖాళీలు ఉన్నట్లు సీడీపీవో ఇవాంజిలిన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంతనూతలపాడు మండలంలో అంగన్‌వాడీ వర్కర్-1, హెల్పర్-5 ఖాళీలు, మద్దిపాడు మండలంలో అంగనవాడీ హెల్పర్స్-3 ఖాళీలు, చీమకుర్తి మండలంలో అంగన్‌వాడీ వర్కర్స్-2, హెల్పర్స్-4 ఖాళీలు, నాగులుప్పలపాడు మండలంలో అంగన్‌వాడీ వర్కర్-1 చొప్పున ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్‌కు అర్హతలు 21-35 సంవత్సరాల మధ్యన వయస్సు ఉండి టెన్త్ పాసై ఉండాలన్నారు. హెల్పర్‌కు అర్హతలు 21-35 సంవత్సరాల మధ్యన వయస్సు ఉండి వారు 7 వతరగతి పాసై ఉండాలన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 11 నుండి 23వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పని దినాల్లో అందజేయాలని సీడీపీవో కోరారు.

కొండపి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో..

కొండపి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొండపి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. పెట్లూరు-2 అంగన్‌వాడీ కేంద్రంలోని ఆయా పోస్టు ఓసీ కేటగిరీకి కేటాయించింది. పొన్నలూరు మండలం పెరికపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు ఓసీకి, వెంకుపాలెంలోని ఆయా పోస్టు ఎస్టీకి, వెల్లటూరు కేంద్రంలోని కార్యకర్త పోస్టు బీసీ-డీ, మర్రిపూడి మండలం ధర్మవరం ఎస్సీ-1 కేంద్రంలోని ఆయా పోస్టు ఓసీకి ప్రకటించింది. అయ్యపురాజుపాలెం కేంద్రంలోని ఆయా పోస్టు ఓసీకి, జి.అగ్రహారం ఎస్సీ కాలనీలోని ఆయా పోస్టు ఎస్సీ కేటగిరీకి కేటాయించారు. అర్హత కలిగిన మహిళలు ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తును తమ కార్యాలయంలో అందజేయాలని సీడీపీవో మాధవీలత ఒక ప్రకటనలో కోరారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

నాగులుప్పలపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటులు మంచు మోహన్‌బాబు, ఆయన కుమారుడు విష్ణుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు కొలకలూరి విజయ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

15న మాలలు గుంటూరు తరలిరావాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాల ఉద్యోగుల సంఘం నాయకులు

టంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో ఈనెల 15న నిర్వహిస్తున్న మహాగర్జనకు ప్రతి పల్లె నుంచి మాలలు తరలిరావాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన మండలంలోని తూర్పునాయుడుపాలెం అంబేడ్కర్ విగ్రహం ముందు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం ప్రతినిధులతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

కేరళ ప్రభుత్వానికి అండగా నిలవాలి



మాట్లాడుతున్న రంగారావు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ముందుకు దూసుకపోతున్న కేరళ ప్రభుత్వాని కేంద్రం నిధులు ఇవ్వకుండా కక్షపూరితంగా వ్యవహరి స్తుందని పలువురు వక్తలు మండిపడ్డారు. సీఐటీయూ, ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల ఆంజనేయులు, జి.శ్రీనివాసులు, ఎం.అయ్యపరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సీహెచ్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

టంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నదని టీడీపీ నాయకుడు మక్కెన వెంకట్రావు తెలిపారు. జమ్ములపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ, డీటీ, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హైవేపై ప్రయాణం.. హడలెత్తాల్సిందే..!

● వాహనదారుల నిర్లక్ష్యం
● గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు
● ఫ్లైఓవర్లు నిర్మించాలని ప్రజల డిమాండ్

మద్దిపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా నిత్యం రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణిస్తుండడంతో వారి కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంటుంది. ముఖ్యంగా మద్దిపాడు మండలంలోని హైవేలో ఉండే సీతారాంపురం కొష్టాలు, వెల్లంపల్లి, మద్దిపాడు, గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం, పెద్దకొత్తపల్లి అడ్డరోడ్డు, దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం, ఏడుగుండ్లపాడు ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఆరు నెలల వ్యవధిలో పదిమందికి పైగా మృత్యువాత పడగా 18మంది క్షతగాత్రులయ్యారు. పోలీసులు రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న ఫలితం ఉండటం లేదు. స్థానిక పోలీసులు కొష్టాలు సెంటర్లో నిత్యం ప్రమాదాల నివారణ కోసం స్టాపర్లు పెట్టారు. అయితే అధిక స్పీడుతో వచ్చే వాహనదారులకు అర్థంగాక స్టాపర్లను కూడా ఢీకొట్టేస్తున్నారు. దీంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. సీతారాంపురం కొష్టాలు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం అందరినీ భయాందోళనకు గురి చేసింది. ఈ ప్రమాదంలో చిన్నారి గోరంట్ల రేష్మత్‌చౌదరి మృత్యువాత పడగా మారెళ్లగుంటపాలెంకు చెందిన ఆలూరి నాగులు తన బైక్‌తో పాటు రెండున్నర కిలోమీటర్ల దూరం క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ లారీ ఈడ్చుకుని పోవడం, మరో వ్యక్తి గోరంట్ల రామాంజనేయులుపై కూడా లారీ దూసుకుని వెళ్లింది. ఈ ఘటనలో ఇరువురు చనిపోయారు. లారీ డ్రైవర్ రాజమండ్రికి చెందిన ఆచంట రాజు మద్యం మత్తులో లారీని నిర్లక్ష్యంగా నడిపి వారి ప్రాణాలు తీశాడు. అనుభవం ఉన్న డ్రైవర్లే నిర్లక్ష్యపు ధోరణితో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఇలాంటి ఘటనలు నివారించేందుకు ప్రమాదాలు జరిగేచోట్ల ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించడం లేదని వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద ఫ్లైఓవర్ మంజూరైనా ఏళ్లుగా నిర్మించకపోవడంపై విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరిగే చోట ఫ్లైఓవర్లు నిర్మించేలా తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎండోమెంట్ పేరుతో కావాలనే ఆన్‌లైన్ చేశారు..

● మా భూములు మాకు అప్పగించాలి
● రెవెన్యూ సదస్సులో రైతుల విజ్ఞప్తి



అధికారులకు తమ సమస్యలను వివరిస్తున్న రైతులు

మద్దిపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో బసవన్నపాలెం, దొడ్డవరప్పాడు, వెంకట్రాజుపాలెం గ్రామాల్లో తమ భూములను దేవదాయశాఖ భూములు అంటూ ఆన్‌లైన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు వాపోయారు. బుధవారం బసవన్నపాలెంలో రెవెన్యూ సదస్సు జరిగింది. డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు తమ సమస్యలను వెళ్లబోసుకున్నారు. గోరంట్ల వెంకటరావు మాట్లాడుతూ ఇనమనమెళ్లూరు రెవెన్యూ గ్రామ సర్వే నంబర్లు 291,322, 324,328,329,333,391, 170.16 ఎకరాల భూమిని బసవన్నపాలెం, దొడ్డవరప్పాడు వెంకట్రాజుపాలెం గ్రామాలకు చెందిన 230 మంది రైతులు 300 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారని చెప్పారు. అలాంటి భూములు మీద ఎన్నో వివాదాలు నడిచి రైతులే హక్కుదారులుగా పలు న్యాయస్థానాలు సంపూర్ణ హక్కులు ఇచ్చాయన్నారు. ఈ భూములకు గతంలో ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేసిందని, కానీ వాటిని దేవదాయ శాఖవి అంటూ తమకు ఆన్‌లైన్ చేయకపోవడం ఇబ్బందిపడుతున్నామని తెలిపారు. మండవ వెంకట్రావు మాట్లాడుతూ కొంతమంది అధికారులు రిజిస్ట్రేషన్ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి రెవెన్యూ రికార్డులో రైతుల పేర్లు తొలగించడం రిజిస్ట్రేషన్ జరగకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. ఆర్ల రామాంజనేయులు మాట్లాడుతూ తమ భూముల్లో దేవదాయశాఖ ఎలాంటి హక్కు లేదన్నారు. మండవ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండల రంగారావు మాట్లాడుతూ తమ భూములకు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, మండవ రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు జయంత్‌బాబు, సీతారాంపురం సర్పంచ్ శివానందరావు, ఎం.రాంబాబు, గోవిందరాజులు, మండవ లక్ష్మీనారాయణ, వీఆర్వో అరుణ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మెడికవర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

● హాజరైన ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర, బీఎన్



జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, అతిథులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికవర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. అలాగే ఐసీయూ, ఓటీలను కనిగిరి, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్.విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ వైద్యరంగంలో విశేష అనుభవం ఉన్న డాక్టర్ కె.శ్రీధర్‌బాబు, పి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో కార్డియాలజీ వైద్యవిభాగం, ఆర్థోవిభాగం, మహిళా ప్రసూతి విభాగాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా ప్రజలకు గుండె వైద్యం, ఆర్థో గైనకాలజీ, పలమనాలజీ, చిన్న పిల్లల వైద్య సేవలు అత్యున్నతమైన వైద్యం ఇక్కడే లభించడం పట్ల ఎమ్మెల్యేలు ఉగ్ర, బీఎన్ హర్షం వ్యక్తం చేశారు. ఫార్మసీ ల్యాబ్‌ను మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీధర్‌బాబు, శ్రీనాథ్ మాట్లాడుతూ మెడికవర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అతి తక్కువ ఖర్చుతో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కాగా జనరల్ వార్డును సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ చింతపల్లి గోపి, వైద్యులు వీరయ్యచౌదరి, మణిబాబు, ఉమాపతిచౌదరి, ప్రకాష్ చవలా, కాపా అనిల్‌కుమార్, ప్రణీత్, వంశీ, మాలకొండారెడ్డి, రంగసాయి, పామూరు ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, మెడికవర్ హాస్పటల్స్ డైరెక్టర్లు డాక్టర్ రవళి, డాక్టర్ జోష్న, జనరల్ మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు బ్యాంకులు సహకరించాలి

● డీఆర్‌డీఏ పీడీ వసుంధర



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వసుంధర

ఒంగోలు నగరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్ పథకాల కింద పొదుపు సంఘాల మహిళలకు విరివిగా రుణాలను మంజూరు చేసి వారు యూనిట్లు ఏర్పాటు చేసుకునే దిశగా బ్యాంకులు సహకరించాలని డీఆర్‌డీఏ పీడీ వసుంధర కోరారు. బుధవారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీలో జరిగిన సమావేశంలో లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ రమేష్, యూనియన్‌బ్యాంకు, కెనరాబ్యాంకు, ఏపీజీబీ, బ్యాంకు ఆఫ్ బరోడా, సెంట్రల్‌బ్యాంకు, ఎస్‌బీఐ బ్యాంకు అధికారులతో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇంతకు ముందు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని చెల్లించని వారితో వెంటనే రికవరీలు పూర్తి చేసి ఎన్‌పీఏలను రెగ్యులర్ చేయాలని కోరారు. జిల్లాలో అర్హత ఉన్న అన్ని గ్రూపులకు బ్యాంకు లింకేజి రుణాలను అందజేయాలని ఆమె బ్యాంకు అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని పొదుపు సంఘాలు, మండల సమాఖ్యలను ఎ గ్రేడులోకి తెచ్చేలా డీపీఎంలు, ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు కృషి చేయాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాల రికవరీలను నూరుశాతం పూర్తి చేయాలని పీడీ కోరారు. సమావేశంలో జిల్లాలో పని చేస్తున్న డీపీఎంలు, ఏరియా ఆర్డినేటర్లు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సమీక్ష

● నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు



జీఎల్‌పురంలో నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎన్నికల అధికారి శివాజీ

నాగులుప్పలపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరగనున్న నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలన్నారు. అమ్మనబ్రోలులో 6 ప్రాదేశికాలు, తిమ్మసముద్రం-1లో 12, తిమ్మసముద్రం-2లో 12 ప్రాదేశికాలకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు అమ్మనబ్రోలుకు ఎంపీడీవో వై.మహాలక్ష్మి, తిమ్మసముద్రం-1కి తహసీల్దార్ కె.ప్రవీణ్ కుమార్, తిమ్మసముద్రం-2కు డీటీ వాసుదేవరావులను ఎన్నికల అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఓబన్నపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. 5 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ వాసుదేవరావు, వీఆర్వోలు భవాని,చంద్రమోహన్ పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక జడ్పీహైస్కూల్లో బుధవారం నీటిసంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులకు తహసీల్దార్ ఆదిలక్ష్మి అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. మండలంలో 12 మేజర్ నీటికాలువలకు, 6 చెరువులకు సంబంధించి ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా 18,827 ఓట్లు ఉన్నాయి. రైతులు తప్పనిసరిగా గుర్తింపుకార్డుతో వచ్చి ఓటువేయాలన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: నీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14వ తేదీన జరుగనున్న నేపథ్యంలో పీవోలు, ఏపీవోలకు మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ సుజన్‌కుమార్ మాట్లాడుతూ పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు నిర్వహించాల్సిన విధులను వివరించారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జ్యోతి, డీటీ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో..

చీమకుర్తి: సాగునీటి సంఘాలను ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం సంబంధిత పోలింగ్ అధికారులు విడుదల చేశారు. చీమకుర్తి డివిజన్‌లోని నాలుగు సబ్‌డివిజన్లు అయిన చీమకుర్తి, దర్శి, సంతనూతలపాడు, ఒంగోలు సబ్‌డివిజన్లలో మేజర్ ఆయకట్టు కింద 54 నీటిసంఘాలు, 6 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ) ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్‌కు చెందిన మరో ఆరు డబ్ల్యూయూఏలకు ఎన్నికలను ఈనెల 14వ తేదీన నిర్వహించనున్నారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికను జరపనున్నారు. 14న నామినేషన్‌లు వేయటం, అదేరోజు టీసీలకు సభ్యులు ఎన్నిక, తదుపరి డబ్ల్యూయూఏలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. కాగా ఎన్నిక ప్రక్రియ ఎలా నిర్వహించాలనే విషయంపై బుధవారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ అధికారులకు శిక్షణను నిర్వహించారు. తహసీల్దార్ బ్రహ్మయ్య ఎన్నికప్రక్రియపై అవగాహన కల్పించారు. కాగా నోటిఫికేషన్ విడుదల కావటంతో గ్రామాల్లో ఎన్నికల వేడి రాజుకుంది.

కొండపి మండలంలో..

కొండపి: మండలంలోని ఆరు సాగు నీటి సంఘాల ఎన్నికకు బుధవారం అధికారులు నోటిఫికేషన్ ప్రకటించారు. కొండపి పీడబ్ల్యూడీ చెరువుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను స్థానిక జీహెచ్‌ఎస్‌లో ఎన్నికల అధికారి పి.రామారావు విడుదల చేశారు. ముప్పవరం, తాటాకులపాలెం, పెట్లూరు-1, పెట్లూరు-2, పెట్లూరు-3 చెరువులకు సంబంధించి ఎన్నికల అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రకటించారు.

పీవోలు, ఏపీవోలకు శిక్షణ

సాగునీటి సంఘాలకు ఈనెల 14వ తేదీన ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులకు స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా తహసీల్దార్ పి.మురళి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు, ఎంపీడీవో కార్యాలయ ఏవో రామకృష్ణ, ఏవో డి.విజయ్‌కుమార్, ఇరిగేషన్ శాఖ అధికారి బాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు(రూరల్)):ఒంగోలు మండల పరిధిలో ఈనెల 14వ తేదీన నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని తహసీల్దార్ కె.వాసు పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు యరజర్ల, కొత్తమామిడిపాలెం, కొప్పోలు-1, కొప్పోలు-2 ఎఫ్‌సీఐ గూడెంలలో పోలింగ్ బూతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికలకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

రైతు సాధికార సంస్థ బృందాల పర్యటన



కంది పంటను పరిశీలిస్తున్న అధికారులు

టంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందులూరులో బుధవారం రైతు సాధికార సంస్థ బృందాలు పర్యటించాయి. ముందుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తెల్లా త్రివేణి క్షేత్రాన్ని పరిశీలించాయి. గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో ప్రకృతి వ్యవసాయం చేసే వారితో సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా వారికి అధికారులు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, అన్వర్, రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన మురళి, ప్రవీణ్, కిశోర్ ఏవో స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ మృతికి సంతాపం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జమ్మూలో ల్యాండ్ మైన్ పేలి ప్రాణాలు కోల్పోయిన కంభం మండలం రావిపాడుకు చెందిన ఆర్మీజవాన్ వరికుంట్ల వెంకటసుబ్బయ్య మృతి పట్ల మాజీ మంత్రి శిద్దా రాఘవరావు బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి బాధాకరమన్నారు. తనను తాను త్యాగం చేసుకొని తోటి జవానులను కాపాడిన తీరు స్ఫూర్తిదాయకమని, వెంటకసుబ్బయ్య మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

యువకునికి గాయాలు

మద్దిపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలైన ఘటన బుధవారం వెంకటరాజుపాలెం దగ్గరగల హైవేపై జరిగింది. స్థానికుల సమాచారం మేరకు సింగరాయకొండకు చెందిన షేక్ నజీర్‌బాష మోటార్‌సైకిల్‌పై మార్టూరు బయల్దేరాడు. వెంకట్రాజుపాలెం దగ్గరకు రాగానే లారీ వేగంగా రావడంతో ఆయన డివైడర్‌ను ఢీకొట్టగా గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

రేపటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలో ఈనెల 13నుంచి మూడు రోజుల పాటు జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఒంగోలు నగరం గాంధీనగర్‌లోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో ఎస్‌డీ.హుస్సేన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 13న చీమకుర్తిలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పలువురు నాయకులు హాజరవుతారని చెప్పారు. అనంతరం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీవీ.రావు, షేక్ పీరు, దాసు, గురవయ్య, రావూరి శ్రీనివాస్, షేక్ జబ్బార్, జాన్‌బాషా పాల్గొన్నారు.

ఉత్సాహంగా గీతాపఠనం



గీతాపఠనంలో విద్యార్థులు

ఒంగోలు విద్య, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్, గీతామందిరం ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని మాంటిస్సోరి స్కూలులో భగవత్ గీతా శ్లోక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతా జయంతి సందర్భంగా కోటి గొంతులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మాంటిస్సోరి స్కూలు కరస్పాండెంట్ ప్రకాష్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు గీతా పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో గీతామందిరం నిర్వాహకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

14న నాదయోగ సంగీత విభావరి

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నాదయోగ సాంస్కృతిక సమాఖ్య ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 14వ తేదీన సినీ అభ్యుదయ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు, ప్రజాగాయకుడు నూకతోటి శరత్‌బాబు తెలిపారు. బుధవారం ఒంగోలులో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సాయంత్ర జరిగే ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన 30మంది గాయకులు పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, సంగీతాభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మండవ సాయిసుబ్బారావు, వేమగుంట జగదీష్‌బాబు, పర్వతనేని రామకృష్ణప్రసాద్, కల్లం శ్రీధర్‌రెడ్డి, జీఎస్‌వీ.రత్నకుమార్ పాల్గొన్నారు.

అమరజీవి స్మారక భవనాన్ని అభివృద్ధి చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని అమరజీవి స్మారక భవనాన్ని పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేయాలని ద్రావిడదేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం చెన్నైలో 58 రోజుల పాటు నిరహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన అశువులు బాసిన ఇంటిని ప్రభుత్వం కొనుగోలు చేసి స్మారకభవనంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు.

మత్స్య సంపద యోజనపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన అమలు, నిధుల కేటాయింపుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధానం ఇస్తూ ఈ పథకం కింద ప్రకాశం జిల్లాలో రూ.270 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 8 జిల్లాల్లో ఫిషింగ్ హార్బర్లలో మౌలిక వసతుల ఏర్పాటు చేసేందుకు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

క్రీడాకారిణికి నగదు ప్రోత్సాహం



రిషితప్రియకు నగదును అందజేస్తున్న ప్రిన్సిపాల్

టంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాకారిణి తేళ్ల రిషితప్రియకు పూర్వ విద్యార్థి బెజవాడ శ్రీనివాసరావు దంపతులు రూ.5వేల నగదు ప్రోత్సాహన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి బుధవారం రిషితప్రియకు అందించారు. విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రిషితప్రియ సత్తా చాటారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ ఎం రమాదేవి, యరమాల అరుణ అభినందించారు.

అవీ..ఇవీ



పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో

ప్రజల సహకారంతోనే పంచాయతీల అభివృద్ధి

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు అన్నారు. బుధవారం ఎర్రగొండపాలెంలోని మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీని సందర్శించినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు క్రమం తప్పకుండా ఇంటి పన్నులు, నీటి పన్నులు చెల్లించడం ద్వారా ఆ నిధులతో స్థానికంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుకలుగుతుందని అన్నారు. స్థానికంగా ప్రజలకు ఉపయోగపడే పార్కులు తదితర వాటికి ప్రజలు, స్థానికులు ముందుకు రావాలని కోరారు. అనంతరం పంచాయతీలో ఆదాయం తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కాపురం డీఎల్‌పీవో భాగ్యవతి, పంచాయతీ కార్యదర్శి ఈదూల రాజశేఖరరెడ్డి, 3వ వార్డు మెంబర్ చేదూరి కిషోర్, టీడీపీ నాయకులు వేగినాటి శ్రీనివాస్ ఉన్నారు.



అయ్యప్పస్వామి విలక్కి సందర్భంగా కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

వైభవంగా అయ్యప్పస్వామికి నగరోత్సవం

గిద్దలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా విలక్కి కార్యక్రమం నిర్వహించారు. దేవాలయంలో విరూపాక్ష స్వామి గోపుర శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామికి విలక్కిలో భాగంగా నగరోత్సవం నిర్వహించారు. అనంతరం మహాపడిపూజ, అష్టాదశ సోపాన పూజలు నిర్వహించారు. కాగా రాచర్ల లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో సైతం వైభవంగా విలక్కి నిర్వహించారు. కోలాట బృందాల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విలక్కి అనంతరం స్వామి వారికి మెట్ల పూజ నిర్వహించారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

- పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలో శ్రీ గోవిందాంబ సమేత విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో అత్యంత వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక టీడీపీ నాయకులు, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆయా కార్యక్రమాలలో పాల్గొన్నారు.



మార్కాపురంలో శ్రీకృష్ణుని నగరోత్సవం

భక్తి శ్రద్ధలతో గీతా జయంతి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని మార్కాపురం పట్టణంలో బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కళ్లె వేణుగోపాల శర్మ గీతా సారాంశంపై ప్రసంగిస్తు భగవద్గీత భగవంతుని నోటి నుంచి వచ్చిన ఉపదేశం అని, సాక్షాత్తు శ్రీకృష్ణ స్వరూపం అన్నారు. మైలటూరి రవిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో సామూహిక హారతి నిర్వహించారు. అనంతరం మేళతాళాలు భగవద్గీత పారాయణం, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన శ్రీకృష్ణుడి విగ్రహానికి నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గౌరవాధ్యక్షులు గోపాలుని హరిహరరావు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు ఇమ్మడిశెట్టి వీరారావు, హిందూ ధర్మ పరిషత్ నాయకులు గుంటక సుబ్బారెడ్డి, శేఖర్, రత్నాకర్, ఇస్కాన్ కన్వీనర్ దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో వైభవంగా వేడుకలు

గిద్దలూరు : గీతాజయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని రాధాకృష్ణ మందిరంలో గీతాజయంతి సందర్భంగా శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహికంగా భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అఖిల భారత సత్యసాధు పరిషత్ అధ్యక్షులు సత్య జ్ఞానానంద స్వామీజీ హాజరై మాట్లాడుతూ గీతా మహత్యంలో చెప్పినట్లుగా, భగవద్గీతలోని సూచనలను సక్రమంగా పాటిస్తే జీవితంలో సకల కష్టాలు, ఆందోళనల నుంచి విముక్తి పొందవచ్చని అన్నారు.

అధ్వానంగా ప్రధాన రహదారులు

తాత్కాలిక మరమ్మతులకూ నోచని దైన్యం

పొదిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నంద్యాల జాతీయ రహదారి అధ్వానంగా తయారైంది. నాలుగేళ్లుగా తాత్కాలిక మరమ్మతులు చేయకపోవడంతో రహదారి దుస్థితి మరింత దిగజారింది. అడుగడుగునా గోతులతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నప్పటికి మరమ్మతులు చేపట్టడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యవైఖరి ప్రదర్శిస్తున్నారు. మార్కాపురం అడ్డరోడ్డు దగ్గర పెద్దగుంత ఏర్పడినా ఇంతవరకూ మరమ్మతులు చేపట్టలేదు. ఆగుంతలో మోటార్‌బైకిస్ట్ పడి మృతి చెందిన సంఘటనా ఉంది. పాత పోస్టాఫీస్ సమీపంలో పెద్ద గుంతలు ఏర్పడి చిన్నవర్షం పడినానీరు నిల్వ ఉండి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పొదిలి దర్శి ప్రధాన రహదారిలో తోళ్ళమడుగు వాగు సమీపంలో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస మరమతులు చేయక పోవడం విశేషం. జాతీయరహదారిపై మూసి వాగు బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలకు బ్రిడ్జిపై పెద్దగుంతలు ఏర్పడాయి. వాటికి మరమ్మతులు లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారులలో ఉన్న గుంతలను త్వరితగతిన పూడ్చి వేసి ప్రమాద నివారణలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలో గోతుల మయంగా ఉన్న రహదారి



పాతపోస్టాఫీస్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు



తోళ్లమడుగు వాగు సమీపంలో ఏర్పడ్డ గోతులు

నీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14వ తేదీన జరిగే నీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణా సిబ్బందికి తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమానికి సబ్ కలెక్టం హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా నిర్వహించాలని కోరారు. ఎన్నికల నియమనిబంధనల ప్రకారం నడుచుకోవాలని, రూల్స్‌కు విరుద్ధంగా ఎవరూ పని చేయకూడదని తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటే వెంటనే అధికారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. నిబంధనలు అనుసరిస్తూ సమయానికి తగ్గట్టుగా పనులను పూర్తి చేసి నివేదికలను సంబంధిత ఎన్నికల అధికారులకు పంపించాలని తెలిపారు. తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఉపయోగించాల్సిన సామగ్రి వివరాలను వివరించారు. ఎన్నికలు నిర్వహించాల్సిన తీరును స్క్రీన్ ద్వారా వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో శ్రీనివాసులు, ఎన్నికల పీవోలు, ఏపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్



త్రిపురాంతకంలో ఎన్నికల సామగ్రిని అందజేస్తున్న డీఈఈ విజయలక్ష్మి

ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

త్రిపురాంతకం : త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ పరిధితో పాటు మైనర్ ఇరిగేషన్‌లోని సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్‌ను అధికారులు బుధవారం విడుదల చేశారు. సాగర్ ఆయకట్టులోని 9 సంఘాలు, ఇరిగేషన్ పరిధిలోని 8 సంఘాలకు నోటిఫికేషన్ రాగా ఈనెల 14న సభ్యుల నామినేషన్లు, పరిశీలన, ఎన్నికల ప్రక్రియ, ఫలితాల ప్రకటన చేపట్టనున్నారు. అదే రోజు సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తి చేస్తారు. అనంతరం ఈనెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఎన్నికల సామగ్రిని ఎన్నెస్పీ డీఈఈ విజయలక్ష్మి సిబ్బందికి అందజేశారు. అనంతరం ఎన్నికల నిర్వహణపై తహసీల్దారు జి.శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించారు.

సాగునీటి ఎన్నికలపై శిక్షణ

పొదిలి : సాగునీటి సంఘాల ఎన్నికలపై బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి శిక్షణ నిర్వహించారు. పీవో, ఏపీవో, వీఆర్వోలు, పీఎస్‌లతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో తీగదుర్తిపాడు, రామాపురం, ఏలూరు, పొదిలి పెద్దచెరువు, పొదిలి చిన్నచెరువులకు సంబంధించి 5 సాగునీటి సంఘాలకు ఈనెల 14వతేదీన ఎన్నికల జరుగుతాయన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని ఆయన కోరారు. అదే రోజు నామినేషన్‌లు, ఎన్నికలు, ఫలితాలు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఏలూరు సంఘం పరిధిలో 1,078మంది, పొదిలి పెద్దచెరువు 797, పొదిలి చిన్నచెరువు 285, రామాపురం 313, తీగదుర్తిపాడులో 177 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఎన్నికల అధికారులుగా తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయాధికారి, ఇరిగేషన్ ఏఈ, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఏఈఈలు ఎన్నికల అధికారులుగా ఉంటారన్నారు.



శిక్షణ మాట్లాడుతున్న పొదిలి తహసీల్దార్ కృష్ణారెడ్డి

రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి). రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు సద్వియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె చిరంజీవి కోరారు. మండలంలోని పెద్దయాచవరం గ్రామంలో గ్రామసభను బుధవారం నిర్వహించి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ భూములను అన్యాక్రాంతంగా ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ఈవో గొలమూరి శ్రీనివాసరెడ్డి, సర్వేయర్ సంజీవయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలో అర్జీలకు పరిష్కారం



తర్లుపాడులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

తర్లుపాడు : గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను గ్రామ సభల్లో అర్జీలు ఇస్తే వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ యు.విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని నాగెళ్లముడుపులో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలపై 28 అర్జీలు ఇచ్చారు. నాగెళ్లముడుపు నుంచి తాడివారిపల్లె హైవే రోడ్డు వరకు రోడ్డును విడగొట్టాలని గ్రామస్థులు వినతి పత్రం సమర్పించారు. ఇచ్చిన అర్జీలకు 45 రోజుల్లోపు పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. అలాగే రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఈవోఆర్డీ సుకుమార్, సర్వేయర్లు, వీఆర్వోల తదితరులు పాల్గొన్నారు.



మాజీ కౌన్సిలర్ బాలకాశిరెడ్డి మృతి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గొలమారి బాల కాశిరెడ్డి(82) బుధవారం తూర్పువీధిలోని ఆయన నివాసంలో వయోభారంతో మృతి చెందారు. మార్కాపురం సింగిల్ విండో చైర్మన్‌గా, ఎస్‌వీకే నిలయం రీడింగ్ రూం ఉపాధ్యక్షులుగా బాల కాశిరెడ్డి పని చేశారు. గతంలో 8వ బ్లాక్ వార్డుగా పిలువబడే తూర్పు వీధి నుంచి ఆయన కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. బాల కాశిరెడ్డి మృతదేహాన్ని పలువురు రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. గురువారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

బోడపాడులో సీసీ కెమెరాల ప్రారంభం

మార్కాపురం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడపాడు గ్రామంలో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్‌ఐ అంకమ్మరావు బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మొబైల్‌కు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయాకూడదని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా గ్రామస్థులు అవగాహన కలిగిఉండాలన్నారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బొగ్గు శేఖరరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



బోడపాడు గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున స్వామిని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మల్లికార్జునస్వామిని దర్శించుకోగా అక్కడి వేద పండితులు ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందించారు.

పాదయాత్రకు సంఘీభావం

గిద్దలూరు నుంచి శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్న టీడీపీ కార్యకర్తలు పిడతల రవితేజ, దూదేకుల దస్తగిరిలను మార్గమధ్యంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ నేతలతో కలిసి సంఘీభావం ప్రకటించారు. పాదయాత్ర చేపట్టిన వారిని అభినందించారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

కూటమితోనే గ్రామాల అభివృద్ధి

● మంత్రి సత్యకుమార్ యాదవ్

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కొలుకుల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కనీసం పంచాయతీలకు నిధులు కూడ ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుతం గ్రామాలకు వెళుతుంటే ఎక్కడ చూసినా రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కలయికతో రాష్ట్రంలో విద్య, వైద్యం, అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎనుమల నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు మాదాల నాగేశ్వరరావు, టీడీపీ మడల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం టౌన్, రూరల్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీఆర్‌యూపీఎఫ్ అధ్యక్షులు రెవరెండ్ లాజరస్ వాఖ్య సందేశం ఇచ్చారు. పాస్టర్ కందుల దేవదానం, బ్రదర్ సత్యబాబు, దైవసందేశం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు, మహిళలకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రసన్నకుమార్, జార్జ్ బాబు, దేవదానం, రామచంద్ర, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.



కంది పంటను పరిశీలిస్తున్న ఏవో జవహర్ లాల్ నాయక్

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● ఏవో జవహర్‌లాల్ నాయక్

పెద్దదోర్నాల,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి):కందిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు.మండలంలోని ఐనముక్కల, హసనాబాద్ గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాలలో సాగు చేసిన కంది, మినుము, జొన్న, మిరప పంటలను పరిశీలించారు. ఈ క్రమంలో కందిలో మారుకా మచ్చల పురుగు ఆశించి పంటను నాశనం చేస్తుండడంతో ఆయన నివారణ చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. అందుకు గాను తొలి దశలో క్లోరిఫైరిఫాస్ 2.5ఎంఎల్, లేక డైమీతోఏట్ 2ఎంఎల్ లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. తర్వాత దశలో నోవాల్యూరాన్ 1గ్రాం, లేక ఇండోక్సికార్బ్ 1గ్రాం లీటరు నీటిలో కలిపి వేప గింజల కషాయం లేదా వేప నూనె 500 గ్రాములలో కలిపి ఎకరంపై పిచికారీ చేయాలన్నారు. మిరపలో తామర పురుగు నివారణకు చిల్లీ స్పెషల్ కషాయం తయారీ విధానాన్ని ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో చైతన్య కుమార్, వీఏఏ శివనాయక్, వీహెచ్‌ఏ సుస్మిత రైతులు పాల్గొన్నారు.

తిప్పాయపాలెంలో..

మార్కాపురం రూరల్ : మండలంలోని తిప్పాయపాలెం, చింతకుట గ్రామాలలో బుధవారం ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు పొలంపిలుస్తోంది కార్యక్రమం రైతులతో కలిసి నిర్వహించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి సలహాలు సూచనలు తెలియజేశారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది శివ శంకర్ నాయక్, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

తర్లుపాడు : రబీలో సాగు చేసిన పంటలకు ఫసల్ బీమాకి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నాగెళ్లముడుపులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, మిర్చి, మొక్కజొన్న, మినుము పంటలను పరిశీలించారు. కందిపంటపై పచ్చ పురుగు ఉధృతంగా ఉందని, దీని నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నిమ్మ సుబ్బమ్మ, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికే శిక్షణ తరగతులు

పెద్ద దోర్నాల,డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక శిక్షణా తరగతులు గ్రామాభివృద్ధికి ఉపకరిస్తాయని ఎంపీడీవో నాసర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను ఎంపీడీవో నాసర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించి యుద్ధ ప్రాతిపదికన ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్ నాయక్, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంటు పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు బొడిచెర్లలో హనుమాన్ వ్రత మహోత్సవం

మార్కాపురం రూరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొడిచెర్ల గ్రామంలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 13వతేదీ శుక్రవారం 25వ హనుమత్ వ్రత మహోత్సవం నిర్వహిచనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 11 గంటలకు శ్రీ హనుమాన్ వ్రత పూజ, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరుగుతుందని తెలిపారు. రాత్రి భజన కార్యక్రమం, ప్రసాద వినియోగ కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

దర్శి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దర్శి మండలం పోతవరం ప్రాథమిక పాఠశాలలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కోరె బాల రంగసాయి విద్యార్థుల సౌకర్యార్థం రూ.10 వేల విలువ చేసే పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ధనిరెడ్డి వెంకటరెడ్డి సూచన మేరకు రంగసాయి తాను చదివిన పాఠశాల రుణం తీర్చుకుంటూ విద్యార్థులకు సహాయం చేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మానవత సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాస రెడ్డి, లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ జేబీ రామారావు, ఉపాధ్యాయులు బసంతి, ఖాసిం పాల్గొన్నారు.

వైసీపీకి ముస్లింనేత సయ్యద్ లతీఫ్ రాజీనామా

తాళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆవిర్భావం నుంచి కీలకంగా ఉండి జిల్లాముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న సయ్యద్ లతీఫ్ ఆ పార్టీకి, పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా లతీఫ్ మాట్లాడుతూ దివంగత వైఎస్సార్‌పై ఉన్న అభిమానంతో పార్టీలో అనేక అవమానాలు భరించి కొనసాగామని, తాడేపల్లిలోని విస్తృత సమావేశ సమాచారం కూడా లేకపోవటం బాధాకరమని చెప్పారు.

భక్తులకు అన్నదానం

పామూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప భక్తులకు టీడీపీ నాయకులు రియల్టర్ ఆకుపాటి రమణయ్య, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ ఆర్థిక సహకారంతో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, భవాని, శివ, ఆంజనేయ, గోవింద స్వాములు పాల్గొన్నారు.

నేడు చింతలపాలెంలో రెవెన్యూ సదస్సు

పామూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలపాలెంలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించనున్నట్లు వీఆర్వో పరుసు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు కురిచేడు విద్యార్థి



కురిచేడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు కురిచేడు వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి దాసరి విష్ణునందన్ ఎంపిక అయ్యాడు. పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. విష్ణునందన్‌ను ప్రధానోపాధ్యాయులు సాయి, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్ మల్లికార్జున్, వైస్ ఛైర్మన్ జాన్‌బిలు అభినందించారు.

13నుంచి చీమకుర్తిలో సీపీఎం జిల్లా మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలో ఈనెల 13నుంచి మూడు రోజుల పాటు జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఒంగోలు నగరం గాంధీనగర్‌లోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో ఎస్‌డీ.హుస్సేన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 13న చీమకుర్తిలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పలువురు నాయకులు హాజరవుతారని చెప్పారు. అనంతరం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు.

యువకునికి గాయాలు

మద్దిపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలైన ఘటన బుధవారం వెంకటరాజుపాలెం దగ్గర గల హైవేపై జరిగింది. స్థానికుల సమాచారం మేరకు సింగరాయకొండకు చెందిన షేక్ నజీర్‌బాష మోటార్‌సైకిల్‌పై మార్టూరు బయల్దేరాడు. వెంకట్రాజుపాలెం దగ్గరకు రాగానే లారీ వేగంగా రావడంతో నజీర్‌బాష డివైడర్‌ను ఢీకొట్టగా తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్‌కు తరలించారు.

రైతు సాధికార సంస్థ బృందాల పర్యటన

టంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందులూరులో బుధవారం రైతు సాధికార సంస్థ బృందాలు పర్యటించాయి. ముందుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తెల్లా త్రివేణి క్షేత్రాన్ని పరిశీలించాయి. గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో ప్రకృతి వ్యవసాయం చేసే వారితో సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా వారికి అధికారులు పలు సూచనలు ఇచ్చారు. కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, అన్వర్, రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన మురళి, ప్రవీణ్, కిశోర్ ఏవో స్వర్ణలత పాల్గొన్నారు.

పన్నెండేళ్లకు మోక్షం

తొలిసారి ఎమ్మెల్యే హోదాలో కనిగిరికి బైపాస్‌ను మంజూరు చేయించిన ఉగ్ర

ఆ తర్వాత అర్ధంతరంగా ఆగిన పనులు

ఇద్దరు శాసనసభ్యులు మారినా కదలని నిర్మాణం

తాజాగా ఉగ్ర చొరవతో సమస్యలన్నింటికీ పరిష్కారం

వేగవంతంగా సాగుతున్న పనులు

అనతి కాలంలోనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



కాశిరెడ్డి కాలనీ నుంచి రోడ్డుకు ఇరువైపులా హైవే నిర్మాణానికి తోలిన కంకరు

కనిగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చిత్తశుద్ధి ఉండాలి.. దానికి అనుకూల వాతావరణం జత కలిస్తే ఎలాంటి పనైనా, సమస్య అయినా పరిష్కరించుకోవచ్చు. ఏళ్ల తరబడి మూలనపడిన అభివృద్ధి పనులు సైతం పట్టాలెక్కించవచ్చు. అందుకు నిదర్శనమే కనిగిరి బైపాస్ నిర్మాణం. వివరాల్లోకెళ్తే... కనిగిరి నగర పంచాయతీలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గమైన బైపాస్ హైవే అసంపూర్తిగా ఆగిపోయి 12 ఏళ్లు గడిచింది. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి 2010లో తొలి సారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు మంజూరు చేయించిన బైపాస్ రోడ్డు.. ఆ తర్వాత పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. హైవే కింద భూములు కోల్పోతున్న రైతులు నష్టపరిహారం కోసం ఎన్నో అభ్యర్థనలు, ఆ తర్వాత సమావేశాలు జరిగినప్పటికీ పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో ఇద్దరు ఎమ్మెల్యేలు మారినా ఎలాంటి ప్రయోజనం కలగలేదు. బైపాస్ పూర్తికాకపోవడంతో కనిగిరిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలంగా మారింది.

2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేగా రెండోసారి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి గెలిచారు. వెనువెంటనే అసంపూర్తిగా ఆగిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణంతోపాటు భూ నిర్వాసితులకు నష్టపరిహారం మంజూరు చేయించగలిగారు. అంతేకాకుండా కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి పనులు వేగవంతంగా పూర్తిచేస్తే ప్రభుత్వం నుంచి నిధులను కూడా వెంటనే ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్‌కు నమ్మకం పెరిగి వేగవంతంగా పనులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కనిగిరి పెద్దచెరువులో వేసిన బెడ్డింగ్ పనులకు ఆటంకం ఏర్పడినప్పటికీ కాశిరెడ్డికాలనీ నుంచి రెండు వైపులా ఉన్న మార్జిన్లను విస్తరించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు కాశిరెడ్డి కాలనీ నుంచి కంకరు తోలుతున్నారు. రోడ్డు ఆక్రమణలు, పిచ్చిచెట్లను కూడా తొలగించటంతో రోడ్డు విశాలంగా కనపడుతుందని వాహనదారులు, స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

దీర్ఘకాలిక రహదారి సమస్య పరిష్కారం

దొనకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పొలాలకు వెళ్లే రహదారి సమస్యను తహసీల్దార్ రమాదేవి పరిష్కరించారు. మండలంలోని సంగాపురం గ్రామంలో పొలాలకు వెళ్లే రహదారి సమస్యను పరిష్కరించాలంటూ గ్రామానికి చెందిన రైతు గోగు మునెయ్య రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. కొందరు వైసీపీ నాయకులు ఐదేళ్ల క్రితం ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని రహదారి లేదంటూ పొలాలకు వెళ్లనీయకుండా దౌర్జన్యంగా అడ్డుకున్నారు. దీంతో దాదాపు 35 ఎకరాలకు చెందిన కొందరు రైతులు సాగు చేసుకునేందుకు వీలులేకుండా పోయింది. దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చొరవతో తహసీల్దార్ ఆదేశాల మేరకు పోలీస్ యంత్రాంగం వెళ్లి దారి సమస్యకు పరిష్కారం చూపారు.



సంగాపురంలో రహదారి సమస్యను పరిష్కరిస్తున్న తహసీల్దార్, ఎస్సైలు

భూ వివాదాలను తక్షణమే పరిష్కరించాలి

దర్శి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు ఉన్న రైతులు సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని దర్శి తహసీల్దార్ ఎం శ్రావణ్ కుమార్ సూచించారు. మండలంలోని చందలూరు, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం రైతులు 28 అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ పరిటాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభకు 8 అర్జీలు

కురిచేడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవులమంద పంచాయతీ నాంచారపురంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో 8 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రజనీకుమారి చెప్పారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూరిమెట్ల, భీమవరం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మండల ప్రత్యేక అధికారి ఆర్ చంద్రశేఖరరెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం వారు ఎస్సీ కాలనీలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ పీఎస్‌ఆర్ మూర్తి, సర్వేయర్ సీహెచ్ కోటంరాజు, మాజీ ఎంపీపీ కోడెగ మస్తాన్‌రావు, సర్పంచ్ ఓగులూరి రామాంజీ, ఓగులూరి నాగేశ్వరరావు, చొప్పరపు నాగేశ్వరరావు, అబ్బూరు గోవిందయ్య, కృష్ణ, వీఆర్‌వోలు బద్రి అయ్యపరెడ్డి, సుజాత, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పామూరులో...

పామూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ బీవీ రమణారావు చెప్పారు. మండలంలోని గుమ్మలంపాడు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల వద్ద రెవెన్యూ సదస్సును వగ్గంపల్లి సర్పంచ్ డీ సుబ్బయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యూటేషన్‌కు, భూ సమస్యలపై 7 దరఖాస్తులు వచ్చాయి. అలాగే పడమటకట్టకిందపల్లి సర్వే నెంబర్ 13/2లో ఐదెకరాల భూ సమస్యను పరిష్కరించాలని రామచంద్రుని దేవదాసుకు తహసీల్దార్‌కు అర్జీ అందజేశారు. అధికారుల తప్పిదం వల్ల సెటిల్‌మెంట్ భూమిని అసైన్డ్‌భూమిగా మార్చారని బాధితుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఐ మల్లికార్జునరావు, డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, ప్రత్యేకాధికారి ఎం పానకాలరావు, ఎండోమెంట్ ఈవో నరసింహబాబు, వీఆర్వో బూదాల కుమార్, మండల సర్వేయర్ స్నేహ పాల్గొన్నారు.

సాగునీటి సంఘం ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఈ నెల 14 తేదీ జరుగుతున్నందున వీవో, ఏపీవోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.సంజీవరావు చెప్పారు. స్థానిక ఎంపీడీవో సమావేశం హాలులో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల పీవో, ఏపీవోలకు, సిబ్బందికి బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్‌ను గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించాలన్నారు. ఎన్నికల రోజు ఓటర్లను అనుమతించే సమయంలో వారి పట్టాదార్ పాస్‌బుక్, 1-బీఖాతాలను వీఆర్‌వో, తహసీల్దార్ ధ్రువీకరించిన కాపీలతో పాటు, గుర్తింపు కార్డులతో అనుమతించాలన్నారు. ఎంపీవో-1, ఎంఈవో-2లు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకర్‌రావులు ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుందరరామయ్య, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్‌రాజు, వ్యవసాయాధికారి ప్రసాదరావు, రీసర్వే డీటీ ప్రశాంత్, ఏఈఈలు కిరణ్‌కుమార్, కోటేశ్వరరావు, ఎన్.వి.ఎస్ రామ్‌కుమార్, డి. శంకర్‌రావు, జి.ఈశ్వరరెడ్డి, ఎం సుబ్బారావు పాల్గొన్నారు.

దర్శిలో

దర్శి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని దర్శి తహసీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్ సూచించారు. దర్శిలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దొనకొండలో...

దొనకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తహసీల్దార్ రమాదేవి మాట్లాడారు. కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలో నాలుగు, రామాపురంలో రెండు, గుడిపాడులో రెండు, ఆరవల్లిపాడులో ఒకటి, రుద్రసముద్రం ఒకటి, మల్లంపేటలో ఒకటి మొత్తం 11 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, ఎస్సై విజయ్‌కుమార్, డీటీ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.



తాళ్లూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

ముండ్లమూరులో...

ముండ్లమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికల నిర్వహణపై ఏవోలకు, పీవోలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఈ పూర్ణచందు, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఏఈ పీ ప్రసాదు, ఏవో ఫరూక్, ఏఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15లోపు పంటల బీమాకు అవకాశం

కనిగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15వ తేదీలోపు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని అగ్రికల్చర్ ఏవో జ్యోత్స్నాదేవి చెప్పారు. మండలంలోని చల్లగిరగల, యడవల్లి, తుమ్మకుంట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఏవో అంజలీబాయి, వీఏఏలు షేక్ నాజ్మా, షేక్ మహబూబ్ ప్యారీ, వెటర్నరీ అసిస్టెంట్ శివ, ఏసీఆర్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పీసీపల్లి మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

మిరపలో జిగురు అట్టలను వాడాలి

దొనకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మిరప పంట సాగు చేసిన రైతులు పంటలో జిగురు అట్టలను పెట్టి కుచ్చు తెగుళ్ల రాకుండా నివారించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి రమేష్ చెప్పారు. మండలంలోని మంగినపూడి, భూమనపల్లి గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రాధిక, వెటర్నరీ అసిస్టెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

పోషకాల లోపాలను గుర్తించాలి

తాళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్కవరం, దోసకాయలపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలంపిలుస్తుంది కార్యక్రమంలో వీఏఏ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పీసీపల్లి, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): పంటలను ఆశించే సీజనల్ తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ వెంకటరమణ చెప్పారు. మండలంలోని మురుగుమ్మి, నేరేడుపల్లి రైతుసేవాకేంద్రాల పరిధిలోని పంటపొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పుల్లయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు అఖిల్, సాయిప్రియ ఉన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను మరింత ప్రచారం చేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా టీడీపీ సోషల్ మీడియా సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం ఉత్తమంగా అందించిన సభ్యులకు ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ స్థాయిలోనే కనిగిరి ప్రాంతానికి చెందిన 10మంది టాప్ ఫెర్మార్లుగా నిలవటం ఎంతో గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో మిగతా వారు కూడా కృషి చేయాలని కోరారు. ప్రశంసాపత్రాలు అందుకున్నవారిలో సానికొమ్ము హరినాథ్‌రెడ్డి, దండై హనుమంతరావు, నంబూరి వెంకటనారాయణ, మన్నేపల్లి మనోహర్‌బాబు, కోటపాటి రామ్మోహన్‌రావు, పాపాబత్తిన నారాయణబాబు, పెన్నా గురవయ్య, మోరా శశికాంత్‌రెడ్డి, వీరవెంకట నాగదుర్గ, జుటికే మహేష్, మండ్లా రమణయ్య, ఉరియా ఏడుకొండలు, పొనగంటి చలపతి, ఏజర్ల వెంకటరమణ, పూండ్ల పోలయ్య, మల్లెల శ్రీనివాసులు, మార్నేని మమత, షేక్ ఫాతిమా, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, మద్దూరి శశిధర్, చెరుకూరి పెదకాశయ్య గొడుగులూరి కిరణ్ ఉన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న సభ్యులు

అవీఇవీ

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

దొనకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్త, ఆయాల పోస్టులను రోస్టర్ ప్రకారం భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని ఐసీడీఎస్ దర్శి ప్రాజెక్టు సీడీపీవో భారతి తెలిపారు. ఆరవల్లిపాడు-1 అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్త పోస్టు బీసీ-డీ రిజర్వు చేయబడిందని, సహాయకురాళ్ల కేంద్రాలైన రుద్రసముద్రం-1 కేంద్రం ఎస్సీ, రుద్రసముద్రం-2 కేంద్రం బీసీ-డి, మంగినపూడి-1 కేంద్రం ఓసీ(జనరల్), కొచ్చెర్లకోట-2 కేంద్రం ఓసీ(జనరల్), బాదాపురం-2 కేంద్రం బీసీ-ఏ కేటగిరీ వర్గాలకు కేటాయించారని తెలిపారు. అర్హత కల్గిన మహిళలు విద్యార్హత పత్రాలు, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కురిచేడులో 4 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు...

కురిచేడు, డిసెంబరు 11 : మండలంలో 4 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు అధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు.కురిచేడు ఎన్నెస్పీ కాలనీకి ఓసీ జనరల్, ఆవులమంద పంచాయతీ రామాంజనేయ కాలనీలో ఎస్సీ మహిళ, ముష్టిగంగవరంలో ఓసీ జనరల్ మహిళ, ఆవులమంద-1 ఓసీ జనరల్ మహిళా అభ్యర్థినులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈదర చేపల చెరువుకు వేలం పాట

రూ.13 లక్షలకు దక్కించుకున్న గురవయ్య



వేలం పాట నిర్వహిస్తున్న ఎంపీడీవో జనార్దన్

ముండ్లమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదర చేపల చెరువులో మూడేళ్ల పాటు చేపలు వేసి పెంచి పట్టుకునేందుకు మంగళవారం సాయంత్రం కౌలు వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన నాగమల్లి గురవయ్య రూ.13 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆర్ జనార్దన్ మాట్లాడుతూ చేపల చెరువు వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఖర్చు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంగల పద్మావతి, శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జే శ్రీనివాసరావు, ఇరుగుల కొండారెడ్డిలతో పాటు మాజీ సర్పంచ్ గురుస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలబారు చప్టాపై రాకపోకల సమస్యకు పరిష్కారం



చప్టా వద్ద పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

తాళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు-కొత్తపాలెం ఆర్ అండ్‌బీ మార్గంలో నేలబారు చప్టా పూర్తిగా పూడిపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఆ చప్టా రోడ్డుకంటే లోతు తక్కువగా ఉండడం, ఎగువ నుంచి వచ్చే మురుగు నీరు ఆ చప్టా మీదుగానే ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఎంపీడీవో కె.సుందరరామయ్య దృష్టికి పలువురు తీసుకెళ్లగా చప్టాపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని గ్రామకార్యదర్శికి సూచించారు. ఈ మేరకు సర్పంచ్ చార్లెస్ సర్జన్, పంచాయతీకార్యదర్శి రమణారెడ్డి ఆధ్వర్యంలో పూడికను తీయించి వానల సమయంలో కూడా రాకపోకలు సాఫీగా సాగేలా చేశారు.

అమృత సరోవర్ పనులను వేగంగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

దర్శి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అమృత పథకం కింద చేపట్టే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక డ్వామా కార్యాలయంలో బుధవారం అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత సరోవర్ పథకం కింద అన్నీ ప్రాంతాల్లో పశువుల కొష్టాల నిర్మాణాలను ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఫారం ఫాండ్స్ నిర్మాణాలు వేగవంతం చేయాలని చెప్పారు. నిర్లక్ష్యంగా ఉన్న వారిని ఉపేక్షించబోమన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ లలితకుమారీ, స్థానిక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థాన భూముల్లో ఆక్రమణలను తొలగిస్తాం



భూములను పరిశీలిస్తున్న ఎండోమెంట్ అధికారులు

పామూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పామూరులోని సర్వే నెంబర్ 329/2, 442/1, 2, 3లో మదనవేణుగోపాల, వల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు సంబంధించిన భూముల ఆక్రమణలను ఎండోమెంట్ శాఖ సహాయ కమిషనర్ ఎం పానకాలరావు బుధవారం పరిశీలించారు. త్వరలో ఆక్రమణలు తొలగించి భూములను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఈవో నరసింహబాబుకు సూచించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం, అనుమాలశెట్టిసత్రం ఆస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ పాలకమండలి మాజీ సభ్యులు గుర్రం వెంకటేశ్వర్లు, సిద్దవటం నరసింహులు, బీ నారాయణ పాల్గొన్నారు.

నీటిసంఘం ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

పీసీపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదయిర్లపాడు నీటి వినియోగదారుల సంఘం ఎన్నిక కోసం ఎంపీడీవో బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. 14వ తేదీన ఉదయం 8గంటలకు స్థానిక జడ్పీఉన్నతపాఠశాలలో ఎన్నిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

ముండ్లమూరులో...



నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్

ముండ్లమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 17 సాగునీటి వినియోగ సంఘాలకు రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్‌లకు ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్ పూరిమెట్ల సచివాలయంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ పీఎస్‌ఆర్ మూర్తి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 12 డిసెంబరు 2024




చిలకలూరిపేట మేజర్ కాలువ

- సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం
- 14న నీటి సంఘాలకు.. 17న డీసీలకు ఓటింగ్
- ఏర్పాట్లలో అధికారులు.. నాయకుల సమాయత్తం

ఎట్టకేలకు ఎన్నికలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో ఊసెత్తని.. కూటమి ప్రభుత్వ హయాంలో రెండు సార్లు వాయిదా పడిన.. సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. గ్రామాల్లో ఒక వైపు రైతులు వరి కోతల హడావుడిలో ఉండగా మరోవైపు ఎన్నికల సమరానికి తెరలేచింది. దీంతో పల్లెల్లో నీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. ఈ నెల 14న నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ)కు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల(డీసీ)కు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు జలవనరుల, రెవెన్యూ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారులను నియమించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక నీటి సంఘాలను గుర్తించారు. వీటి ఎన్నికలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను అధికారులు ఇప్పటికే కోరారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వాయిదాల అనంతరం ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలతో రాజకీయ పార్టీలకు చెందిన గ్రామ నాయకులు ఎన్నికలపై దృష్టి సారించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బందికి శిక్షణను పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని కూడా సిద్ధం చేశారు. ఎన్నికలను అధికార పార్టీ ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించింది. సేవా భావం కలిగిన వారిని నీటి సంఘాలకు ఎన్నుకోవాలని ఇప్పటికే కూటమి నేతలు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలపై వైసీపీ దృష్టి సారించిన దాఖలాలు లేవు.

సాగర్ పరిధిలో 274 నీటి సంఘాలు

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో 274 సాగు నీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 12 టీసీల చొప్పున మొత్తం 2,628 టీసీలు ఉన్నాయి. టీసీల వారీగా ఓటర్ల జాబితాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. టీసీలకు 14న ఎన్నికలు జరగనుండగా అదే రోజున సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రాజెక్టు కమిటీ ఎన్నికల తేదీని ప్రకటించాల్సి ఉంది. కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1, 2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.



- గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు
- గమ్యస్థానం చేరే సమయంపై అయోమయం
- రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు పదరానిపాట్లు
- ఇష్టారాజ్యంగా రైళ్ల రద్దు.. అరకొర రైళ్లపై తీవ్ర ఒత్తిడి

రైలు ప్రయాణం నరకం



గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు వస్తాయో తెలియదు.. ఎప్పుడు బయల్దేరతాయో అర్థం కాదు.. ఇదీ ప్రస్తుతం రైళ్ల పరిస్థితి. గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు.. ఆ రైళ్లలో ఎక్కి ఎప్పటికి గమ్యస్థానానికి చేరుతామో తెలియదు.. ఇదీ ప్రయాణికుల కష్టాలు. ఇష్టం వచ్చినట్లు రైళ్లను రద్దు చేస్తున్నారు.. అయినా రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం. ఒకప్పుడు సమయానికి వచ్చి సమయానికి గమ్యస్థానాలకు చేర్చుతూ ప్రయాణికుల ఆదరణను పలు రైళ్లు పొందాయి. అయితే గత కొంతకాలంగా రైళ్ల రాక.. పోక అనేది ఎవరికీ తెలియడంలేదు. రైల్వే అధికారులు కూడా రైళ్ల రాకపోకల గురించి చెప్పలేకపోతున్నారు. తాను ఎక్కబోయే రైలు జీవితకాలం లేటు అన్న నానుడిని నిజం చేసేలా ప్రస్తుతం రైలు ప్రయాణం మారింది. రైలులో ప్రయాణం అంటే కోరుకుని నరకానికి ప్రయాణం కట్టినట్లే అన్నట్లుగా మారింది పరిస్థితి. సీజన్‌పై రోజువారీ ప్రయాణాలు చేసే ఉద్యోగులు, విద్యార్థుల పరిస్థితి గురించి చెప్పాలంటే అది నిత్య నరకమే. గుంటూరు నుంచి పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ, బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె రూట్లలో నడిచే రైళ్లు, పక్క జిల్లాల్లోని విజయవాడ, నరసాపురం రూట్లలో నడిచే రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి.

పదుల కిలోమీటర్లు.. గంటల ప్రయాణం

గుంటూరు నుంచి విజయవాడ మధ్య దూరం 30 కి.మీ. కాగా అందుకోసం 2 నుంచి 3 గంటల సమయం పడుతున్నది. 120 కి.మీ దూరం ఉన్న గుంటూరు- మాచర్ల మధ్య ప్రయాణం 4 నుంచి 6 గంటల సమయం పడుతోంది. సాయంత్రం 7.35కు గుంటూరు చేరుకోవాల్సిన మాచర్ల రైలు ఈ వారంలో రెండు రోజులు రాత్రి 10:30 వరకూ గుంటూరుకు రాలేదు. ఒకటి రెండు రోజులు మినహా మిగిలిన అన్ని రోజులూ ఆ రైలు ఆలస్యంగా వస్తోంది. దీంతో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. హుబ్లీ రైలు ఈ నెల 6న రాక, పోకలు రెండూ ఐదు గంటలు ఆలస్యంగా సాగాయి. గుంటూరు- విజయవాడల మధ్య తిరిగే ఇంటర్‌సిటీ మెమూ రైళ్లు రెండు మూడు గంటల సగటు జాప్యంతో తిరుగుతున్నాయి. గడిచిన నాలుగు రోజులుగా 30 కి.మీ ప్రయాణానికి ఈ రైళ్లు 4 గంటల సమయం తీసుకుంటున్నాయి. ఉదయం 11.30కి గుంటూరులో బయలుదేరి

(మిగతా 6వ పేజీలో)

- నాడు-నేడు పేరు మార్పుతో సరి
- పాఠశాలల్లో పునః ప్రారంభంకాని పనులు
- పాడైపోతున్న నిర్మాణ సామగ్రి.. ప్రజాధనం వృథా
- అటకెక్కిన అభివృద్ధి పనులపై దృష్టి సారించని పాలకులు
- నిధులు విడుదల కాక గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా పనులు


గుంటూరు కేవీపీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

ఆరునెలలైనా.. అసంపూర్తిగానే

ప్రభుత్వ పాఠశాలలను నాడు- నేడు పేరుతో తీర్చిదిద్దుతున్నామన్నారు.. కార్పొరేట్ పాఠశాలకంటే మిన్నగా మారుస్తామన్నారు.. తొమ్మిది రకాలు పనులు చేపట్టారు.. వందల్లో పాఠశాలలను ఎంపిక చేసి రూ.కోట్లలో నిధులు మంజూరు చేశారు.. ఉన్న భవనాలను పడగొట్టారు.. అయితే నిధులు విడుదల చేయకుండా పాఠశాలలను గత పాలకులు పాడుబెట్టారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల దుస్థితిని చూసి, వాటిని సరిదిద్దేందుకు సంకల్పించింది. తొలుత నాడు-నేడు పేరును మనబడి మన భవిష్యత్తుగా మార్చింది. దీంతో అటకెక్కిన పనులు ప్రారంభమవుతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా భావించారు. కానీ ఆరు నెలలుగా అసంపూర్తిగానే పనులు ఉన్నాయి.

గుంటూరు(విద్య), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత ప్రభుత్వం నాడు నేడు పథకం పేరుతో ప్రారంభించి వదిలేసిన పనులు ఇప్పటికీ అనేక చోట్లు అలాగే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం పథకం పేరును మార్చడంతో సరిపెట్టిందే కానీ పనుల పునః ప్రారంభంపై దృష్టి సారించలేదు. పనులపై రాష్ట్రస్థాయిలో సమీక్ష నిర్వహించక పోవడంతో జిల్లా స్థాయిలో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయని తెలుస్తోంది. ఫలితంగా నిర్మాణ సామగ్రి అనేక చోట్లు పాడైపోతోంది. కొన్ని చోట్ల దొంగల పాలౌతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పెండింగ్‌లోనే అభివృద్ధి పనులు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో చేపట్టిన పనులు ప్రభుత్వం మారినా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, తాగునీటి కోసం వాటర్ ప్లాంట్స్, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబులు, కిచెన్‌షెడ్లు, సైన్స్ ల్యాబుల నిర్మాణం, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్ సౌకర్యం, రంగులు వేయడం తదితర తొమ్మిది రకాల పనుల్ని చేపట్టగా ఆయా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. గత ప్రభుత్వం నాడు నేడు పథకంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 వేలకుపైగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు జడ్పీ పాఠశాలల్ని ఎంపిక చేసి దాదాపు రూ.వెయ్యి కోట్లకుపైగా బడ్జెట్ కేటాయింపులు చేసింది. కానీ నిధుల విడుదల మాత్రం 40 శాతం కూడా చేయలేదు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటికీ 45 శాతంపై పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. వందల సంఖ్యలో భవన నిర్మాణ పనులు ఇంకా వివిధ దశల్లోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పునాదుల స్థాయిలో మరికొన్ని చోట్ల శ్లాబ్ పూర్తి అయినా పార్టీషన్, ప్లాస్టింగ్, విద్యుత్, ప్లంబింగ్ పనులు పూర్తికాలేదు. నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడైపోతోంది. ఇసుక, కంకర, డస్ట్ ఇప్పటికే అనేక పాఠశాలల్లో మట్టిలో కలిసిపోయింది. సిమెంట్‌కు రక్షణ లేకపోవడంతో గడ్డకట్టి ఉపయోగించడానికి వీలులేకుండా మారింది. శానిటరీ, ప్లంబింగ్, విద్యుత్ పరికరాలు తరగతి గదుల్లో పేరుకుని పోయి ఉన్నాయి. కొన్ని ఇప్పటికే ధ్వంసం కాగా, మరికొన్ని దొంగలపాలైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అనేక పాఠశాలల్లో తాగునీటి పథకాల ఏర్పాటు చేసినా వినియోగంలోకి రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అసంపూర్తి పనులపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


గుంటూరులోని ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో గడ్డకట్టి పాడైపోయిన సిమెంట్ బస్తాలు

బియ్యం లోడు లారీ దగ్ధం

ఆర్మీ కంటెయినర్‌ను ఢీ.. వ్యాపించిన మంటలు

పేలుడు పదార్థాల వాహనాలకు తప్పిన ప్రమాదం



పేలుడు పదార్థాలతో ఉన్న కంటెయినర్ లారీని ఢీకొన్న బియ్యం లారీ

మేదరమెట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి ఆర్మీకి సంబంధించిన మందుగుండుతో చెన్నైకి వెళ్తున్న కంటెయినర్ లారీని అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో బొడ్డువానిపాలెం వద్ద బియ్యం లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. బొడ్డువానిపాలెం వద్ద 18 కంటెయినర్ లారీలు ఒకదాని తరువాత ఒకటి పెట్రోల్ బంక్ వద్ద డీజిల్ నింపుకుంటున్న సమయంలో బుధవారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. బల్లికురవ మండలం రామాంజనేయపురం నుంచి బియ్యం లోడుతో చెన్నైకి వెళ్తున్న లారీ ముందున్న లారీని వేగంగా దాటే క్రమంలో ఆగి ఉన్న ఆర్మీ కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో లారీ క్యాబిన్ మొత్తం నుజ్జునుజ్జయి మంటలు చెలరేగాయి. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ బాలకృష్ణన్‌ను స్థానికులు, పోలీసులు కాపాడారు. అయితే బియ్యం లోడుతో ఉన్న లారీకి మంటలు వ్యాపించడంతో ఆర్మీకి చెందిన అధికారులు అప్రమత్తమై ఆ ప్రాంతాన్ని తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అద్దంకి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. పేలుడు పదార్థాలతో ఉన్న వాహనాలకు 100 మీటర్లు వరకు ఎవరూ లేకుండా ఖాళీ చేయించాలని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఆర్మీ అధికారులు సూచించారు. ఈలోపు మంటలను ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఒక వేళ మంటలు వ్యాపించి ఉంటే సమీపంలో ఉన్న మూడు కంటైనర్లలో ప్రమాదం జరిగి ఉండేదని అందరూ భయపడ్డారు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ గాయపడిన బాలకృష్ణన్‌ను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మంటలతో కాలిపోయిన బియ్యం లారీ

కలెక్టర్లకు దిశానిర్దేశం

- పలు అంశాలపై సమీక్ష.. ఫలితాలపై చర్చ
- వ్యవసాయ, అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి
- తొలిరోజు సదస్సులో కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచన
- ఆర్టీజీఎస్‌లో ప్రథమ స్థానం.. గుంటూరు కలెక్టర్‌కు అభినందనలు


సదస్సుకు హాజరైన బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల - ఆంధ్రజ్యోతి): మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తే ఫలితాలు బాగుంటాయి.. ఆయా రంగాల పురోగతిపై దృష్టి పెట్టాలి.. అని కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టర్ల రెండో సదస్సు బుధవారం రాజధాని అమరావతి సచివాలయంలో ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సుకు గుంటూరు, పల్నాడు, బాపట్ల కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు, వెంకటమురళిలు హాజరయ్యారు. ఈ క్రమంలో తొలి రోజు సదస్సులో మూడు జిల్లాలకు సంబంధించిన వివిధ అంశాలు, విభాగాల వారీగా ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ ఆరు నెలల వ్యవధిలో సాధించిన ఫలితాలపైన, జిల్లా గణాంకాలను సదస్సులో ప్రస్తావించి వాటిపై సమగ్రంగా చర్చించారు.

ధాన్యం సేకరణపై దృష్టి సారించాలి

ధాన్యం సేకరణ పైనా దృష్టి పెట్టాలని సీఎం బాపట్ల కలెక్టర్‌కు సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో 28 శాతం మందికే నగదు జమ అవుతున్నట్లు, రవాణా, గోనె సంచుల విషయంలో 25 శాతం మంది సమస్యలున్నాయని సర్వేలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. గ్రీవియన్స్ విషయంలో ఎక్కువగా వచ్చే వాటిల్లో బాపట్ల జిల్లా రెండో స్థానంలో ఉన్నది. జూన్ మొదలుకుని చూస్తే దాదాపుగా 700లకు ఫిర్యాదులు వచ్చాయి. 34.38 శాతం మంది ఫిర్యాదుల పరిష్కారం తీరుపై అసంతృప్తితో ఉన్నారు. వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి ప్రజల సంతృప్తి శాతం 100కు పెరగాలని సీఎం చెప్పారు. ఆయిల్ పామ్ విషయంలో 4 శాతం మాత్రమే వృద్ధి సాధించి అట్టడుగున ఉన్నందున, ఈ అంశంలోనూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ లక్ష్యం 2,450 కాగా కేవలం 360 మందికి మాత్రమే ఇచ్చారన్నారు. ఎన్‌పీసీఐకి బ్యాంకు ఖాతా లింకు విషయంలో జిల్లా వ్యాప్తంగా 4,376 ఖాతాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటి విషయంలో పురోగతి చూపించేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. గృహాల విషయంలో 14,988 ప్రోగ్రెస్ దశలో ఉన్నాయని వాటిపూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. 28,013 మంది చిన్నారులకు ఆధార్ నమోదు విషయంలో పెండింగ్‌లో ఉందని ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించాలని ఆదేశించారు. 477 సచివాలయాల్లోని 1077 మంది వరకు హాజరు విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. గత వర్షాల సమయంలో కరకట్ట ప్రమాదకరంగా మారిందని కలెక్టర్ సదస్సులో తెలపగా కరకట్ట మరమ్మతులకు సీఎం సానుకూలంగా స్పందించారు. క్లస్టర్ల వ్యవస్థ లేకపోవడంతో కాల్వల పరిస్థితి అధ్వానంగా మారిందని చెప్పగా అవుట్‌సోర్సింగ్‌లో నియామకాలకు సీఎం అనుమతించినట్లు కలెక్టర్ తెలిపారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

మేదరమెట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బాపట్ల జిల్లా వైద్య అధికారి విజయమ్మ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని చిట్టిబాబు, సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రిలో ఓపీ రిజిస్టర్‌ను పిశీలించారు. మందుల లభ్యత గురించి కనుక్కున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదగా మాట్లాడి సమస్యలు తెలుసుకుని మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం పాత బిల్డింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆమంచి సాయం

వేటపాలెం, చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పొట్టి సుబ్బయ్యపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న విల్లాల వద్ద నిర్మాణ సామగ్రి రోడ్డుపై అడ్డుగా ఉండడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. అందులో ఓ యువకుడు మృతి చెందగా, మరో యుకకునికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కల్యాణ్ కుటుంబానికి రూ.2లక్షలు, గాయపడిన మనోజ్ కుటుంబానికి రూ.50వేలు అందజేశారు. భవిష్యత్‌లో కూడా వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

వెంకయ్య ఆశ్రమంలో దుప్పట్ల పంపిణీ

మార్టూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వెంకయ్య ఆశ్రమంలో బుధవారం కావలి వన్‌టౌన్ సీఐ ఎండీ ఫిరోజ్ యువకులు పేదలకు దుప్పట్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గడ్డం మస్తానవలి, షేక్ రషీద్, కాలేషా, అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి

అగ్రహారం రైతుల విజ్ఞప్తి

సంతమాగులూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అగ్రహారం రైతుల భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత రైతు సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మొహిద్దీన్ బాషా, టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి మోతాదు బాషా స్పెషల్ అధికారి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మలపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు సర్పంచ్ మోతాదు మహబూబ్బాబు జాని అధ్యక్షతన బుధవారం జరిగింది. తహసీల్దార్ రవిబాబు, స్పెషల్ అధికారి రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు అగ్రహారం ఈ నామ్ భూముల సమస్య తరాలుగా ఉందన్నారు. ఆ భూములకు హక్కు కల్పించి బ్యాంకుల ద్వారా రుణాలు పొందే విధంగా పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి వీఆర్వో కోటమ్మ, టీడీపీ నాయకులు దర్యావలి, కొమరవెల్లి లాల్బుడే, రైతులు పాల్గొన్నారు.

13న పర్చూరులో జాబ్ మేళా

పర్చూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 13న పర్చూరులోని భవనం అంజిరెడ్డి తులాబంధుల అర్జునయ్య జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సీడప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ బుధవారం ప్రకటలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో యాక్సిస్ బ్యాంక్, యస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, జిప్సం ప్రవేట్ లిమిటెడ్, హెటిరో లాబ్స్, ఫ్లేక్స్ టెక్ సాల్యూషన్స్ వంటి కంపెనీలు హాజరుఅవుతారన్నారు. ఆయా కంపెనీలకు సంబంధించి 100కు పైగా ఖాళీలు ఉన్నాయని, విద్యార్హతను బట్టి వేతనం రూ.12వేల నుంచి రూ.20వేల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాని కోరారు. వివరాలకు 6302764962 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సెరీ కల్చర్ సాగుతో లాభదాయకం

సంతమాగులూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు సెరీ కల్చర్ సాగు లాభదాయకమని ఉమ్మడి జిల్లా సెరీ కల్చర్ అధికారి పి.సుజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని కొమ్మలపాడు రైతు సేవా కేంద్రంలో మల్బరీ సాగు విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా సెరీ కల్చర్ అధికారి పి. సుజయ్ కుమార్ మాట్లాడుతూ మల్బరీ సాగుతో ఎకరానికి ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పారు. మల్బరీ సాగుపై మక్కువ చూపాలని, పట్టు పురుగుల పెంపకంలో షెడ్ నిర్మాణం, మల్బరీ తోటల పెంపకంపై అవగాహన, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు గురించి ఆయన రైతులకు తెలిపారు. కొమ్మాలపాడులో దాదాపు ముప్పై ఎకరాలకు పైగా సెరీ కల్చర్ సాగవుతుందని అన్నారు. మల్బరీ సాగు ఎలా చేయాలో సైంటిస్ట్ ఇబ్రహీం బాషా ఛాయా చిత్రం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో శివ నాగిరెడ్డి, వీఏస్ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయులు మృతికి నివాళి

అద్దంకిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపాలిటీలో పర్మినెంట్ కార్మికుడుగా పని చేస్తున్న బోజంకు ఆంజనేయులు (60) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆంజనేయులు మృతదేహాన్ని బుధవారం అద్దంకి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఇతర సంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, గాలి బీషా, యర్రమోతు సుబ్బారావు, చింతా ప్రసన్న , జ్యోతి వెంకట్రావు ఉన్నారు.

సింహ గర్జన సభను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో ఈ నెల 15వ తేదీన జరిగే హలో మాల చలో గుంటూరు మాలల సింహగర్జన సభకు తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేద్కర్ భవనం వద్ద సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాజశేఖర్, శ్రీనివాసరావు, పూర్ణ, నారాయణరావు, రోశయ్య, శ్రీకృష్ణ, హనుమంతరావు పాల్గొన్నారు.

మోటార్ సైకిలిస్టును ఢీకొన్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్‌ను ఎక్స్‌కవేటర్ ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న రాజారావుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మార్టూరు మండలం చిమ్మిరిబండకు చెందిన రాజారావు బుధవారం మధ్యాహ్నం చిమ్మిరిబండ నుంచి ముండ్లమూరు మండలం మారెళ్లకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా, అద్దంకి పట్టణానికి సమీపంలోని కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల మలుపు వద్ద ఎక్స్‌కవేటర్ ఢీకొట్టింది. గాయపడిన రాజారావును 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.

ప్రమాదవశాత్తు సొనలో పడి వ్యక్తి మృతి

వేటపాలెం, చీరాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు సొనలో పడి ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ రామానగర్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మద్దకం రమేష్(38) చేనేత పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు సొన నీటిలో పడి మృతి చెందారు. అతనికి భార్య, ఇద్దర పిల్లలు. ఈ మేరకు రమేష్ భార్య ఈశ్వరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరమ్మతుల మాయ!

- అక్కడి మట్టితోనే తూతూ మంత్రంగా పనులు
- గంగవరం అర్‌అండ్‌బీ రహదారిలో కాంట్రాక్టర్ చేతివాటం



పక్కకాల్వలోని నల్ల మట్టితో నింపిన రోడ్డు

నల్లమట్టితో తూతూమంత్రంగా జరుగుతన్న మరమ్మతు పనులు

ఇంకొల్లు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో రహదారులు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రోడ్లను బాగు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ముందుగా పెద్ద ఎత్తున రోడ్ల మరమ్మతులకు పూనుకుంది. అయితే మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ల చేతివాటం కన్పిస్తోంది. పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. పేరుకు మరమ్మతు పనులు చేసినా అవి తూతూమంత్రంగా జరగడంతో కొద్ది రోజులకే తిరిగి ఆ రోడ్డు యథాస్థితికి చేరుకుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకొల్లు నుంచి ముప్పవరం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఆరికట్లవారిపాలెం దగ్గర నుంచి ఇంకొల్లు వరకు రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. గంగవరం సమీపంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై పెద్దఎత్తున రోడ్డు మార్జిన్ దెబ్బతిన్నది. దీనిని పటిష్టం చేసేందుకు గ్రావెల్ మట్టి వాడాల్సి ఉండగా కాంట్రాక్టరు అక్కడ కాల్వలో ఉన్న నల్ల మట్టితోనే చదును చేసి చేతులు దులుపుకున్నారు. ఇక్కడ జరిగే పనులు నాసిరకంగా ఉండడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుందని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

జగన్ సమావేశానికి ఇద్దరు డుమ్మా

- పర్చూరు వైసీపీ ఇన్‌చార్జికి ఉద్వాసన తప్పదా!
- ఆయన స్థానంలో మధుసూదనరెడ్డికి అవకాశం?

చీరాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్‌రెడ్డి బుధవారం తన నివాసంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన తమ పార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి దిశానిర్దేశం చేయడమే సమావేశ ముఖ్య ఉద్దేశం. అయితే అందులో ఉమ్మడి ప్రకాశంలో భాగంగా, బాపట్ల జిల్లాకు సంబంధించి అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు డుమ్మా కొట్టారు. ఆక్రమంలో పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జికి ఉద్వాసన తప్పదనే భావనను వ్యక్తపరిచినట్లు సమాచారం. ఈ క్రమంలో గాదె మధుసూదనరెడ్డిని నియమించే అవకాశం ఉందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, దాన్ని మనం అందిపుచ్చుకోవాలని చెప్పడమే ప్రధానంగా జగన్ ప్రస్తావించారు. సమావేశానికి చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హాజరుకాగా, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలకు చెందిన పాణెం హనిమిరెడ్డి, యడం, బాలాజీ సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జగన్ పర్చూరు నియోజకవర్గ విషయమై మాట్లాడుతూ అతనెక్కడో ఉంటూ, ఇక్కడేం చేస్తాడంటూ యడం బాలాజీ తీరును ప్రస్తావించినట్లు తెలిసింది. అందుకు సంబంధించి పర్చూరు మండలానికి చెందిన ముఖ్య నాయకుడు, బాలాజీకి అనుంగ అనుచరునిగా గత ఎన్నికల్లో కొనసాగిన నేత బాలాజీకి మద్దతుగా నాలుగు రోజుల్లో బాలాజీ వస్తారని చెప్పినట్లు తెలిసింది. అయితే అక్కడ నాలుగు రోజులు, ఇక్కడ నాలుగు రోజుల అంటే ఎలా? జనాలతో ఉండాలని చెప్పినట్లు తెలిసింది. ఆ క్రమంలో వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా గాదె మధుసూదనరెడ్డి పేరు ఖరారు చేసే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు ఆ పార్టీ శ్రేణుల్లో చర్చించుకుంటున్నారు. వాస్తవానికి గతంలోనే మధుసూదనరెడ్డిని నియమించాల్సి ఉంది. అయితే సామాజికవర్గాల కూర్పులో అద్దంకి, పర్చూరు ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారవుతారనే కోణంలో ఆలోచించి జగన్ అప్పట్లో వెనకడుగు వేశారు. ఈ క్రమంలో పర్చూరు అంశంపై ప్రస్తావన జరిగే సమయంలో మార్టూరు మండలంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఓ ముఖ్యనాయకుడు మాట్లాడుతూ సామాజిక వర్గాల సమతూకంలో నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని, అందుకు పొరుగు నియోజకవర్గ ఇన్‌చార్జి పేరును సూచించినట్లు సమాచారం. మొత్తమ్మీద గైర్హాజరు అయిన ఇన్‌చార్జిలకు ప్రతినిధులుగా వారి తరఫువారు హాజరైమమ అనిపించారని, కొందరు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు కూడా సమావేశానికి డుమ్మా కొట్టినట్లు సమాచారం.

కుంభాభిషేక విశిష్టతను తెలుసుకోవాలి

సనాతన ధర్మోపన్యాసకులు చాగంటి



ప్రవచనం చేస్తున్న చాగంటి

వేటపాలెం/చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కుంభాభిషేక విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనే పరమార్థాన్ని తెలుసుకోవాలి.. అప్పుడే మానసిక వికాసంతో ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందని సనాతన ధర్మోపన్యాసకులు, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఉద్ఘాటించారు. మండల పరిధిలోని దేశాయిపేట నీలకంఠపురంలోని శ్రీ గంగా పీయూషాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి క్షేత్రంలో మహాకుంభాభిషేక మహోత్సవంలో భాగంగా బ్రహ్మశ్రీ చాగంటి హాజరై భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలను వినిపించారు. మృధు, శాంత, గంభీర స్వరంతో ఆయన గొంతుక నుంచి జాలువారిన ప్రవచనాలు ఆధ్మాత్మిక గుబాళింపులు పరిసర ప్రాంతాలను కమ్మేశాయి. ప్రతి ఒక్కరూ శివ నామస్మరణలో ఓలలాడారు. కుంభాభిషేకం విశిష్టతను వివరిస్తూ, శివతత్వాన్ని ఆయన బోధించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

శ్రీ హనుమత్ వైభవం

చీరాల ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో శ్రీ హనుమత్ వైభవం పేరుతో చేపట్టిన కార్యక్రమానికి సనాతన ధర్మోపన్యాసకు లు చాగంటి కోటేశ్వరరా ప్రచనాల కార్యక్రమం రెండో రోజు బుధవారం కొనసాగింది. హనుమంతుని ఉపాసనతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు.

రామాయణంలో హనుమంతుని పాత్రను సవివరంగా చెప్పారు. అప్పటి దృశ్యాలు కళ్ల ముందు మెదులుతున్నాయా అన్న రీతిలో చాగంటి ప్రవచనాలు సాగాయి.

రైలు ప్రయాణం.. నరకం

(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్నం 3, 4 గంటలకు విజయవాడ చేరుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు. సికింద్రాబాద్- గుంటూరు ఇంటర్‌సిటీ కూడా ఈ వారంలో రెండురోజులు గంటన్నర ఆలస్యంగా నడిచింది. సూపర్‌ఫాస్ట్ రైళ్లు కూడా ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. నరసాపురం నుంచి వచ్చే రైళ్లు, కాకినాడ నుంచి ముంబై వెళ్లే లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ కూడా గుంటూరుకు గంటకుపైగా ఆలస్యంగా వస్తున్నాయి. విజయవాడ నుంచి జిల్లాలోని తెనాలి, నిడుబ్రోలు, బాపట్లను కలుపుతూ చీరాల, ఒంగోలు మీదగా వెళ్లే రైళ్లు చాలా ఆలస్యంగా వెళుతున్నాయి. వంద కి.మీ దూరం ఉన్న చీరాల- విజయవాడ ప్రయాణం సగటున 4 నుంచి 7 గంటల వరకూ సమయం పడుతోంది. ఈ రూటులో ఇప్పటికే అనేక పాసింజర్ రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఉన్న రైళ్లను కూడా ఆలస్యంగా నడుపుతోంది. ఈ రూటులో నడిచే పాసింజర్ రైళ్లు ప్రతి రోజూ సగటున గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. క్రిష్ణా ఎక్స్‌ప్రెస్ కూడా గంటకు తక్కువ కాకుండా ఆలస్యంగా నడుస్తున్నది. విజయవాడ- గూడూరు పాసింజర్ పరిస్థితి అసలు చెప్పడానికే వీలు లేదు. ఈ రైలు విజయవాడకు చేరే వరకూ నమ్మకం లేని పరిస్థితి.

నాడు రైళ్లు రద్దు.. నేడు ఆలస్యం

2020లో కరోనా వంకతో జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ పేరు చెప్పి రైల్వే శాఖ దేశవ్యాప్తంగా రైళ్లను అర్థాంతరంగా రద్దు చేసింది. ఆ తర్వాత రెండు నెలలకు రైళ్లను పునరుద్ధరిస్తున్నామని చెప్పినా సాధారణ ప్రయాణికులు ప్రయాణించే పాసింజర్ రైళ్లను మాత్రం పునరుద్ధరించలేదు. కేవలం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మాత్రమే నడిపింది. ప్రయాణికుల నుంచి ఒత్తిడి పెరగడంతో 'స్పెషల్ రైళ్ల' పేరుతో పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ చార్జీలతో తిరిగి తీసుకువచ్చింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టికెట్ ధరలు తగ్గించినా రైళ్లను మాత్రం 'స్పెషల్' రైళ్లుగానే నడుపుతోంది. రద్దయిన రైళ్లను మాత్రం తిరిగి పునరుద్ధరించలేదు. పైపెచ్చు అనేక గ్రామాల్లో స్టాపులను కూడా తొలగించేశారు. కాగా 2024 ఏడాది మొత్తం అభివృద్ధి పనుల పేరుతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తిరిగే స్పెషల్ రైళ్లను, సింహాద్రి, గోల్కొండ వంటి సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రైల్వే శాఖ నెలల తరబడి రద్దు చేసింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రత్యేకించి సీజన్ ప్రయాణికులైన ఉద్యోగులు, గుంటూరు, విజయవాడల్లో పనులకోసం వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నగిషీలకు ప్రాధాన్యం

రెండు మూడేళ్లుగా రైల్వే శాఖ రైల్వే స్టేషన్ల ఆధునీకీకరణపై దృష్టి సారించింది. వందల కోట్లు ఖర్చు చేసి రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా తీర్చిదిద్దుతోంది. అందమైన చిత్రమాలికలు, విగ్రహాలు, నగిషీలతో చక్కగా తీర్చిదిద్దుతోంది. కానీ రైళ్ల గురించి పట్టించుకోవడంలేదు. రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణపై దృష్టి సారించడంలేదు. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా రైళ్లను ఏర్పాటు చేయడంలేదు. వందలకోట్లు ఖర్చు చేసి స్టేషన్లను అభివృద్ధి చేసే బదులు రైళ్లను పునరుద్ధరించి, ప్రయాణ నాణ్యతను పెంచవచ్చు కదా అంటూ ప్రయాణికులు వాపోతున్నారు.

పొమ్మనకుండానే పొగ

రైల్వే శాఖకు సరుకు రవాణా రైళ్లే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. ప్రయాణికుల రైళ్ల కంటే గూడ్స్ రైళ్లపై వచ్చే ఆదాయం ఎక్కువ కావడంతో పాసింజర్ రైళ్లు తగ్గించాలని గతం నుంచి ప్రభుత్వాలు భావిస్తూ వస్తున్నాయి. అయితే రైల్వే అనేది సేవా దృక్పథంతో ఏర్పాటు చేసింది కాబట్టి గత ప్రభుత్వాలు అంత ధైర్యం చేయలేకపోయాయి. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో భిన్నంగా వ్యవహరిస్తోంది. రైళ్లను రద్దు చేయడం, ప్రయాణంలో అంతరాయాలు కల్పించడం ద్వారా ప్రయాణికులే దూరమయ్యేలా చేస్తోందని పలువురు విమర్శలు చేస్తున్నారు. రైల్వే శాఖ తీరు కూడా గత కొంతకాలంగా అలానే ఉంటోంది. ఇప్పటికైనా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రైళ్లను పునరుద్ధరించి, సకాలంలో నడిపి సగటు ప్రయాణికుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

నీటిసంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

342 డబ్ల్యుయూఏలకు ఇచ్చిన అధికారులు

ఒంగోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు సార్లు వాయిదాపడిన ఆ ఎన్నికల షెడ్యూల్ నాల్గవసారి ముడిపడింది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. ఆయా నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమితులైన ఎన్నికల అధికారులు వాటిని సంబంధిత ప్రాంతాల్లో ప్రకటించారు. జిల్లాలో మొత్తం 342 డబ్ల్యూయూఏలు ఉండగా వాటి పరిధిలో సుమారు 2.10 లక్షల మంది ఆయకట్టుదారులు సభ్యులుగా ఉన్నారు. ఒక్కొక్క డబ్ల్యూయూఏకు ఒక ఎన్నికల అధికారి, మరొక అసిస్టెంట్ ఎన్నికల అధికారిని నియమించి ఎన్నిక నిర్వహించే ప్రాంగణాలను గతంలోనే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎంపిక చేశారు. ఎన్నికల అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఎన్నికల అధికారులుగా గెజిటెడ్ హోదా కలిగిన మండల స్థాయి అధికారులను నియమించగా వారంతా తమ పరిధిలోని నీటిసంఘాల ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చారు. డబ్ల్యూయూఏల ఎన్నికలు 14వతేదీన జరగనున్నాయి. మైనర్ ఇరిగేషన్‌లో ఆరు, మీడియం, మేజర్ విభాగంలో 12 ప్రాదేశికా(టీసీ)లు ఉండగా రైతుల నుంచి టీసీ సభ్యులను తొలుత ఎన్నుకుంటారు.



నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ఎంపీడీవో శింగయ్య

78 నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

అద్దంకి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి డివిజన్ పరిధిలో 78 నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నోడల్ ఆఫీసర్, ఎన్నెస్పీ ఈఈ నాగమురళీమోహన్ తెలిపారు. అద్దంకి, సంతమాగులూరు, కొనంకి ఎన్నెస్పీ సబ్ డివిజన్ పరిధిలో 57 మేజర్ నీటి వినియోగదారుల సంఘాలు, పల్నాడు జిల్లా లింగంగుంట్ల డివిజన్ పరిధిలోని కారుమంచి, గోగనకొండ, ప్రకాశం జిల్లా పరిధిలోని దర్శి డివిజన్ పరిధిలో ఉన్న మూడు మేజర్ నీటి వినియోగదారుల సంఘాలు, 16 మైనర్ నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ స్టేషన్‌ల వద్ద ఓటర్ల వివరాలతో ఆయా సంఘాల అధికారులు నోటిఫికేషన్ ప్రకటించినట్లు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



సంతమాగులూరులో మాట్లాడుతున్న జీసీడీవో చారులత

పర్చూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టి బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీడీపీవో సుభద్ర కోరారు. బుధవారం కార్యాలయంలో జరిగిన కిషోర వికాసం బాలికల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల లోపు కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నారు. బాలికలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ కిశోర్ వికాశ కమిటీలు గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇవో వెంకట్రామయ్య, ఏపీఎం రామకృష్ణ, రావి వరలక్ష్మి పాల్గొన్నారు.

సంతమాగులూరు : బాలికల విద్యను ప్రోత్సహించడం ద్వారా బాల్య వివాహాలను నిర్మూలన చేయవచ్చని జిల్లా జీసీడీవో ఎం.చారులత తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర వికాశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సుధారాణి, వైద్యులు నిర్మల్ కుమార్, ఎంఈవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చీరాలలో కనకదుర్గ గోల్డ్ లోన్స్ ప్రారంభం



కనకదుర్గ గోల్డ్ లోన్స్ శాఖను ప్రారంభిస్తున్న జీఎం తదితరులు

బాపట్ల : ఫైనాన్స్ రంగంలో గత 41 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్, కనకదుర్గ గోల్డ్ లోన్స్, తమ సంస్థ నూతన శాఖను బాపట్ల జిల్లా, చిరాలలో ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా, దర్బార్ రోడ్డులో బుధవారం ఉదయం ప్రారంభించినట్టు జీఎం జె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమ సంస్థకు ఆర్‌బీఐ గుర్తింపు ఉందన్నారు. తమ సంస్థ రూ.5 వేలు నుంచి రూ.50 లక్షల వరకు అతి తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. బంగారంపై ప్రతి గ్రాముకు అత్యధికంగా ఫైనాన్స్ లభిస్తుందన్నారు. అలాగే వ్యాపార, వ్యక్తిగత రుణ సౌకర్యానికి మా సంస్థ ఎంతగానో దోహద పడుతుందని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎయం కె. శివప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ పి.గోవింద మరియు కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

విమాన శిఖర గోపుర పునఃప్రతిష్ఠ పూజలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూజారులు

అద్దంకి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని మాధవస్వామి దేవాలయం విమాన శిఖర గోపుర పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల దేవాలయం విమాన గోపురాన్ని దొంగలు అపహరించుకుపోయారు. ఈ నేపథ్యంలో పునఃప్రతిష్ఠకు బుధవారం నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. 14వ తేదీ శనివారం ఉదయం 8-04 గంటలకు పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. బుధవారం నుంచి ప్రారంభమైన పూజా కార్యక్రమాలు గురు, శుక్రవారాలలో కొనసాగి శనివారం ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సామాజిక స్ఫూర్తితో సేవలు

నా గ్రామమేనా తీర్థక్షేత్రం శంకుస్థాపనలో మంత్రి సత్యకుమార్

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సామాజిక స్ఫూర్తితో సేవలు చేయడమే మానవధర్మం అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కొలుకుల గ్రామంలో శ్రీ హరిహర సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నా గ్రామమే నా తీర్థక్షేత్రం' శంకుస్థాపన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవుల ఆశయాలు ఎంతోగొప్పగా ఉంటాయని,ఆయన ఆడుగుజాడల్లో నేను నడిచి ఇంత ఎత్తుకు ఎదిగానని అన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు సామాజిక బాధ్యత ఉండాలని అన్నారు. నేటి రోజుల్లో గ్రామాన్ని, బంధువులను, కుటుంబ సభ్యులను మరిచిపోతున్న తరుణంలో తన గ్రామానికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమాలు ఎంతో అభినందనీయం అని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న గురువులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తానని అన్నారు. విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి యక్కలి రాఘవులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక క్షేత్రాలు నిర్మించి ఎంతో మందికి శిక్షణ ఇవ్వాలనే కోరికతో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజలందరూ ఆధ్యాత్మికం, దైవభక్తి, ప్రజాసేవకు అంకితం అవుతారని అన్నారు. ముందుగా మంత్రి సత్యకుమార్ నాయకులు, స్థానికులతో కలిసి స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శంకుస్థాపన ప్రాంగణం వద్ద పూజలు చేసి హారతి నిర్వహించారు. శ్రీ అచలానంద ఆశ్రమానికి చెందిన విరజానంద స్వామి 'నా గ్రామమే నా తీర్థక్షేత్రం' శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో 20 సూత్రాల కార్పొరేషన్ చైర్మన్ లంకా దినకర్, రిటైర్డ్ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్వై శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు సిరసగండ్ల శ్రీనివాసులు, కూటమి నాయకులు, అర్చకులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి, నాయకులు



చెన్నుపల్లిలో నల్లి దెబ్బకి ఎదుగుదల లేని మిర్చి



తెగులుతో ఎదుగుదల లేకుండా వచ్చిన కాయలు



కొప్పెరపాలెంలో పిచికారీ చేస్తున్న రైతు

మిర్చికి నల్లి తెగులు దెబ్బ



ఎర్రగా వచ్చి ఎదుగుదల లేని మిర్చి తోట

- పలు గ్రామాల్లో ఎదుగుదల లేకుండానే ఎర్రగా వస్తున్న మొక్క
- ఎన్ని రకాలకు మందులు వాడినా అదుపులోకి రాని వైనం
- ఆందోళనలో రైతులు

బల్లికురవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో రైతులు సాగు చేసిన మిర్చి పైరుకు నల్లి తెగులు వ్యాప్తి చెందడంతో పంట కోతకు రాకుండానే ఎండి పోతోంది. నాలుగేళ్ల నుంచి వరుసగా ఏదో ఒక గ్రామంలో పెద్దఎత్తున వ్యాప్తి చెంది రైతును నష్ట పరుస్తున్న నల్లి తెగులు ఈ ఏడాది కూడా అలానే రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. లక్షలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసిన దిగుబడులు వచ్చే సమాయానికి తెగులు వచ్చిందని కాయలు పడకుండానే ఎర్రగా మిర్చి మొక్కలు వచ్చి ఎండుముఖం పట్టాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని రకాల పురుగు మందులు వాడినా ఫలితం లేకుండా పోతుందని రైతులు అంటున్నారు.

బల్లికురవ మండలంలోని, చెన్నుపల్లి, నక్కబొక్కల పాడు, కొణిదెన, కొప్పెరపాలెం, గంగపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, రామాంజనేయపురం, ఎస్ఎల్ గుడిపాడు, వెలమవారిపాలెం, కొత్తూరు, వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, బల్లికురవ, కె.రాజుపాలెం తదితర గ్రామాలలో రైతులు ఈ ఏడాది పెద్ద ఎత్తున మిర్చి పంటను సాగు చేశారు. కొన్ని గ్రామాలలో మిర్చి కోతలు కూడా ప్రారంభం అయ్యాయి. మిర్చికి ఎర్రనల్లి తెగులు రోజురోజుకు వ్యాప్తి చెందుతుంది. మిర్చి మొక్క అడుగుభాగం నుంచి ఎర్రగా వచ్చి ఎదుగుదల లేకుండా నిట్ట నిలువునా ఎండుతున్నాయి. వీటిని చూసిన రైతులు కొందరు పంట బెట్టకు వచ్చింది అని నీటిని పెడుతున్నారు. మిర్చి మాత్రం ఎర్రగా వస్తుంది. రైతులు తెగులు ఉందని తెలిసి లక్షలు వెచ్చించి పలు రకాల పరుగు మందులను వాడుతున్నారు. ముందుగా తెగులు విషయం తెలుసుకొని మందులు వాడినా పంటలు కొంత వరకు తెగులు బారి నుంచి తప్పించుకుంటున్నాయి. మందులు వాడకం ఆలస్యం చేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. కొందరు రైతులు తెగులు వచ్చిన పంటలను కోతలు కోయకుండా వదిలేస్తున్నారు. వచ్చిన కాడికి దిగుబడులు వస్తే పండు కాయలు కోసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఏటా ఎర్ర నల్లి తెగులు కొంప ముంచుందని రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.60వేల వరకు పెట్టుబడులు పెట్టామని తెగుల వలన తీవ్ర నష్టం తప్పదని వారు అంటున్నారు. తెగుళ్లతో పైరును తీసి వేసేందుకు కొందరు సిద్ధపడుతున్నారు. కొందరు రైతులు మాత్రం పురుగు మందులు వాడి కాపాడుకోవాలనే పట్టుదలతో ముందుకు వెళుతున్నారు. అధికారులు వెంటనే గ్రామాలలో సాగులో ఉన్న మిర్చిని పరిశీలించి నల్లి తెగులును అదుపులోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.



దీక్షధారులతో ఎమ్మెల్యే కొండయ్య, ఆయన కుమారులు

మాలధారణం.. నియమాల తోరణం

ఇరుముడి మహోత్సవంలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాలధారణం.. నియమాల తోరణం. మండల కాలం దీక్షలో ఉండి ఇరుముడితో శబరిమలకు వెళ్లి అయ్యప్పను దర్శించే భాగ్యం దీక్షధారులకే సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని బుర్లవారిపాలెంలో 40 రోజుల పాటు అయ్యప్ప దీక్షలో ఉండి బుధవారం ఇరుముడి కట్టుకుని శబరిమలకు వెళ్లే భక్తులకు ఎమ్మెల్యే కొండయ్య, ఆయన పెద్ద కుమారుడు గౌరీఅమర్‌నాథ్, చిన్న కుమారుడు, టీడీపీ నియోజకవర్గ అధికారి ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ కలసి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కన్నె స్వాములు, కత్తి స్వాములు, గంట స్వాములు ఇలా వివిధ దశల్లో పయనమవుతున్న దీక్షధారులకు వీడ్కోలు పలికారు. యాత్రను దిగ్విజయంగా ముగించుకుని క్షేమంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, దీక్షధారులు, వారి బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

నీటి సంఘ ఎన్నికలకు నోటిఫ్‌కేషన్ విడుదల

పంగులూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలు ఈనెల 14 జరగనున్నాయి. బుధవారం సంబంధిత ఎన్నికల అధికారులు ఆయా కేంద్రాల పరిధిలో నోటిఫ్‌కేషన్ విడుదల చేశారు. అద్దంకి సబ్ డివిజన్‌లోని జె.పంగులూరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో ఉన్న పంగులూరు - 1, జె.పంగులూరు - 2, కొండమంజులూరు - 1, చందలూరు - 1, కోణంకి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలోని కొండమంజులూరు - 2 నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి బుధవారం మండలంలో ఎన్నికల నోటిఫ్‌కేషన్ విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీన ఉదయం 8 గంటలకు ఆయా నీటి వినియోగదారుల సంఘ పరిధిలోని వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం వార్డు సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారు. ఇది పూర్తయిన అనంతరం అదే రోజు ఎన్నికైన సభ్యులను సమావేశ పరచి సంబంధిత నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని అధికారులు తెలిపారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నిక జరిగే కేంద్రాలతో పాటు, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నోటిఫ్‌కేషన్ వివరాలను వెల్లడించారు. ఈనెల 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక జరుగుతుందని అద్దంకి సబ్‌డివిజన్ డీఈ రామకృష్ణ తెలిపారు.

జన గర్జనను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు


అద్దంకిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెదూర్తిలో ఈనెల 20, 21 తేదీల్లో జరిగే నూర్‌బాషా దూదేకుల జన గర్జనకు విద్యార్థులు, యువకులు, వ్యాపారులు తరలివచ్చి జయప్రదం చేయాలని సంఘ నాయకులు కోరారు. గురువారం అద్దంకిలోని రఫీ కార్యాలయంలో పట్టణ, మండల నూర్ బాషా దూదేకుల సమావేశం జరిగింది. జన గర్జన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు షేక్ మహమ్మద్ రఫీ, రాష్ట్ర నూర్ బాషా యువజన కార్యదర్శి కొటికలపూడి శ్రీను, పట్టణ అధ్యక్షుడు సుభాని, ఉపాధ్యక్షుడు షేక్ మాబు, సైదా వలి, నాయకులు పాల్గొన్నారు.

16న బహిరంగ వేలం పాటలు

వేటపాలెం, చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రామన్నపేట పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీకనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానంలో వివిధ అంశాలకు సంబంధించిన బహిరంగ వేలంపాటను ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి పోతిని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, శీతల పానీయాల విక్రయాలు, టెంట్ సామాను, వంట పాత్రలు అద్దెకు ఇవ్వడం, అమ్మవారికి సమర్పించే చీరలు, జాకెట్లు, తలనీలాలు, చెవిపోగులు, పొట్టేలు మొక్కు చెల్లింపు అనంతరం ముక్కుకుట్టడం తదితర అంశాలకు సంబంధించి బహిరంగ వేలం పాటులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాటలో పాల్గొనేవారు ముందుగా రూ.10వేల దరావత్తు చెల్లించాలని కోరారు. సమాచారం కోసం ఆలయం వేళల్లో సంప్రదించాలని సూచించారు.

మద్యం అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు



మద్యంను స్వాధీనం చేసుకున్న సీఐ

చీరాలటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విధానాలకు భిన్నంగా మద్యంను అక్రమంగా విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఉజిలీపేట పరిధిలో దాడులు నిర్వహించారు. అదే ప్రాంతానికి చెందిన మూకిరి క్రాంతి కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆయనవెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఆటో డ్రైవర్ మోసం

వృద్ధుడి నుంచి నగదు అపహరించి పరారీ

పర్చూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ మోసానికి వృద్ధుడు లబోదిబోమన్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన చిమటా వెంకటేశ్వర్లు పర్చూరు వచ్చేందుకు నూతలపాడువద్ద ఆటో ఎక్కారు. నూతలపాడు గ్రామం దాటిన క్రమంలో ఆటోను రోడ్డు పక్కనే పొలాలకు వెళ్లే డొంకలోకి ఆటోను తీసుకు వెళ్లి వృద్ధుని వద్ద ఉన్న రూ.11వేల నగదును లాక్కొని ఆటో డ్రైవర్ పరారాయ్యాడు. దీంతో ఆ వృద్ధుడు లబోదిబో మంటూ మరో వాహనంలో వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ వర్గీయుల దాడి

ఈపూరుపాలెంలో కేసు

చీరాలటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త నక్కల వెంకటేశ్వర్లు అలియాస్ పండుపై పలువురు వైసీపీ వర్గీయులు దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తగా కీలకంగా ఉన్న వెంకటేశ్వర్లు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న బ్యానర్‌లను దబ్బకూటి శ్రీనివాసరావు, గవిని నాగరాజు మరి కొందరు చించి వేస్తున్నారు. అలాగే బుధవారం గ్రామంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వెంకటేశ్వర్లు అడ్డంగా నిలబడి దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమీక్షలో పాల్గొన్న పీడీ విజయలక్ష్మి

ఉపాధి కల్పనకు కృషి చేయాలి

పీడీ విజయలక్ష్మి

చీరాలటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొత్త సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ కార్మికులకు ఉపాధి కల్పనకు కృషి చేయాలని పథకం పీడీ విజయలక్ష్మి అన్నారు. జాతీయ ఉపాధిహామీ జిల్లాస్థాయి సమీక్షా సమావేశం బుధవారం చీరాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పొలాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100 రోజుల పని కల్పించే దిశగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్లాంటేషన్ వర్క్‌లను యాప్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. హార్టికల్చర్‌లో భాగంగా పండ్ల తోటలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించాలన్నారు. మినీ గోకులాలు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ బిల్డింగ్ రీచార్జ్ గుంతలను ఏర్పాటు చేయాలని చెప్పారు. హౌసింగ్ లబ్ధిదారుల 90 రోజుల పనిదినాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది 100 రోజుల పని దినాలను గుర్తించి యాప్‌లో అప్‌లోడు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ కోటయ్య నాయక్, ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, జిల్లా పరిధిలోని అన్ని మండలాల టెక్నికల్ అసిస్టెంట్‌లు, బీఎఫ్‌టీలు, ఈసీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బల్లికురవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ రత్నకుమారి కోరారు. బుధవారం మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో పోలంపిలుస్తోంది. కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రైతు శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన ఏడీఏ రత్నకుమారి, బల్లికురవ ఏవో కుమారి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. పంటల బీమాను ప్రతి ఒక్కరు చేయించుకోవాలని సూచించారు.

పంగులూరు : రబీలో సాగు చేసిన పంటలకు పంట బీమా చేయడంతో పాటు పంట నమోదు విధిగా చేయించాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. భైటమంజులూరు, ముప్పవరంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న మొక్కజొన్న పంటను రైతులతో కలసి పరిశీలించి పురుగు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది దిల్షా, పృథ్వీ, రైతులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : కత్తెర పురుగు నివారణకు సమగ్ర సస్య రక్షణకు కచ్చితంగా కొన్ని నియమాలు పాటించాలని వాటిపై రైతులు అవగాహన పొందాలని వ్యవసాయాధికారి సుమతి అన్నారు. కావూరివారిపాలెం, దేవినూతల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ కత్తెర పురుగు తొలి దశలో ఎకరాకు 5 శాతం వేప గింజల కషాయం పిచికారీ చేయాలని సూచించారు. గొంగళి పురుగు నివారణకు 10 కిలోల తవుడు, రెండు కిలోల బెల్లం, రెండు లీటర్ల నీటిని కలిపి 2 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమాన్ని సాయంత్రం వేళల్లో సుడులలో లేదా మొవ్వులలో వేయాలని చెప్పారు. కార్యక్రమంలో విఏఏలు ఆఫియా, హాడ్సా, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : వరిలో ఉల్లికోడు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రామాయపాలెం, తిమ్మాయపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉల్లికోడు లక్షణాలు కనిపిస్తున్నాయని, పిలకలు గొట్టాలుగా సన్నాగా కనిపిస్తున్నాయని, గాలిలో తేమశాతం 80 నుంచి 90శాతం ఉన్నప్పుడు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. దీని నివారణకు నారు మడిలో కార్బోఫ్యూరాన్, 3 జి గుళికలు వేసుకోవాలని, పైరు పెద్దదయిన తరువాత కార్బోసల్ఫాన్ 400 ఎంఎల్ ఎకరాకు లేదా ఫిప్రోనిల్ 400 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి, వీఏఏ ఖాజాబి, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : రైతులు సాగుచేస్తున్న పంటలను తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి రామినేని లావణ్య తెలిపారు. మండలంలోని కుందుర్రు గ్రామ రైతు సేవా కేంద్రంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాలటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం చీరాల మండల పరిధిలోని బుర్లవారి పాలెంలో సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా అర్జీదారుల నుంచి వచ్చిన 39 అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ అర్జున్, సర్వేయర్ బ్రమణయ్య, ఆర్ఐ నాగకుమార్, ఏవో సుమతి, ఎండోమెంట్ ఈవోలు శివనాగదాసు, కృపారావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

పంగులూరు : రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రత్యేకాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముందు తహసీల్దార్ సింగారావు ఎస్సీ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సదస్సులో తహసీల్దార్ సింగారావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ప్రజల నుంచి 29 దరఖాస్తులు రాగా, నాలుగు సమస్యలను పరిష్కరించి ధ్రువపత్రాలను రైతులకు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, ఈవోఆర్డీ సుమంత్, సర్వేయర్ సురేష్, నాయకులు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు, వీఆర్వో వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ ప్రసన్నబాబు, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కారిస్తామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి పలు సమస్యలపై ఆయన అర్జీలను స్వీకరించారు. మ్యూటేషన్ కోసం ఐదు, భూ కొలతలకు ఏడు, కుల ధ్రువీకరణ సర్టిఫికేట్‌కు ఒకటి, ఆదాయ ధ్రువీకరణకు అర్జీ అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ సుబ్బారావు, ఇన్‌చార్జి ఆర్ఐ నాగేశ్వరరావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పీ బ్రహ్మయ్య కోరారు. బుధవారం మండల పరిధిలోని నూతలపాడు, చింతగుంటపాలెం గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలను నిర్వహించారు. ఈసందర్భంగా నూతలపాడులో సర్పంచ్ కాకర్లమూడి చిన్న అధ్యక్షతన సదస్సులో రైతుల నుంచి అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారి దామా నాగేశ్వరరావు, డాక్టర్ ఏకాంబరేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీ ప్రేమ్‌కుమార్, సర్వేయర్ అరుణ, నాయకులు విన్నకోట సతీష్, కంచేటి శ్రీహరి, విన్నకోట అజయ్, రైతులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు

ప్రయాణికులకు తీరనున్న ఇక్కట్లు



గుంతలను పూడ్చుతున్న కార్మికులు

పర్చూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోక ధ్వంసమైన రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలుత రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉన్న రహదారులను బాగు చేయించేలా చర్యలు తీసుకుంది. పర్చూరు - యద్దనపూడి రహదారి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

ఆహ్వానించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు బుధవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. స్థానిక 31వ వార్డుకు చెందిన నాగేంద్రమణి ఇటీవల టీడీపీలో చేరారు. ఈ క్రమంలో ఆమె ఆధ్వర్యంలో తాజాగా మరికొందరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ముందుగా నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో పలఎవ్వరు మాట్లాడారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా అందరం కలసి పనిచేద్దామన్నారు. బుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన పాలనను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. క్రీస్తు శాంతి సందేశం అందరికీ అనుసరణీయమని వక్తలు, సంఘ కాపర్లు పేర్కొన్నారు. కేక్ కట్ చేశారు. వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కృష్ణవేణమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

కృష్ణవేణమ్మకు ఎమ్మెల్యే ఏలూరి నివాళి

జాగర్లమూడి (పర్చూరు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాగర్లమూడి టీడీపీ గ్రామ సీనియర్ నాయకుడు మద్దుకూరి నెహేమియారావు తల్లి కృష్ణవేణమ్మ దశదిన కర్మ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు ధూళిపల్లి వెంకటస్వామి, యద్దనపూడి మండల పార్టీ అధ్యక్షులు నన్నపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరావు, మద్దుకూరి మృత్యుంజయరావు, మార్కేండేయులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మార్టూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గణిత శాస్త్ర అధ్యాపకుడు చిలకాదేవదాసు ప్రిన్సిపాల్ డీవీ శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేశారు. ఇంటర్ మీడియట్ బోర్డు వారిచే రూపొందించిన ప్రశ్నల నిధి సమాధానాల మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు.

వాలీబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన వాలీబాల్ జట్టుతో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నర్సారావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూ (కాకినాడ) సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజీ వాలీబాల్ పోటీలలో సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు విజేతలుగా నిలిచారు. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలలో గెలుపొందిన వాలీబాల్ జట్టు సభ్యులను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తదితరులు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు మాట్లాడుతూ పోటీల పూర్వాపరాలను వివరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 28 కళాశాలల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ గెలుపొందిన జట్టులో ఆర్.రమణ, జి.తేజారెడ్డి, జి.మైఖేల్, కె.సన్నీ, కె.సాయికుమార్, డేని, చంద్రశేఖర్, ఆంద్రూస్, నాని, సాయికృష్, చంద్రశేఖర్, రేవంత్ ఉన్నారన్నారు. మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన తరువాత తొలిసారిగా సాగునీటి సంఘాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఇవి ఎంతో కీలకమైనవి. వీటి పరిధిలో పనులు చేసేది ఆయా సంఘాల అధ్యక్షులే. ఇంతకుముందు రూ. 5 లక్షల లోపలే పనులు చేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ. 10 లక్షల లోపు పనులు చేసేలా నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయా సంఘాల ఎన్నికలకు ప్రాధాన్యం పెరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో లేవు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు, ఇతర నాయకులంతా ఈ ఎన్నికలపైనే పడ్డారు. మొత్తం ఏకగ్రీవం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా జనసేన, బీజేపీలకు కూడా ఈ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలంటూ టీడీపీ అధిష్ఠానం ఆదేశాలు ఇవ్వడంతో ఏమి చేయాలో పాలుపోక వారంతా తలలు పట్టుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో గట్టెక్కేదెట్టా...? అని ఆలోచిస్తున్నారు.

గట్టెక్కేదెట్టా...?

- ఎమ్మెల్యేలకు తలనొప్పిగా నీటి సంఘాల ఎన్నికలు
- జనసేన, బీజేపీకు వాటాపై అధిష్ఠానం ఆదేశాలు
- ఏమిచేయాలో పాలుపోక అగచాట్లు
- ఏకగ్రీవం దిశగా యత్నాలు

నెల్లూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో పెద్దగా ఆశ్చర్యం ఏమీలేదు. కాకపోతే ఈ నోటిఫికేషన్‌తో టీడీపీ ఎమ్మెల్యేలకు తలపోటు ఆరంభమైంది. ఇంకా రెండేళ్ల వరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు లేకపోవడం, సాగునీటి సంఘాలు రూ.10 లక్షల పరిమితి వరకు పనులు చేసుకునే వెసులుబాటు కల్పించడంతో సహజంగానే ఈ పదవులకు పోటీ పెరిగింది. సొంతవర్గంలో గ్రామస్థాయిలో మొదలైన ఈ పోటీని తట్టుకోలేక ఎమ్మెల్యేలు సతమతం అవుతున్నారు. ఈ క్రమంలో కూటమిలోని జనసేన, బీజేపీలకు కూడా వాటా ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశించింది. దీంతో ఎవరిని పక్కనపె ట్టాలో అర్థం కాక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికల తరువాత గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.



సంగంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్న అధికారులు

• 14,17 తేదీల్లో ఎన్నికలు

జిల్లా పరిధిలో 765 సాగునీటి సంఘాలు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఐదు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటిలో ప్రాజెక్టు కమిటీలు మినహా మిగిలిన వాటికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 14న సాగునీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. సాగునీటి సంఘాలకు ఆ చెరువు పరిధిలోని ఆయకట్టుదారులు ఓటర్లుగా ఉంటారు. వీరు సాగునీటి సంఘ అధ్యక్షులను ఎన్నుకుంటారు. సాగునీటి సంఘ అధ్యక్షులు 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకొంటారు. ఈ డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు ప్రాజెక్టు కమిటీ సభ్యులను ఎన్నుకోవాలి. అయితే ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం ఇంకా తేదీని ప్రకటిం చలేదు.

• పెరిగిన ప్రాధాన్యత

జిల్లాలో సాగునీటి సంఘాలకు చాలా ప్రాధాన్యత ఉంది. సోమశిల ప్రాజెక్టు కారణంగా జిల్లా పరిధిలోని చెరువుల్లో 80శాతం ఏటా రెండు పంటలకు సరిపడే నీటి సామర్థ్యం ఉన్నవే. ఈ క్రమంలో సాగునీటి సంఘాలకు గ్రామాల్లో విలువ ఎక్కువ. పైగా చాలాఏళ్ల తరువాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో ఆసక్తి పెరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర విభజన తరువాత జరగలేదు. తొలిసారిగా కూటమి

- ప్రాజెక్టు కమిటీలు ఐదు
- డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 13
- నీటి సంఘాలు 765
- నీటి సంఘాలకు ఎన్నిక ఈనెల 14న..
- డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు

(మిగతా 6వ పేజీలో)



పగుళ్లు ఏర్పడి పడిపోయేస్థితిలో జలాశయం ముందు గోడ

రక్షణ గోడకు పగుళ్లు

• నిర్లక్ష్యం వీడని ఇంజనీర్లు

అనంతసాగరం, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయం కుడివైపు ఉన్న రక్షణ గోడ పగుళ్లిచ్చింది. ఈ గోడ నెర్రెలుబారి అధ్వాన స్థితికి చేరుకున్నా జలాశయం ఇంజనీర్లలో చలనం లేదు. క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీరు వదిలిన సమయంలో నీటి నియంత్రణ చేస్తూ.. సాఫీగా పెన్నానదిలో ప్రవాహం కొనసాగేలా దీని నిర్మాణం చేపట్టారు. అంతేకాక ఈ గోడ సోమశిల గ్రామానికి రక్షణ కవచంగా ఉంది. క్రస్ట్‌గేట్ల నుంచి సుమారు 500 మీటర్ల పొడవు కలిగిన ఈ నిర్మాణంలో డిజైనింగ్ లోపం ఉన్నట్లు గతంలో నిపుణుల కమిటీ తేల్చింది. కానీ దాన్ని సరిదిద్దే పనులను మాత్రం ఇంజనీర్లు చేయలేదు. పగుళ్లిచ్చిన గోడతో ప్రాజెక్టు మనుగడకు ఎలాంటి ప్రమాదం ఉంటుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని బుధవారం ఆ శాఖ ఎస్ఈ డీ వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఈ రామకృష్ణారావు, ఏఈఈలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఎంబుక్‌ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాల ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు ఆయన గండిపాళెం జలాశయం సమీపంలోని సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏఈలు జగన్నాథం, వరప్రసాద్ పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా

మైనింగ్ వ్యవహారం

- కలెక్టర్ ఉత్తర్వులపై హైకోర్టుకు గనులశాఖ డీడీ
- జిల్లా పాలనాధికారి ఆదేశాలు నిలుపుదల
- తిరుపతి డీడీకి ఇన్‌చార్జి బాధ్యతులు
- నేడు విధులకు హాజరవుతా.. : చంద్రశేఖర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మైనింగ్‌శాఖలో జరుగుతున్న వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గత నెల 30న గనులశాఖ డీడీ చంద్రశేఖర్‌ను రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టరు ఓ ఆనంద్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులు చెల్లవంటూ డీడీ చంద్రశేఖర్ ఈనెల 6న హైకోర్టును ఆశ్రయించారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను ఈనెల 9న హైకోర్టు సస్పెండ్ చేసింది. హైకోర్టు కాపీ బుధవారం జిల్లాకు వచ్చింది. కాగా జిల్లా ఇన్‌చార్జి మైనింగ్ డీడీగా తిరుపతి గనులశాఖ డీడీ బాలాజీ నాయక్‌కు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఇందుకు సంబంధించిన ప్రొసిడింగ్స్ రావాల్సిఉంది. ఈ విషయమై మైనింగ్ డీడీ చంద్రశేఖర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కలెక్టర్ ఇచ్చిన సరెండర్ ఆదేశాలను హైకోర్టు రద్దు చేసిందన్నారు. ఈ క్రమంలో తాను డీడీగా కొనసాగుతున్నట్లే అవుతుందన్నారు. కాబట్టి గురువారం విధులకు హాజరవుతానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇక ముందు ముందు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.

బాధంతా ఒకటే

- బిల్లులు రాక వారు.. పర్సంటేజీలు అందక వీరు !
- నీరు-చెట్టు బిల్లుల అప్‌లోడ్‌కు ఇరిగేషన్ సిబ్బంది తిరకాసు
- పర్సంటేజీ కోసం పట్టుబడుతున్నట్లు కాంట్రాక్టర్ల ఆరోపణ
- చెల్లింపునకు ప్రభుత్వం నిర్ణయం
- కోర్టులో ఉన్న బిల్లులకు రూ.250 కోట్లు విడుదల
- జిల్లాలో సుమారు రూ.10 కోట్ల వరకు ఉన్న బిల్లులు
- ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

నెల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది నీరు-చెట్టు పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి. చేసిన పనులకు బిల్లులు రాక గత ఐదేళ్ల నరకయాతన పడ్డ వీరికి కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించేందుకు నిర్ణయించింది. ఇందుకు గానూ బడ్జెట్ కూడా విడుదల చేసింది. కానీ జిల్లాలోని ఇరిగేషన్ సిబ్బంది మాత్రం ఈ బిల్లులను అప్‌లోడ్ చేయడంలేదు. ప్రభుత్వం మారినా ఇరిగేషన్ శాఖలో పరిస్థితులు మాత్రం మారలేదు.



సెంట్రల్ ఇరిగేషన్ కార్యాలయం

పర్సంటేజీలు ఇస్తేనే బిల్లులను అప్‌లోడ్ చేస్తామంటూ కొందరు ఇరిగేషన్ సిబ్బంది తెగేసి చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. జేఈ, డీఈల నుంచి బిల్లులు నెల్లూరు సెంట్రల్ డివిజన్‌కు చేరినా, అక్కడి నుంచి ముందుకు కదలడం లేదని సమాచారం. ఇప్పటికే పెట్టిన పెట్టుబడి, దానికి వడ్డీ కలుపుకుంటే వచ్చే బిల్లు అసలు సరిపోదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పుడు మళ్లీ అధికారులకు పర్సంటేజీలు ఇవ్వాలంటే ఇక నెత్తిన గుడ్డేసుకోవాల్సిందేనని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తున్నారు. ఇరిగేషన్ శాఖలోని తీరును వారికి తెలియజేస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

• ఎన్నో ఏళ్ల పోరాటం

2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పథకం కింద ఇరిగేషన్ శాఖలో పెద్ద ఎత్తున పనులు జరిగాయి. మొదటి నాలుగేళ్ల చేసిన పనులకు బిల్లులు వచ్చాయి. అయితే చివరి ఏడాది చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం వచ్చాక బిల్లులు నిలిపేసింది. విచారణల పేరుతో బిల్లులు ఇవ్వకుండా కక్షసాధింపులకు పాల్పడింది. మూడేళ్ల పాటు ప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్న కాంట్రాక్టర్లు ఆ తర్వాత ప్రభుత్వంపై పోరాటానికి దిగారు. ఒక్కొక్కరుగా హైకోర్టును ఆశ్రయించారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు ఇస్తుండడంతో బిల్లులు చెల్లిస్తూ వచ్చారు. అయితే ఎన్నికలకు ముందు అయితే కంటెప్ట్ కేసులకు కూడా బిల్లులు చెల్లించలేదు. ఒక్క ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే సుమారు రూ.120 కోట్లు నీరు-చెట్టు పనుల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇందులో చాలా వరకూ హైకోర్టు ఉత్తర్వుల ద్వారా కాంట్రాక్టర్లు బిల్లులు సంపాదించుకున్నారు. మరో రూ.20 కోట్లకుపైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందులో ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్న బిల్లులు విలువ సుమారు రూ.10 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. ఒక్క సెంట్రల్ డివిజన్ పరిధిలోనే రూ.6 కోట్లకుపైగా ఉన్నట్లు ఇరిగేషన్ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ఈ వివరాలను ఇరిగేషన్ అధికారులు బయటపెట్టకపోతుండడం గమనార్హం.

• ఇరిగేషన్ సిబ్బంది తీరుపై విమర్శలు

వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపులకు చాలా మంది పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆస్తులు అమ్ముకొని అప్పులు కట్టుకున్నారు. ఇంకొందరు ఇంకా అప్పుల ఊబిలో నుంచి బయటకు రాలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ కూడా నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు అనేక పోరాటాలు

(మిగతా 6వ పేజీలో)



రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ గేటు పనులను ప్లాట్‌ఫామ్‌పై కూర్చొని పర్యవేక్షిస్తున్న కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, ఎస్ఈ వరలక్ష్మి

కొలిక్కిరాని గేటు సమస్య

- రాళ్లపాడు కుడి కాలువ గేటుకు నాలుగు రోజులుగా మరమ్మతులు
- సాగర్ నుంచి మెకానిక్ సిబ్బంది రాక
- పనులు పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల
- ప్రాజెక్టు వద్దకు భారీగా తరలివచ్చిన రైతులు
- అయినా ఫలించని యత్నాలు

లింగసముద్రం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గత శనివారం దెబ్బతిన్న రాళ్లపాడు కుడి కాలువ తూము మొదటి గేటు సమస్య బుధవారం నాటికి కూడా ఓ కొలిక్కి రాలేదు. దెబ్బతిన్న గేటును తొలగించి రెండో గేటు ద్వారా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని వరినారుమళ్లకు, వరినాట్లకు నీరు ఇచ్చేందుకు మెకానిక్ షమీంబాషా, అధికారులు, సిబ్బంది ఆదివారం నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు.మంగళవారం ఐదు టన్నుల చైన్ పుల్లీలు ఉపయోగించి గేటును పైకి లాగేందుకు మెకానిక్‌ల బృందం చేసిన ప్రయత్నం విఫలమైంది.దీంతో బుధవారం విజయవాడ నుంచి 10 టన్నుల చైన్ పుల్లీలు రెండింటిని తెప్పించి గేటును పైకి లేపే పనులు ప్రారంభించారు. మెకానిక్ సిబ్బంది తూము లోపలికి దిగి గేటుకు కొక్కేలను తగిలించి, ఈ చైను పుల్లీల ద్వారా పైకి లాగేందుకు ప్రయత్నించారు. అయితే గేటును పైకి లాగే సమయంలో బీమ్ వంగిపోవడం, చైన్ తెగిపోవడం జరిగింది. మళ్లీ మరో చైన్‌తో గేటు లాగే ప్రయత్నం చేశారు. కానీ రాత్రి 9 గంటల వరకు వారి ప్రయత్నాలు సఫలం కాలేదు.దీంతో భారీగా తరలివచ్చిన ఆయకట్టు రైతులు నిరాశతో వెనుతిరిగారు.

• పనులు పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు

మరమ్మతుల విషయం తెలుసుకున్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గేటు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రాజెక్టు కుడి కాలువ తూము వద్దకు వచ్చారు. గేటును పరిశీలించి అధికారులు, మెకానిక్‌ల బృందంతో చర్చించారు.అనంతరం జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ప్రభుత్వ సాగునీటి సలహాదారుడు కన్నయ్యనాయుడు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. కన్నయ్యనాయుడుతో ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లును మాట్లాడించి, ఆయన సలహాలు తీసుకున్నారు.అయితే నాగార్జునసాగర్ నుంచి



కుడి కాలువ తూములో దెబ్బతిన్న గేటును బుధవారం రాత్రి పైకి లాగేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది

నిపుణులైన మెకానిక్ సిబ్బందిని కూడా రప్పించారు. కానీ బుధవారం రాత్రికి కూడా గేటు పైకి లాగే పనులు పూర్తికాలేదు. కాగా గురువారం విశాఖపట్నం నుంచి నిపుణులైన మెకానిక్‌లను, సిబ్బందిని రప్పించి గేటును తొలగింపునకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యేలు తెలిపారు. అయితే, ఈ పనులను ఒంగోలు ఇరిగేషన్ ఎస్ఈ ఎస్ వరలక్ష్మి కూడా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కొండాపురం మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మాజీ ఎంపీపీ పీ.చంద్రబాబు నాయుడు మండల రైతులు తదితరులు పాల్గొన్నారు



నెల్లూరులోని ఎస్ఎస్‌డీ ఆయుర్వేద నిలయంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

విజిలెన్స్ తనిఖీలు

• ఆయుర్వేద దుకాణం సీజ్

నెల్లూరు(క్రైం),డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అయుర్వేద మందుల దుకాణం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో ఓ దుకాణాన్ని సీజ్ చేశారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సమీపంలో శ్రీశివదుర్గ ఆయుర్వేద నిలయంలో ఆయుర్వేద మందుల విక్రయాలు సాగుతున్నాయి. అయితే ఈ దుకాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లేవన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు, ఆయుష్‌శాఖ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి అనుమతులు లేవని నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో మందుల దుకాణంలో ఉన్న రూ.6,97,839 విలువ చేసే మందులను సీజ్ చేశారు. అనంతరం దుకాణాన్ని కూడా సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం ఆంధ్రబోర్డ్ ఫర్ ఆయుర్వేదిక్, హోమియోపతి విజయవాడకు ఫిర్యాదు చేయనున్నట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరావు తెలిపారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్‌స్టేషన్



మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని బస్ స్టేషన్ నిరుపయోగంగా మారింది. గ్రామంలో సుమారు 25 ఏళ్ల క్రితం ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలతో బస్‌స్టేషన్ నిర్మించారు. తొలినాళ్లలో బస్టాండు ప్రయాణికులతో కళకళలాడుతుండేది. అయితే క్రమేణా బస్‌స్టేషన్‌లోకి బస్సులు రాకపోవడంతో పాటు నిర్వహణను ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు బస్టాండు సెంటరులోని మూడు రోడ్ల కూడలిలో బస్‌షెల్టర్ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. బస్‌స్టేషన్‌లో మరుగుదొడ్ల వినియోగం లేక చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా మారాయి. అంతేగాకుండా రాత్రిళ్లు అసాంఘీక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి)

పంటలకు చీరలే శ్రీరామ రక్ష



పంటలకు చీరలే శ్రీరామ రక్ష అని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని వలేటివారిపాలెం, చుండి, అయ్యవారిపల్లె, మాల కొండ, పోలినేనిచెరువు, గరుకపాలెం, అంకభూ పాలపురం, రామచంద్రాపురం, లింగపాలెం, కాకర్లవారిపాలెం, వీరన్నపాలెం పెద్దఅమ్మపాలెం గ్రామాల్లో అడవి పందుల బెడద తీవ్రంగా ఉంది. ఆయా గ్రామాల్లో సాగుచేసిన మినుము, పెసర, వరి తదితర పంటలను అడవి పందులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు వాటినుంచి పంటలను కాపాడుకునేందుకు పంటల చుట్టూ పాత చీరలు, వలలు, మెష్‌లు, ఇనుప తీగలు కడుతున్నారు. అంతేగాకుండా రాత్రిళ్లు కుక్కలు, మనుషులు అరుస్తున్నట్లు రూపొందించిన మైక్‌లు ఏర్పాటుచేస్తున్నారు. కాగా, ఈ శబ్దాలు కొందరికి సత్ఫలితాలు ఇస్తుంటే, మరికొంత మంది రైతులకు గోరుచుట్టుపై రోకలిపోటన్నట్లు అడవి పందుల బెడద తప్పడం లేదు.

- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి)

‘అభయం’ సేవలు ఆదర్శనీయం

పక్కింట్లో మనిషి చనిపోతే చూడటానికి కూడా రాని ఈ రోజుల్లో అనాథ శవాలకు అన్నీ తామై దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు అభయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఇలింద్ర వెంకటేశ్వర్లు (ఈవీఎస్), నూనె మోహన్. మృతదేహాల తరలింపు నుంచి అంత్యక్రియలు వరకు సొంత నిధులు వెచ్చిస్తున్నారు వీరిద్దరు. మామూలు సమయంలోనే కాదు కరోనా సమయంలో కూడా మృతదేహాలకు వీరు దగ్గరుండి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వీరిసేవలు గుర్తించిన ప్రభుత్వం ‘మానవత్వ ధీర’ అనే సేవా పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని అందజేసింది. 2014లో స్థాపించిన ఈ సంస్థ ఇప్పటివరకు సుమారు 300కుపైగా అనాథశవాలకు అంత్యక్రియలు నిర్వహించింది. వీరిద్దరూ అందుబాటు లో లేనప్పుడు ఈవీఎస్ తనయుడు వంశీకృష్ణ, వీరి స్నేహితుడు పాదర్తి ఉదయ్ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)



హిందు శ్మశానంలో అభయం సంస్థ నిర్మించిన దహన సంస్కార మండపం

- అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు
- మృతదేహాల తరలింపు నుంచి దహనక్రియల వరకు సొంత నిధుల వ్యయం
- సంస్థ నిర్వాహకుల చేతుల మీదుగానే అన్నీ..
- మరెన్నో సామాజిక సేవల్లో ఈవీఎస్, మోహన్

● ఆదర్శంగా సేవలు

ఆర్యవైశ్య సామాజికి వర్గానికి చెందిన ఈవీఎస్,మోహన్‌లు చేస్తున్న పనులను మొదట్లో వారి సామాజిక వర్గంవారే తప్పుబట్టారు. కాలక్రమంలో వారు చేస్తున్నది సామాజిక బాధ్యతని భగవంతుడి సేవ అని గుర్తించి నాడు విమర్శించినవారే.. నేడు అభినందిస్తున్నారు. ఒక్కో అనాథ శవం దహన సంస్కారాలకు సుమారు. రూ.10 వేలకుపైన ఖర్చు అవుతున్నా, వీరిద్దరే భరిస్తూ వారిని గౌరవంగా సాగనంపుతున్నారు. అనాథలకు దహనసంస్కారాలు నిర్వహిస్తే, అశ్వమేథ యాగం చేసినంత ఫలితం దక్కుతుందో కలియుగ పురాణంలో పేర్కొన్నారంటూ చెప్పే చాగంటి కోటేశ్వర రావు ప్రబోధాలను వీరు తూచా తప్పక పాటిస్తున్నారు.

సేవలు సంతృప్తినిస్తున్నాయి...



అనాథ శవాలకు దహన సంస్కారాలు చేయడం తమకు ఎంతో సంతృప్తినిస్తున్నాయి. ఈవీఎస్ ప్రోత్సాహంతో ‘అభయం’ను స్థాపించి నడిపిస్తున్నాం.తమకు వ్యాపారాల్లో వచ్చే ఆదాయం కన్నా అనాథలకు చేసే దహన సంస్కారాలే ఎక్కువ సంతృప్తినిస్తున్నాయి.ఇకముందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- నూనె మోహన్, కావలి

అనాథలను ఆదుకునేందుకే..



అనాథులను ఆదుకునేందుకే ‘అభయం’ను స్థాపించాం. తొలుత ఫంక్షన్లలో భోజనాలు వృథాగా పారేయటాన్ని చూసి, ఆకలితో ఉన్న వారికి అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను స్థాపించాం. తర్వాత ఓ పేదరాలు ఫోన్ చేసి తన భర్త చని పోయారని, తనకు ఎవరూలేరని సాయం చేయాలని కోరింది. అక్కడికి వెళ్లి చూస్తే మనస్సు చలించింది. చివరి మజిలీలో కూడా ఇన్ని కష్టాలు ఉంటాయో..అని అనిపించింది. ఆ మృతదేహానికి అంత్యక్రియలు చేసేం దుకు సిద్ధం కాగా, తరలించేం దుకు వాహనం దొరకలేదు. దాంతో అప్పటి నుంచి అన్నీ తామై అంతిమ సంస్కారాలు చేస్తున్నాం.

- ఈవీఎస్, కావలి

● ఉచితంగా అంతిమయాత్రం రథం

‘అభయం’ తరపున అంతిమ యాత్రరథం (వాహనం)కొనుగోలు చేశారు. ఎవరైనా సంస్థకు ఫోన్ చేస్తే వారికి ఉచితంగా వాహనాన్ని పంపుతున్నారు. అంతేకాక ఆ వాహనానికి ఆయిల్ ఖర్చులు భరించి, తమ డ్రైవర్లు చేత మృతదేహాలను శ్మశానం వరకు తీసుకెళ్లి వదిలి వస్తున్నారు. మృతదేహా లను భద్రపరచే ఫ్రీజర్లను కూడా వారే సరఫరా చేస్తున్నారు. అయితే వాటి నిర్వహణకు మాత్రం నామమాత్రంగా రుసుం వసూలు చేస్తారు.

● రక్తదాన శిబిరాల ఏర్పాటు

రక్తం కొరతతో ఎవరూ ఇబ్బందులు పడకూడదని భావించి తమ సంస్థ తరుపున ప్రతిఏటా రిపబ్లిక్ డే రోజున మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 14 శిబిరాలు ఏర్పాటు చేశారు. గత ఏడాది 575 యూనిట్ల రక్తదానం చేసి రికార్డు నెలకొల్పా రు. అలాగే తమ సంస్థ ద్వారా నేత్రదానాలు చేపడుతూ, ఇప్పటి వరకు 18 మందితో నేత్ర దానాలు చేయించారు. అలాగే చనిపో యాక అవయవ దానం చేసేలా 120 మంది తో ఒప్పంద పత్రాలు రాయించారు.



అనాథ శవం చితికి నిప్పంటిస్తున్న అభయం స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, ఈవీఎస్, మోహన్ తదితరులు

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటేపల్లిలో 15 ఏళ్ల బాలిక పని మీద బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. మూడు రోజుల కిందట పని మీద బయటకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాకపోవడంతో బాలిక కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఎంతటికీ ఆచూకి తెలియకపోవడంతో బాలిక తల్లి వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధంతా ఒకటే

(5వ పేజీ తరువాయి)

చేసింది. ఈ క్రమంలో అధికారంలోకి రాగానే నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపుకు కీలక నిర్ణయం తీసుకుంది. తొలి విడతగా హైకోర్టు పరిధిలో ఉన్న బిల్లులన్నింటినీ చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. అందుకు గానూ రూ.250 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది. వెంటనే ఈ బిల్లులన్నింటినీ అప్‌లోడ్ చేసి చెల్లింపులు జరపాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించింది. మలి విడతగా మిగిలిన బిల్లులన్నింటినీ చెల్లించేలా నిర్ణయించింది. దీంతో పనులు చేసిన వారంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే వారి ఆనందం జిల్లాలోని ఇరిగేషన్ అధికారుల తీరుతో ఎక్కువ కాలం కొనసాగలేదు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల కార్యాలయాల నుంచి బిల్లులను అప్‌లోడ్ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అక్కడ పని చేస్తున్న కొందరు సిబ్బంది పర్సంటేజీలు ఇస్తే గానీ బిల్లులు పంపేది లేదు అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నో తంటాలు పడ్డాక ఇప్పుడు ప్రభుత్వం దయచూపి బిల్లులు మంజూరు చేస్తే వాటిని ఇచ్చేందుకు కూడా ఇరిగేషన్ అధికారులకు మనసు రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

నా దగ్గర ఆగడం లేదు

నా దగ్గరకు వచ్చిన బిల్లులను వెంటనే పంపేస్తున్నా. నేను ఆపడం లేదు. కింది స్థాయి సిబ్బంది నుంచి బిల్లులు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి.ఈ విషయాన్ని పరిశీలించి వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటా.

- నాగరాజు, నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ

కందుకూరులో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయండి

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులో ఖాదీ, గ్రామ పరిశ్రమల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి జితన్ రామ్‌ను కోరారు. ఢిల్లీలో మంత్రిని కలిసిన సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ 50 ఏళ్లనాడు కందు కూరులో ఏర్పాటు చేసిన ఖాదీ కార్యాలయం శిథిలావస్థకు చేరిందన్నారు, దాని స్థానంలో స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, భారత అంతరిక్ష రంగంలో గత ఐదేళ్లలో ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలను తెలియ చేయాలని పార్లమెంటులో వేమిరెడ్డి కేంద్రాన్ని కోరారు. ఇందుకు ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమాధానమిచ్చారు. ఇస్రో, ప్రైవేటు కంపెనీల మధ్య అంతరిక్షానికి సంబంధించి ఎలాంటి ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టులు లేవన్నారు. అంతరిక్ష పరిశోధన, సాంకేతిక అభివృద్ధిలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం చర్యలుతీసుకుందని చెప్పారు.



కేంద్రమంత్రిని సత్కరిస్తున్న వేమిరెడ్డి

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆనంద్

● వీక్షించిన జేసీ, డీఆర్వో



కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ను నెల్లూరు తిక్కన భవన్ నుంచి వీక్షిస్తున్న జేసీ కార్తీక్, డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన విజయవాడలో తొలిరోజు బుధవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఓ ఆనంద్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను, సూచనలను శ్రద్ధగా విన్నారు. నెల్లూరుజిల్లా అభివృద్ధికి సంబంధించి సమగ్ర నివేదికను కలెక్టర్, కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు తీసుకు వెళ్లారు. కాగా నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన ప్రాంగణం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయ్‌భాస్కర్‌రావులు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి సందేశాన్ని విన్నారు.



కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

నాగూర్ మీరాస్వాముల గంధం మత సామరస్యానికి ప్రతీక

● రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం

కావలిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణం జెండాచెట్టు దర్గా వద్ద బుధవారం నాగూర్ మీరాస్వాముల గంధమహోత్సవం వైభవంగా జరిగింది. కావలిలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ గంధమహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తజనం తరలివచ్చి దర్గాలో ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాన్ని హిందు, ముస్లింలు కలిసి నిర్వహిస్తారు. విద్యుద్దీపాలంకరణలో నాగూర్ దర్గాను పోలిన భారీ సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫకీర్ల బృందంచే తప్పెట్ల ఆధ్యాత్మిక గానమేళ, బెంగళూరు, తమిళనాడుకు చెందిన ఖవ్వాలి బృందాల మధ్య జుగల్ బంది (ఖవ్వాలి పోటీలు) సినీ పాటకచేరి, డ్యాన్స్‌బేబి డ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● గంధమహోత్సవానికి సహకారం కొనసాగిస్తా : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

తాను పదవిలో ఉన్నా లేకున్నా రాజకీయాలకతీతంగా గంధమహోత్సవానికి తానందించే సహకారం కొనసాగిస్తానని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ప్రకటించారు. దర్గాలో ప్రార్థనలు నిర్వహించి దర్గా ఆచార సత్కారమందుకున్నారు.

● కనులపండువగా గంధం ఊరేగింపు

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం షేక్ ఖాదర్‌సాహెబ్ ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపు ప్రారంభించి పురవీధుల మీదుగా దర్గా వరకు సాగింది. విశేష అలంకరణలు నౌరంగ్ బాజా, మంగళ వాయిద్యాలతో మిరిమెట్లు గొలిపే బాణాసం చా నడుమ నిర్వహించిన గంధమహోత్సవం ఊరేగింపు భక్తులను కనువిందు చేసింది. నిర్వాహక కమిటీ బాధ్యులు ఖాదర్‌బాషా (ఇట్టు) ముస్తాఫా, రఫీ, భక్తజనం పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న హిందువులు, ముస్లింలు

గట్టెక్కేదెట్టా...?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వమే ఎన్నికలకు తెరలేపింది. చెరువుల పరిధిలో అభివృద్ధి పనులన్నీ సాగునీటి సంఘాల చేతుల మీదుగానే జరగనున్నాయి.దీంతో ఈ ఎన్నికలకు మరింత ప్రాధాన్యత పెరిగింది. ప్రస్తుతం రూ. 5లక్షలకు లోబడిన పనులన్నీ సాగునీటి సంఘాలకే కేటాయించాలన్నది నిబంధన. త్వరలో ఈ మొత్తాన్ని రూ.10 లక్షల వరకు పెంచాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో చెరువులు, కాలువల అభివృద్ధి పనులన్నీ సాగునీటి సంఘాల చేతికే వస్తాయి. ఈ కారణంగా పోటీ కూడా పెరిగింది.

● ఏకగ్రీవం దిశగా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలంతా టీడీపీకి చెందినవారే. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం దిశగా సాగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారం రోజులుగా ఎమ్మెల్యేలు ఈ పనిమీదే బిజీగా ఉన్నారు. సంఘాల పరిధిలోని గ్రామ నాయకులను పిలిపించి ఏకగ్రీవం దిశగా అభ్యర్థుల పేర్లు ఖరారు చేస్తున్నారు.

● ఎమ్మెల్యేలకు కొత్త చిక్కులు

అన్నీ సవ్యంగా సాగుతున్నాయనుకుంటున్న సమయంలో ఎమ్మెల్యేలకు కొత్త చిక్కులు ఎదురయ్యాయి. నిన్న మొన్నటి వరకు సాగునీటి సంఘాల ఎన్నికల్లో జనసేన,బీజేపీల ప్రస్తావన లేదు. ఈ రెండు పార్టీలకు గ్రామాల్లో పెద్దగా క్యాడర్ లేదు కాబట్టి... ఆయా పార్టీల నేతలు కూడా వీటిపట్ల ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలోనే భాగస్వామ్య పార్టీల సంగతి మరిచి పోయి, టీడీపీ నేతలు సంఘాల వారీగా అభ్యర్థులను ఎంపిక చేసుకొంటూవచ్చారు. అయితే సాగునీటి సంఘాల్లో జన సేన, బీజేపీలకు కూడా అవకాశం కల్పించాలని, ఆపార్టీ నేతలు సూచించే వారిని అభ్యర్థులుగా నిలబెట్టి గెలిపిం చాలని, టీడీపీ అధిష్ఠానం నుంచి ఎమ్మెల్యేలకు ఆదేశాలు అందాయి. అంతే వేగంతో జనసేన, బీజేపీ నాయకులు కూడా నియోజకవర్గాల వారీగా తమకు ఏ సాగునీటి సంఘాలు కావాలో తెలియ చేస్తూ జాబితాను ఎమ్మెల్యేలకు సమర్పిం చారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిని ఎమ్మెల్యేలు ఎదుర్కొంటున్నారు. జనసేన,బీజేపీ నాయకులు కోరే సంఘాలకు ఇదివరకే అభ్యర్థులను ఖరారు చేశారు. ఇప్పుడు వారికి ఎలా సర్ది చెప్పాలో అర్థం కాక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. మొత్తంమీద జిల్లా ఎమ్మెల్యేల నివాసాలు, కార్యాలయాలు సాగునీటి ఎన్నికల వాతావరణంతో సందడిగా మారాయి.

నీటి సంఘాల ఓటర్ల జాబితాలో అవకతవకలు

● కాంగ్రెస్ నేతల ఆందోళన

మనుబోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీటిసంఘాల ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయంటూ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కంపేట, జట్లకొండూరు గ్రామాల ఓటర్ల జాబితాలో అనర్హులకు చోటు కల్పించారన్నారు. ఈ విషయమై గతనెల 13న ఆర్డీవోకి ఫిర్యాదు చేశామన్నారు.అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మరోమారు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. స్పందించకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బళ్ల హరి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలి

వెంకటాచలం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత విద్యార్థులతో సమానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు అన్నారు. మండలంలోని కసుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్మైల్ ఫౌండేషన్, షెల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. నంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పది పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పధం పెంపొందించేందుకు, సామాజిక సమస్యలను అధిగమించడంలో సైన్స్‌ను సాధనంగా మలిచి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికేందుకు సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ ఎడ్యుకేషన్ సీనియర్ మేనేజర్ కిషోర్, మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్, స్మైల్ ఫౌండేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ విజయసారధి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ శేషయ్య ఫౌండేషన్ ప్రతినిధులు సుభాషిణి, మురళి, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్‌లో సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సుధీర్‌బాబు

సమస్యల పరిష్కారం కోసం కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): జీతాలు, పెండింగ్ బకాయిలు చెల్లించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రావలసిన రెండు నెలల జీతాలతోపాటు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సబ్బులు, నూనెలు, యూనిఫామ్‌లు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగయ్య, సీపీఎం నాయకులు డేవిడ్ రాజు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ ఉదంతంపై పౌరసమాజం స్పందించాలి


మాట్లాడుతున్న బీజేపీ నేత ఆర్డీ విల్సన్

కావలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాలకు వ్యతిరేకంగా యావత్ భారత దేశం స్పందించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌డీ విల్సన్ పిలుపునిచ్చారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులు మతం మారాలని, అక్కడే ఉండాలంటే పన్నులు కట్టాలని తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇలా లక్షల మంది హిందువులపై అరాచకాలు జరుగుతుంటే భారత్‌లోని కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు పెదవి విప్పకపోవడం బాధాకరమన్నారు. అక్కడ ఉన్న హిందువులు తమ ఆస్తులు అమ్ముకుని బయటకు రావాలన్నా రాలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. బంగ్లాదేశ్‌లో సెక్యులర్ రాజ్యాంగం ఉన్నప్పటికీ దమనకాండ జరుగుతూ మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి జషీయుద్దీన్ ఇది మాదేశ అంతర్గత విషయం అనడం దుర్మార్గమన్నారు. మానవహక్కులు అక్కడ ధ్వంసం అవుతుంటే ప్రశ్నించలేకపోవడం దారుణమన్నారు. బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా మాట్లాడుతున్న ఇస్కాన్ సంస్థ బాధ్యులు చిన్మయ్‌ని అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు కే. బ్రహ్మానందం, అంచిపాకల కమల, సీవీసీ సత్యం, మంద కిరణ్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మార్కులు రిజిస్టరులో నమోదు చేయాలి


విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న స్వీయ మదింపు పరీక్షల్లో విద్యార్థుల జవాబు పత్రాలను వెంటనే ఉపాధ్యాయులు మూల్యాంకనం చేసి వారి మార్కులను రిజిష్టర్లలో నమోదు చేయాలని ఎంఈవో-1 మస్తాన్‌వలి సూచించారు. ఆయన బుధవారం మండలంలోని మాసాయిపేట మొయిన్, ఉర్దూ, దళితవాడ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిష్టర్లు, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పాఠశాల తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, అర్షియా, హాజిరా పాల్గొన్నారు.

మాలల మహాగర్జన సభను జయప్రదం చేయండి



ప్రచారం నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

కందుకూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని నల్లపాడులో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు, వివిధ సంఘాల జేఏసీ నేతలు కోరారు. బుధవారం కందుకూరు, వలేటివారిపాలెం, గుడ్లూరు మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కందుకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో యువత, ఉద్యోగులు, విద్యార్థులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాలేటి కోటేశ్వరరావు, బొట్లగుంట శ్రీనివాసులు, గుంటక మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే నిర్వహించాలి

ఏఎస్ పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లార్వావ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారిణి హెచ్ హుసేనమ్మ తెలిపారు. బుధవారం ఆమె చిరమన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని ల్యాబ్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చిరమన, హసనపురం గ్రామాలలో ఇంటింటికీ తిరిగి లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్యురాలు బి జ్యోతి రాణి, ఎస్‌యుఓ షేక్ ఖాదర్ బాషా,హెచ్‌ఈవో షేక్ షఫీ, ఎఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

బిట్రగుంట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమగ్రాభివృద్ధి లక్ష్యాలపై బోగోలు మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి పరిశీలకులు ఏ.రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు మహాత్మగాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల జీవన విధానం, ఆర్థిక పరిస్థితులపై గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో చర్చించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, ఈటీసీ లింక్ ఆఫీసర్ బీ.వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ నయామ్ తాజ్ హసన్, ఏపీవో శ్రీనివాసులు, ఏపీఎం ప్రవీణ్, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

'మోహన్‌బాబును అరెస్టు చేయాలి'

వింజమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబును వెంటనే అరెస్టు చేయాలని స్థానిక జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వింజమూరు జర్నలిస్టు సంఘం నాయకులు గువ్వల రవీంద్రారెడ్డి, మిడతల హజరత్‌రెడ్డి, లెక్కమనేని రాజేష్‌నాయుడు, మూలి హజరత్‌రెడ్డి, సాధం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు దుత్తలూరు సీడ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఈనెల 15న కావలి, నెల్లూరు, 22న కందుకూరు, ఆత్మకూరు డివిజన్ల పరిధిలోని మండలాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. 29న దుత్తలూరు సీడ్స్‌లో ఫైనల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఘన నివాళి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమిళ రచయిత, పత్రికా సంపాదకుడు సుబ్రమణ్యేశ్వరస్వామి జయంతి వేడుకలను స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ జి. కృష్ణారెడ్డి, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ రఘునాథరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


తూర్పుబోయమడగలలో పనిచేయని చేతిపంపు


గుంతలమయమై అధ్వానంగా ఉన్న రహదారి


ఇస్కపల్లి వద్ద తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సమస్యల వలయంలో పల్లెలు

- ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

వరికుంటపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఏళ్ల తరబడి పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు. కొండ్రాజుపల్లి, తూర్పుబోయమడగల బస్టాండ్ సెంటర్లలోని చేతిపంపులు మరమ్మతులకు గురై ఏళ్ల తరబడి వెక్కిరిస్తున్నాయి. ఎన్టీఆర్ సుజల స్రవంతి, రక్షిత తాగునీటి పథకాల ట్యాంకులు సైతం నిరుపయోగంగా మారి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అలాగే రామాపురం నుంచి కాకొల్లువారిపల్లి మీదుగా రింగురోడ్డు నిర్మాణం కలగానే మిగిలింది. పలుమార్లు టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోకపోవడంతో గుంతలమయంగా మారిన రహదారులే దిక్కుగా మారాయి. పలు గ్రామాల ప్రధాన, అంతర్గత రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. జీ.కొండారెడ్డిపల్లి, వరికుంటపాడు, ఇస్కపల్లి, కాంచెరువు తదితర గ్రామాల్లో అతి తక్కువ ఎత్తులో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గువ్వాడి గ్రామంలోని ప్రధాన రహదారి వెంట పేడదిబ్బలు, చెత్తా చెదారం పేరుకుపోవడంతో అటుగా వెళ్లే ప్రజలతో సహా సమీపంలోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎక్కడ రోగాలపాలు కావాల్సి వస్తుందేమోనని బెంబేలెత్తిపోతున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో నిర్మించిన నాడెప్ తొట్టెలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పల్లెల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

- రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



వలేటివారిపాలెం: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఇంటూరి

వలేటివారిపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల నుంచి వచ్చిన ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీభూమి-మీహక్కు కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తునట్లు తెలిపారు. అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రతి గ్రామంలో భూసమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా సర్వే చేస్తే అలాంటి సర్వేయర్లపై కేసులు నమోదు చేయాలని సూచించారు. నిజమైన భూహక్కుదారులకు అన్యాయం చేయవద్దని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను నా దృష్టికి తీసుకొస్తే సబ్‌కలెక్టర్, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తప్పు చేసిన అధికారులను ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ అబ్దుల్‌అమీద్, సర్పంచ్ సాధు శ్రీలత, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, టీడీపీ నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, వలేటి మధుసూధన్‌రావు, కాకుమాను అంజనేయులు, కాకుమాను హర్షకుమార్, వలేటి నరసింహం, కొంకా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

- సంగం : మండలంలోని కొరిమెర్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు సర్వే నెంబర్లు తేడా, విస్తీర్ణం, పాసు పుస్తకాలు వంటి పలు భూ సమస్యలపై వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.
- జలదంకి : రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీకి 45రోజుల్లో పరిష్కారం దొరుకుతుందని తహసీల్దారు ప్రమీల పేర్కొన్నారు. మండలంలోని చామదల గ్రామసచివాలయలం ఆవరణలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు తమ భూములకు సంబంధించి ఆన్‌లైన్ రికార్డులలో ఉన్న తప్పులపై అర్జీలు అందజేశారు. కొన్ని సమస్యలను తహసీల్దారు అక్కడే పరిష్కరించారు. ఈ సదస్సులో ఆర్ఐ శ్రీజ, వీఆర్వో మణికంఠ, తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి పాల్గొన్నారు.
- అల్లూరు : మండలంలోని బీరంగుంటలో బుధవారం తహసీల్దారు లక్ష్మీనారాయణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు తమ భూములపై వినతులు అందజేయగా కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈకార్యక్రమంలో వీఆర్వో సలామ్‌జీ, నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- ఉలవపాడు : మండలంలోని భీమవరం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ సమస్యలపై 32 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ లావణ్య తెలిపారు. సదస్సులో మండల ప్రత్యేక అధికారి, జిల్లా డిప్యూటీ లేబర్ అధికారి ఎం వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ ఖాదర్ హుస్సేన్, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పరితపించే నేత చంద్రబాబు నాయుడు

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన దగుమాటి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల కోసం పరితపించే నేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, ఆయన సహకారంతో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే 12 మంది లబ్ధిదారులకు రూ.10,77,188 చెక్కులను అందచేశారు. ఆరోగ్యశ్రీ కిందకు రాని వారికి వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి నెల రోజులలోనే చెక్కులను అంద చేస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రయివేటు వ్యక్తుల ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. ల్యాండ్‌టైటలింగ్ యాక్ట్ తీసుకు వచ్చి ప్రజల ఆస్తులు కాజేయాలని చూశారన్నారు. రీసర్వే పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించటానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వంలో మన సమస్య లను మన ముంగిటే పరిష్కరించటం జరుగుతోందన్నారు. బీద మస్తాన్ రావు తిరిగి టీడీపీలో చేరటం, రాజ్యసభ సభ్యుడిగా మళ్లీ ఎంపిక కావటం అభినందనీయమని, ఆయనతో కలిసి కావలిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రైతుల సమస్యలు తీరాలన్నా, తాగునీటి కష్టాలు తొలగాలన్నా ఈనెల14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్ బాబు, జ్యోతి బాబూరావు, బీద గిరిధర్, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, ఉప్పాల వెంకట్రావు, చిలకపాటి వెంకటేశ్వర్లు,రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : డీఈ

- సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల


ఉదయగిరి రూరల్ : నోటిఫికేషన్ విడుదల చేస్తున్న డీఈ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఇరిగేషన్ కార్యాలయ సబ్ డివిజన్ పరిధిలోని సాగునీటి చెరువులు, జలాశయాలు, డిస్ట్రిబ్యూటరీలకు ఈనెల 14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి బుధవారం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయంలో ఎన్నికల నోడల్ అధికారి చంద్రమౌళి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి జలవనరుల శాఖ కార్యాలయ పరిధిలో 34 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలకు అవసరమైన పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం తదితర ఏర్పాట్లు చేశామన్నారు. పోటీచేసే అభ్యర్థి వారికి ఓటుహక్కు ఉన్న టీసీలోనే పోటీ చేయాలన్నారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు.

- సంగం : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లానాయక్ ఆధ్వర్యంలో నోడల్ అధికారి వినయ్‌కుమార్ సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. మండలంలోని రెండు మేజర్ సాగునీటి వినియోగదారుల సంఘాలు పడమటిపాళెం, అన్నారెడ్డిపాళెం, నాలుగు మైనర్ సాగునీటి సంఘాలైన జంగాలదొరువు, సంగం పంపింగ్ స్కీమ్, చెన్నవరపాడు, మర్రిపాడు నీటి సంఘాలకు ఈనెల 14వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఆరు సాగునీటి వినియోగదారుల సంఘాల్లో 44 టీసీ మెంబర్లను ఓటు హక్కు కలిగిన రైతులు ఎన్నుకోనున్నారు. ఈ సంఘాల్లో మొత్తం 2407 మంది రైతులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఆమేరకు ఆయా ఎన్నికల పీవోలు ఆయా సాగునీటి సంఘాల ఎన్నికలపై పంచాయతీలు, సచివాలయాల్లో నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డులో అంటించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వినయ్‌కుమార్, పీవోలు పాల్గొన్నారు.
- వలేటివారిపాలెం : మండలంలోని చుండి, అంకభూపాలపురం, పోకూరు, శాఖవరం, బడేవారిపాలెం నలదలపూరు గ్రామాల్లోని సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అయినట్లు ఎన్నికల అధికారి నరేంద్రదేవ్, అసిస్టెంట్ అధికారి హర్షవర్దన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా నలదలపూరు గ్రామ సచివాలయంలో నోటీస్‌బోర్డులో ఎన్నికల నోటిఫికేషన్ పెట్టారు. ఈసదర్భంగా నరేంద్రదేవ్ మాట్లాడుతూ ఈనెల 14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, అనంతరం ఎన్నిక జరగనున్నట్లు తెలిపారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేలో నమోదు చేయించుకోవాలి


ఆత్మకూరు: సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆత్మకూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే సూక్ష్మ, చిన్న, కుటీర పరిశ్రమలు నిర్వహించేవారు ఎంఎస్ఎంఈ సర్వేలో నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాళెం సచివాలయాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని సూచించారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా ఇంటి పన్నుల వసూల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ సచివాలయాల సిబ్బంది నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో అప్పాజి పేర్కొన్నారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కేటగిరి-2 విద్యుత్ కనెక్షన్ ప్రతి ఒక్కరికీ ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వే చేయించుకున్న ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందుతా యన్నారు. మ్యాపింగ్ కాకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

కావలిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ సూపర్ బూటకమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముసునూరులోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లా డుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను, రైతులను నిలువునా ముంచారన్నారు. ఖరీఫ్ ముగిసి రబీ వచ్చినప్పటికీ అన్నదాత సుఖంగా లేరన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా వైసీపీ ప్రభుత్వం లో అన్నదాతకు రైతుభరోసా కింద సంవత్స రానికి రూ. 13,500 అందించారని, చంద్ర బాబు ముఖ్యమంత్రి కుర్చీ కోసం బూటకపు వాగ్దానాలు చేసి గద్దెనెక్కి ప్రజలను దగా చేసారన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన జరగనున్న కలక్టరేట్ ధర్నా జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్న, రాఘవులు పాల్గొన్నారు.

రాళ్లపాడు దెబ్బతిన్న గేటును తొలగించి నీరిస్తాం

- డీఈఈ ఎం వెంకటేశ్వర్లు



లింగసముద్రం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు దెబ్బతిన్న గేటును తొలగించి రైతులకు నీరందిస్తామని డీఈఈ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు.

? రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము గేటు ఎందుకు దెబ్బతింది.

! ఫెంగల్ తుపాను తరువాత కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి 17 అడుగులు, తరువాత కురిసిన వర్షాలకు 20 అడుగులతో ప్రాజెక్టు పూర్తిగా నిండింది. రైతులకు వరినాట్లకు నీరిచ్చేందుకు గేటు ఆపరేట్ చేస్తుండగా బోల్టు విరిగి కింద పడిపోయింది.

? ఈ గేటును ఎప్పటికి తొలగిస్తారు

! ప్రస్తుతం నిపుణులైన మెకానిక్‌ల ద్వారా గేటును తొలగించేందుకు కృషి చేస్తున్నాము. గేటు బయటకు రాకపోతే, దానిని పగులగొట్టి రెండవ గేటు ద్వారా నీరిస్తాం.

? ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే రేడియల్ గేట్ల పరిస్థితి ఏమిటి

! కొత్త స్పిల్‌వేలోని 5 గేట్లలో నాలుగు పనిచేస్తున్నాయి. 5వ గేటును ఆపరేట్ చేయడంలేదు. దీని రోప్ మరమ్మతులకు గురైంది.

? పాత స్పిల్‌వే గేట్ల పరిస్థితి ఏమిటి.

! పాత స్పిల్‌వేలోని 10 క్రస్ట్‌గేట్లు, 2 పూడు గేట్లు పదేళ్ల నుంచి ఆపరేట్ చేయడం లేదు. అయితే ఆపరేట్ చేస్తే ఏదైనా జరుగుతుందని అనుమానం.

న్యూస్ బాక్స్

పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

జలదంకి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జలదంకి పోలీస్‌స్టేషన్‌ను కావలి డీఎస్పీ శ్రీధర్ బుధవారం తనిఖీ చేశారు. ఎఫ్ఐఆర్, తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాలు అదుపు చేయడంలో ఎస్ఐ లతీఫున్నీసా, సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కలిగిరి సీఐ వెంకట నారాయణ ఉన్నారు.

భూముల కబ్జాపై విచారణ

కావలిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల కబ్జాపై బుధవారం ఆర్ఐ వృద్వీ విచారణ చేపట్టారు. ముసునూరు మందాటి చెరువు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లు మందాటి చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ కనుమూరు భాస్కర్‌రెడ్డి లోకాయుక్తకు చేసిన ఫిర్యాదుపై ముసునూరు అయ్యప్పగుడి పక్కన స్థలంలో చేపట్టిన నిర్మాణాలు పరిశీలించి ఆభూముల స్థితిగతులపై విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూములు కబ్జాపై లోకాయుక్త స్పందించడం రెవెన్యూ అధికారులు విచారణ జరిపడం శుభపరిణామమని, మందాటి చెరువు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమ పోరాటం కొనసాగిస్తామని భాస్కర్ రెడ్డి తెలిపారు.

రైతుసేవా కేంద్రాల పరిశీలన

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెరువుపల్లి, బండగానిపల్లి గ్రామాల రైతుసేవా కేంద్రాలను బుధవారం ఏవో ఆంజనేయులునాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సబంధించి పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే వరి, మినుము, పెసర, వేరుశనగ, బుడ్డ శనగలు సాగు రైతులు బీమా చేయించుకోవాలని సూచించారు. అలాంటి వారికే ప్రభుత్వం నష్టపరిహారం ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంలో మెలకువలు పాటించాలి

అల్లూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వరిసాగులో ఎరవుల యాజమాన్యంలో రైతులు మెళలకువలు పాటించాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఇస్కపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గంగపట్నం శీనయ్య పాపనబోయిన జగన్మోహన్, వీఆర్వో మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు గురువారం ఉదయం 10నుంచి 11గంటల వరకు డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డీఎం శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో తిరుగుతున్న బస్సు సౌకర్యాలు, లాజిస్టిక్ సేవలు, ప్రస్తుతం అందిస్తున్న సేవల్లో ఏవైనా ఇబ్బందులున్నా, సౌకర్యాలు మెరుగుపర్చాలన్నా తగు సూచనలు, సలహాలు సెల్ నంబరు 9959225095కు ఫోన్ చేసి తెలుపవచ్చున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.